thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 16 కరీంనగర్ గురువారం, 27 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 1 నుంచి టోల్ బాదుడు..

చెన్నై: రాష్ట్రంలోని టోల్‌గేట్లలో వాహనాల రుసుమును రూ.5 నుండి రూ.25 వరకు పెంచనున్నారు. ఈ పెంచిన రుసుము ఏప్రిల్ ఒకటి నుండి వర్తింపజేయనున్నారు. జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 76 టోల్‌గేట్లున్నాయి. గత రెండేళ్లలో కొత్తగా 12 టోల్‌గేట్లు తెరిచారు. వీటిలో 40 టోల్‌గేట్లలో ఏప్రిల్ ఒకటి నుండి టోల్ గేట్ రుసుమును రూ.5 నుంచి రూ.25 దాకా పెంచనున్నారు. తక్కిన 48 టోల్‌గేట్లలో సెప్టెంబరు ఒకటి నుండి రుసుము పెంచనున్నారు. నగరంలోని వానగరం, సూరపట్టు టోల్‌గేట్, చెన్నై - కోల్‌కతా రహదారిలోని నల్లూరు టోల్‌గేట్, తాంబరం - దిండివనం మార్గంలోని ఆత్తూరు టోల్‌గేట్, పరనూరు టోల్‌గేట్లలో ఈ కొత్త రుసుము అమలులోకి రానున్నాయి. దీనివలన వల్ల కాయగూరులు, కిరాణా సరకుల ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

# సన్న బియ్యం పంపిణీకి రెడీ..

## 30న హుజూరాబాద్‌లో ప్రారంభించనున్న సీఎం

## వచ్చే నెల నుంచి రేషన్ షాపుల ద్వారా జనానికి

## తెలంగాణ ప్రజలకు శుభవార్త



హైదరాబాద్ : రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు జిల్లాల్లో సివిల్ సప్లై ఆఫీసర్లు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది కానుకగా ఈ పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి హుజూరాబాద్‌లో ప్రారంభించనున్నారు. ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం అందించేందుకు వీలుగా స్టాక్ పాయింట్లకు సన్నబియ్యం నిల్వలు చేరుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందిన అంతర్గత ఆదేశాల మేరకే సివిల్ సప్లై ఆఫీసర్లు సన్నబియ్యం మరాడించి తెప్పించి, రెడీగా ఉంచుతున్నట్లు తెలిసింది.

**ఏడాదికి 22 లక్షల టన్నులకుపైనే..** తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులు ఉండగా, 2,81,71,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. కొత్తగా మరో 10 లక్షల రేషన్ కార్డులు మంజూరు అయ్యే అవకాశం ఉందని ఆఫీసర్లు చెప్తున్నారు. ఈ లెక్కన అదనంగా 30 లక్షల మంది లబ్ధిదారులు పెరుగుతారు. వీరికి ఏడాదికి దాదాపు 22 నుంచి 24 లక్షల టన్నుల బియ్యం అవసరమవుతాయని అంచనా. వానకాలం సీజన్‌లో ప్రభుత్వం 24 లక్షల టన్నుల సన్న వడ్లను సేకరించింది. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో వడ్ల మిల్లింగ్ వేగంగా సాగుతోంది. వానాకాలంలో సేకరించిన వడ్ల?ద్వారా గరిష్టంగా 15 నుంచి 16 లక్షల టన్నుల సన్న బియ్యం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది చివరికల్లా సన్నబియ్యం తక్కువ పడితే మరో 6 నుంచి 8 లక్షల టన్నుల బియ్యాన్ని యాసంగిలో సేకరించే వడ్ల ద్వారా సమకూర్చుకుంటామని సివిల్?సప్లై ఆఫీసర్లు చెప్తున్నారు.

**60 శాతం దొడ్డుబియ్యం పక్కదారి..** రేషన్ షాపుల ద్వారా ఇప్పటిదాకా పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. సుమారు 60 శాతం బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ షాపుల దగ్గర వ్యాపారులు దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్ల దాణా, లిక్కర్ తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో సన్న బియ్యానికి డిమాండ్ ఎక్కువ కావడంతో రేట్లు బాగా పెరిగిపోయాయి. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతో పాటు లబ్ధిదారులు కూడా తినడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న వారికి సన్నబియ్యం ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2024 వానాకాలం సీజన్‌లో సన్న వడ్ల పంటను పెంచేందుకు క్వింటాల్?కు రూ. 500 బోనస్ ప్రకటించింది. సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల దొడ్డు బియ్యం రీసైక్లింగ్‌కు కూడా అడ్డుకట్ట పడుతుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. దొడ్డు బియ్యాన్ని తక్కువ రేటుకు కొని కొందరు మిల్లర్లు రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ కింద ప్రభుత్వానికే అప్పగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**స్టాక్ పాయింట్లకు సన్నబియ్యం...** వానాకాలం సీజన్‌లో జిల్లాల్లో సేకరించిన సన్నవడ్లను నూక కాకుండా మూడు నెలల తర్వాత మరాడించడం ప్రారంభించిన అధికారులు, వాటిని స్టాక్‌పాయింట్లకు చేరుస్తున్నారు. కొన్ని జిల్లాల్లో సరిపడా ధాన్యం దిగుబడులు రాకపోవడం, ఇంకొన్ని జిల్లాల్లో దొడ్డు వడ్లు ఎక్కువగా పండించడంతో ఆయా జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి సన్నబియ్యం తెప్పించి నిల్వచేస్తున్నారు.

**30న హుజూర్‌నగర్‌కు సీఎం రేవంత్ రెడ్డి...** ఈనెల 30న ఉగాది పర్వదినం నాడు హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30న సాయంత్రం 5 గంటలకు సీఎం హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి బయలుదేరుతారు. 5.45 గంటలకు హుజూర్‌నగర్ శివారులోని రామస్వామి గుట్ట వద్ద హెలిపాడ్‌లో దిగి అక్కడ నిర్మాణంలో ఉన్న 2వేల సింగల్ బెడ్రూం ఇళ్ల మోడల్ కాలనీని పరిశీలిస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి హుజూర్‌నగర్ పట్టణంలోని బహిరంగ సభా ప్రాంగణం సమీపంలోగల హెలిపాడ్‌లో 6.15 గంటలకు సీఎం దిగుతారు. 6.15 గంటలనుంచి 7.30 గంటల వరకు సభా వేదికపై నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. తదుపరి ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడతారు. రాత్రి 7.30 గంటలకు సీఎం హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరుతారు.. రాత్రి 9.45 గంటలకు సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## ఆ ముద్రను చెరిపేసే యత్నాల్లో ప్రధాని మోదీ.. 32 లక్షల పేద ముస్లిం మహిళలకు గిఫ్ట్!

ముస్లింలకు చేరువయ్యేందుకు భారతీయ జనతా పార్టీ రంజాన్ సందర్భంగా సౌగత్-ఎ-మోదీ కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా 32 లక్షల మంది పేద ముస్లింలకు గిఫ్ట్ ప్యాక్‌లను అందించాలని నిర్ణయించింది. తమ పార్టీ అన్ని మతాలను సమానంగా చూస్తుందంటున్నారు బీజేపీ నేతలు.. బీజేపీ అంటే ముస్లింలకు వ్యతిరేక పార్టీ అని ముద్రను చెరపేసే ప్రయత్నాల్లో ఉన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ముస్లిం ఓటర్లను ఆకట్టుకోవడానికి బీజేపీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. రంజాన్ సందర్భంగా సౌగత్-ఎ-మోదీ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. దేశవ్యాప్తంగా 32 లక్షల ముంది పేద ముస్లింలకు సౌగత్-ఎ-మోదీ కార్యక్రమంలో బహుమతులను పంపిణీ చేస్తారు. సౌగత్ ఎ మోదీ కార్యక్రమాన్ని మసీదు కమిటీలు, 32 వేల మంది కార్యకర్తల సహకారంతో బీజేపీ నిర్వహిస్తోంది.

తొలుత ముంబైలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా విస్తరించారు. ముంబైతో పాటు ఢిల్లీలో కూడా విజయవంతంగా సౌగతే మోదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ, బీజేపీ ప్రధాన



కార్యదర్శి దుష్యంత్ గౌతమ్ ఢిల్లీలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేదికపైకి కిట్లను స్వీకరించడానికి మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ముస్లింలకు ఇచ్చే గిఫ్ట్ ప్యాక్‌లో ఆహార పదార్థాలు, కొత్త దుస్తులు, వెర్మిసిల్లి, ఖర్జూరాలు, డ్రై ఫ్రూట్స్, చక్కెర వంటి వస్తువులు ఉంటాయి. మహిళలకు సల్వార్ కమీజ్, పురుషులకు కుర్తా పైజామాలు ఇస్తారు. ప్రతి కిట్ విలువ రూ. 600 వరకు ఉంటుంది. బీజేపీ మైనారిటీ మోర్చా నేతలకు లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత అప్పగించారు. మసీదు కమిటీ 100 మంది పేద ముస్లింలను ఎంపిక చేసి ఆ జాబితాను నిర్వాహకులకు ఇస్తారు. సౌగాత్-ఎ-మోదీని బీజేపీ ఒక గొప్ప చొరవగా భావిస్తుండగా, ప్రతిపక్షాలు దానిని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. మోదీ బహుమతి గురించి టిఎంసి ఎంపి కీర్తి ఆజాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లిం ప్రజలను ఆకట్టుకోవడానికి బీజేపీ ఈ ప్రయత్నం చేస్తోంది.

త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. బీహార్‌లో ముస్లిం ఓటర్ల శాతం ఎక్కువ. మళ్లీ అక్కడ ఎన్డీఏ కూటమి అధికారంలో రావడానికి ముస్లిం ఓటర్లు కీలకం కావడంతో బీజేపీ సౌగత్ ఈ మోదీ అస్త్రాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. ముస్లిం ఓట్ల కోసమే ఆకస్మాత్తుగా వాళ్లపై బీజేపీ ప్రేమ చూపిస్తోందని ఎస్పీ నేత అఖిలేశ్ విమర్శించారు. బీజేపీ చేపట్టిన సౌగతే మోదీ కార్యక్రమాన్ని ముస్లిం మతపెద్దలు స్వాగతిస్తున్నారు. బీజేపీపై ముస్లింలకు ఉన్న చెడు అభిప్రాయం దూరమవుతుందని అంటున్నారు.




భద్రాచలం: భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద సెల్‌ఫోన్, లంచ్ బాక్స్ లభ్యమయ్యాయి. ఓ వ్యక్తి బతికి ఉన్నట్టు సిబ్బంది గుర్తించారు. శిథిలాల కింద నుంచి ఓ వ్యక్తి ఆర్తనాదాలు వినిపించాయని సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది తెలిపారు. దీంతో అతన్ని సురక్షితంగా కాపాడేందుకు ఘటనా స్థలికి వైద్యబృందాన్ని రప్పించారు. దాదాపు 5 గంటలుగా సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే పేక మేడలా ఒక్కసారిగా భవనం కుప్పకూలిందని అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పించారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.




# వ్యసనాలకు రాష్ట్రంలో తావులేదు..

## తప్పు చేస్తే శిక్ష తప్పదు : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : బెట్టింగ్ వ్యవహారాలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ యాప్స్‌పై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించామన్నారు. దీనిపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను వేయాలని నిర్ణయించినట్టు అసెంబ్లీలో వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదన్నారు ముఖ్యమంత్రి. అభివృద్ధి కోసం కలిసి వస్తే అన్ని పార్టీల సలహాలు, సూచనలు తప్పకుండా పాటిస్తామన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహించినా, నిర్వహణలో భాగస్వాములైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కేవలం ప్రచారం కల్పించేవారిని విచారించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదన్న సీఎం, పక్క రాష్ట్రాలు, పక్క దేశాల్లో కూడా విచారణ చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే అవసరమైన చర్యలు తీసుకునేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైతే చట్ట సవరణ చేసి శిక్షను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వ్యసనాలకు తెలంగాణలో తావులేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని కొందరు మాట్లాడుతున్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. నడిబజారులో న్యాయవాద దంపతులను నరికి చంపితే ఆనాటి ప్రభుత్వం స్పందించలేదు. ఆనాటి వెటర్నరీ డాక్టర్ అత్యాచార ఘటన విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు సీఎం రేవంత్. మహిళలపై జరిగిన అత్యాచారాల్లో 2020 లో దేశంలోనే రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందన్నారు. బాధితులపై సానుభూతితో ఉండి, నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. కానీ ఇలాంటి ఆరోపణలు చేసి ప్రభుత్వంపై దురుద్దేశాన్ని ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా శాంతిభద్రతలు క్షీణించాయని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు చేస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రాన్ని దివాళా తీయించి తెలంగాణ ప్రతిష్టను మసకబార్చేలా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు సీఎం. ఈ కుట్రలను తెలంగాణ సమాజం సహించదన్న సీఎం, అధికారం లేకపోతే క్షణం కూడా ఉండలేమన్న తరహాలో వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఇది తెలంగాణ సమాజానికి ఏ రకంగా మేలు చేస్తుందని సీఎం ప్రశ్నించారు. 15 నెలలుగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పాలన సాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా జానారెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకోండి.. సూచనలు ఇవ్వండి. మీరు హడావిడి చేసినంత మాత్రాన ఎన్నికలు రావని, మళ్లీ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చేది 2028లోనే అని సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బీఆర్ఎస్‌లో అంతర్గత పోటీ రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోందన్నారు. ముఖ్యమంత్రిగా నా దగ్గరకు తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. గజ్వేల్ శాసనసభ్యుడు వచ్చినా.. ఆ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. మొన్న పద్మారావు గారు తన నియోజకవర్గంలో సమస్యలపై కలిశారు%౫% వెంటనే ఆదేశాలు ఇచ్చామని గుర్తు చేశారు. మేం మంచిని మంచి అంటాం.. చెడును చెడు అంటాం.. మాకు చెడు ఆలోచనలు లేవని వెల్లడించారు. మమ్మల్ని బదనాం చేస్తే మీరు మంచి వారు కాలేరు.. మేం వివక్ష చూపం.. వివక్ష మా విధానం కాదని ముఖ్యమంత్రి అన్నారు. అడ్డగోలుగా మేం బడ్జెట్ ను ప్రవేశపెట్టలేదన్న ముఖ్యమంత్రి, చేసేదే చెప్తాం.. చెప్పిందే చేస్తాం అనే విధానంతో బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. 95 శాతం మేం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిజం కాబోతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం భూసేకరణ చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, 25 ఏండ్ల క్రితం బిల్లీరావుకు గచ్చిబౌలిలో భూమిని కేటాయించారన్నారు. ఆ భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని, ఇప్పటి వరకు బిల్లీరావు నుంచి భూమిని వెనక్కు తీసుకోలేదన్నారు సీఎం రేవంత్. ఓపెన్ ఆక్షన్ ద్వారా పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థలకు ఇవ్వాలని ముందుకు వస్తే.. అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు తీసుకొచ్చేందుకు అక్కడ విస్తరణ చేయాలనుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించాలా వద్దా? అని హరీష్ రావును సూటిగా అడిగారు సీఎం. రేడియల్ రోడ్లు వేయాలా వద్దా? అభివృద్ధి కోసం భూములు సేకరించాలా వద్దా? ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలా వద్దా? అంటూ సూటిగా ప్రశ్నలు సంధించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి ఫామ్ హౌస్‌లకు డైరెక్టు కాలువలు తీసుకెళ్లింది ఎవరు? అని సీఎం ప్రశ్నించారు. ప్రతీది అడ్డుకోవాలనే కుట్ర ఏ రకంగా మంచిదన్నారు. మేం తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని, మొత్తం తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. కుట్రలు, కుతంత్రాలకు, అసెంబ్లీలో మైకును వాడుకుంటామంటే ఒప్పుకోమని సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. అభివృద్ధి, భూసేకరణ విషయంలో మీరు అడ్డుపడకండి.. పరిహారం ఏం ఇవ్వాలో సూచనలు చేయండి అంటూ విపక్షాలను సీఎం కోరారు. ఇది ప్రభుత్వ ఖజానా నుంచి ఇచ్చేదే తప్ప.. ఎవరి ఇంట్లో నుంచి ఇచ్చేది కాదన్నారు.

మల్లన్న సాగర్ లో, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేసులు వేయించింది వాళ్లే, పార్టీలో చేర్చుకున్నది వాళ్లే అంటూ సీఎం ఎద్దేవా చేశారు. ఆనాడు పార్టీ మారిన వాళ్లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినా.. ఉప ఎన్నికలు రాలేదన్నారు. గతంలోనే రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయి? గతంలో ఆచరించిన సంప్రదాయాలనే ఇప్పుడు మనం ఆచరిస్తున్నాం. సభ్యులెవరూ ఆందోళన చెందొద్దు.. ఏ ఉప ఎన్నికలు రావు.. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు. మా దృష్టి రాష్ట్ర అభివృద్ధిపైనే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వానికి సహేతుకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.




## కేటీఆర్ వ్యాఖ్యలతో సభలో దుమారం.. తీవ్రంగా స్పందించిన భట్టి విక్రమార్క

హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో భారాస ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. పనులు కావాలంటే కాంగ్రెస్ నేతలు 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారాస సభ్యులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. దీనిపై భారాస సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఇటు కాంగ్రెస్, అటు భారాస సభ్యుల ఆందోళనతో సభలో వాతావరణం వేడెక్కింది. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. లేదంటే సభలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారాస సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. కేటీఆర్ గౌరవంగా మాట్లాడతారని ఊహించానని.. సభనే కాదు.. రాష్ట్రాన్నే ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మరోవైపు కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సభాపతి తెలిపారు. ఆ తర్వాత భారాస సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద వారు నిరసనకు దిగారు. 20, 30 శాతం ప్రభుత్వమంటూ నినాదాలు చేశారు.

## విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోంది: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ప్రతిస్థాయిలో విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శాసన మండలిలో విద్యాశాఖపై సీఎం మాట్లాడారు. "2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 75శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదు. తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానంలో తెలంగాణ 36వ స్థానంలో ఉంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అథమ స్థానంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు చదవలేని పరిస్థితి. ప్రతి స్థాయిలో విద్యారంగం రోజు రోజుకూ క్షీణించి పోతోంది.

**ప్రభుత్వమే కాదు.. సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం. 21వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఏడెనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 36వేల మంది టీచర్ల బదిలీ చేపట్టాం. కలెక్టర్లనైనా బదిలీ చేయవచ్చు గానీ, టీచర్ల బదిలీ ఆషామాషీ కాదు. 36వేల మంది టీచర్లను చిన్న ఆరోపణలు లేకుండా బదిలీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై రూ.1.08లక్షలు చొప్పున ఖర్చు చేస్తున్నాం. ప్రైవేటులో రూ.50వేల వరకు ఖర్చయితే.. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్ష ఖర్చవుతోంది. బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమిస్తూ రూ.23,108 కోట్లు కేటాయించాం. విద్యా రంగానికి భారీగా నిధులు కేటాయించినా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇందుకు ప్రభుత్వమే కాదు.. సమాజం బాధ్యత తీసుకోవాలి. లోతుగా విశ్లేషించి సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచన చేసినంత కాలం విద్యారంగం ప్రక్షాళన కాదు. విద్య పట్ల ప్రత్యేక విధానం తీసుకురావాలనేది ప్రభుత్వ ఉద్దేశం. విద్యారంగం బలోపేతానికి సూచనల కోసం విద్యా కమిషన్ ఏర్పాటుచేశాం.

**ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించాలి..** ఏటా లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. రూ.15వేలకు కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు పనిచేసే పరిస్థితి. నైపుణ్యం ఉన్న యువత దొరకట్లేదని కంపెనీలు చెబుతున్నాయి. తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒడిశా, బిహార్ నుంచి రావట్లేదు. మన వద్ద ఉన్న విద్యార్థులకు నైపుణ్యం లేక రోడ్లపై తిరుగుతున్నారు. మన నిర్లక్ష్యంతో సమాజ నైపుణ్యాల మేరకు విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయలేదు. నైపుణ్యాల పెంపునకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా పత్రిక ద్వారా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమం నడిపారు. గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో విద్యా ప్రమాణాల మెరుకు చర్యలు తీసుకుంటాం. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే స్థానిక సంస్థల్లో పోటీకి, ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అవకాశంపై చర్చించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి" సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు

## కాళేశ్వరం డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి: భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శాసనసభ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "కాళేశ్వరం 8వ ప్రపంచ వింత అని పెయిడ్ ప్రచారం చేయించారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలి" అని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు.

## గంజాయి లేడీ డాన్ సంగీత సాహు అరెస్ట్




హైదరాబాద్: పలు గంజాయి కేసుల్లో నిందితురాలు.. గత కొన్ని రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న గంజాయి లేడీ డాన్ సంగీత సాహును ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాలోని కుర్ధా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు నాలుగేళ్ల క్రితం గంజాయి దందాలోకి దిగింది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండటంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో మాట్లాడుతూ.. వారికి గంజాయి సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో ఇద్దరికి 41.3 కేజీల గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడింది. ధూల్‌పేటలో శీలాబాయ్, నేహాబాయ్, ఇష్కాసింగ్‌తో పాటు మరి కొందరికి గంజాయి సరఫరా చేసినట్టు పట్టుబడిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలంతో ఆమెపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆమెపై నగరంలో మొత్తం ఐదు కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సంగీత సాహు.. ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ నటి మాదిరిగా వీడియోలు పోస్టు చేస్తుంటుంది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటుంది. ఈ క్రమంలో ఒడిశా వెళ్లిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు.. అక్కడి పోలీసుల సహకారంతో ఆమెను అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. నిందితురాలిని పట్టుకున్న ఎస్టీఎఫ్ పోలీసులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.




హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనుంది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఉప్పల్ స్టేడియంలో మార్చ్ 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రధానంగా ఘట్‌కేసర్, హయత్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎల్బీనగర్, కోఠి, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, మేడ్చల్, కేపీహెచ్‌బీ, మియాపూర్, జేబీఎస్, ఈసీఐఎల్, బోయిన్‌పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహదీపట్నం, బీహెచ్‌ఈఎల్ వంటి వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియం వరకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది.

## తెలంగాణలో కలకలం రేపిన అప్సర హత్య కేసులో పూజారికి జీవిత ఖైదు



రంగారెడ్డి కోర్టు, మార్చి 26: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో యువతి అప్సర హత్య కేసులో రంగారెడ్డి కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నిందితుడు సాయి కృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. సాక్షాలు తారుమారు చేసినందుకు మరో ఏడేళ్లు అదనపు జైలు శిక్ష విధించింది. అప్సరను నాలుగేళ్ల పాటు ప్రేమ కలాపాలు జరిపాడు సాయి కృష్ణ. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అయితే పెళ్లి చేసుకోవాలని అప్సర ఒత్తిడి తీసుకురావడంతో ఆమెను అత్యంత దారుణంగా హత్య చేశాడు. శంషాబాద్‌లో అప్సరను చంపి కారులో తీసుకువచ్చి మ్యాన్‌హోల్‌లో పడేశాడు. సరూర్‌నగర్‌లో అప్సరను హత్య చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. శంషాబాద్ నుంచి అప్సరను కారులో తీసుకెళ్లిన సాయి కృష్ణ అక్కడ ఆమెను చంపేసి తిరిగి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మ్యాన్‌హోల్‌లో పడేశాడు. ఈ కేసులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. అలాగే పోలీసులు కూడా త్వరగానే చార్జ్‌షీట్‌ను కూడా ఫైల్ చేశారు. నాలుగేళ్లపాటు అప్సరతో ప్రేమాయణం సాగించిన నిందితుడు పెళ్లి ఊసెత్తడంతో ఆమెను ఒక పథకం ప్రకారామే హత్య చేశాడు సాయికృష్ణ. నిందితుడు సాయికి సంబంధించి సుదీర్ఘ వాదనల తర్వాత రంగారెడ్డి కోర్టు పూజారికి జీవిత ఖైదు విధించింది. అలాగే సాక్షాలను తారుమారు చేశారంటూ మరో ఏడేళ్లపాటు సాయికృష్ణకు శిక్షను విధించింది కోర్టు. ఈ కేసులో రెండు వేర్వేరు అంశాలపై విచారణ సాగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం ఎట్టకేలకు నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. రంగారెడ్డి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసే వెసులుబాటు ఉంటుంది. కానీ ప్రస్తుతం సాయి హైకోర్టును ఆశ్రయిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. రంగారెడ్డి కోర్టు ఇటీవల కాలంలో సంచలనమైన కేసుల్లో జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిస్తోంది. ఈ కేసుతో కలిపి మొత్తం మూడు కేసుల్లో నిందితులకు కోర్టు జీవిత ఖైదును విధించింది. టెక్నికల్ ఎవిడెన్స్‌తో పాటు సాక్షుల స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని అప్సర హత్య కేసులో సాయికృష్ణకు శిక్షను ఖరారు చేసింది రంగారెడ్డి కోర్టు.

## 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పాం.. అలానే చేశాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భారాస ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. తొలుత పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. "దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట నినాదం.

ఆ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోంది. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పాం.. వేశాం. 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చాం. అనేక చట్టాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కులను గతంలో కాలరాశారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారు" అని భట్టి విక్రమార్క అన్నారు.

**భవిష్యత్తులో 'భూభారతి'పైనే ఎన్నికలకు: పొంగులేటి..** పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో భూభారతిపైనే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్‌ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు.

వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం" అని పొంగులేటి చెప్పారు.




తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ పీసీసీ పదవి రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నడని చెప్పాడు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారు అని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాళ్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది. సైరన్ సప్పుడు లెకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్లు అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. కేసీఆర్ పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగ తనాలు జరిగాయి. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. BRS గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

## కూనంనేని వ్యాఖ్యలపై నవ్వుతూ స్పందించిన సీఎం చంద్రబాబు

అమరావతి: తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. "గతంలో చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు.. ఏ ఇజం లేదు, ఇక టూరిజమే ప్రధానం అనేవారు.. ఏ ఇజం లేదంటే అప్పుడు మాకు కోపం వచ్చేది.. కానీ, నిజంగా ఖర్చులేని ఇజం ఏదైనా ఉందంటే అది టూరిజమే" అని కూనంనేని అన్నారు. చంద్రబాబు నాడు చెప్పిన మాటే నిజమంటూ ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. "ఏ ఇజం లేదని నేను అంటే కమ్యూనిస్టులు నాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఖర్చు లేని ఇజం టూరిజమేనని స్టేట్‌మెంట్ ఇచ్చారు. నా మాటలు, ఆలోచలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది" అని నవ్వుతూ చంద్రబాబు అన్నారు. అయితే.. ఇప్పుడంత సమయం లేదని, త్వరగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం పేర్కొన్నారు. "రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలి. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజమే" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# "తెలంగాణకే తలమానికమైన ధర్మపురి నాటక సంస్థ"

## - మార్చి 27...ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా



తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీ లక్ష్మనరసింహ నాట్య మండలి గత 88 సంవత్సరాలకు పైగా, కళామతల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936 లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు – నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూర గొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్వల్పంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువ లేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి వైద్యులకు కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంధ్ర ప్రభుత్వం మరోవైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసాయి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వంలో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాటకమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కసిరెడ్డి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె రంగాచార్య, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య వాచం కృష్ణయ్య, జగన్నారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు (రాష్ట్ర మాజీ మంత్రి), 1946 లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, స్వానం నరసింహా రావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుధా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు, స్వానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం లక్ష్మీ నరసింహ బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టికెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజ ద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యమున్ని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కళోజ్వల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులు దాద గారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణ లోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఒజ్జల రామచంద్రం, నరసింహాచారి, గుండి హనుమన్న, భోగం పురుషోత్తం, కొరిడె నరహరి వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984 లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ ఇన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో... ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాశెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు. 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి. ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955 లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983 లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాశర్ల లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు ఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, బీసీ కమిషన్ చైర్మన్ బి. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకృష్ణయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహామూర్తి, జన్నుంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, రాజగోపాల్, విజయ్, శ్రీనివాస్, రాంకిషన్, సంజీవ్, సురేందర్, పుల్లయ్య శాస్త్రి లకు తోడు కాశెటి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాలు ప్రదర్శనలను కొన సాగిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# ఏపీలో సీఎం మాజీ సీఎం కి డీలిమిటేషన్ అవసరం లేదా...రెండు పార్టీలు ముంచుతున్నాయా ?



డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని ఆ ప్రాంత ముఖ్యమంత్రులు కీలక నేతలు రాజకీయ పార్టీలు అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ రోజున దక్షిణాది అంతా డీలిమిటేషన్ అన్న దాని మీద ఊగిపోతోంది. డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని ఆ ప్రాంత ముఖ్యమంత్రులు కీలక నేతలు రాజకీయ పార్టీలు అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనకు సిద్ధపడుతున్నారు. నిజానికి ఇది రాజకీయ సమస్య కానే కాదు, రాష్ట్ర సమస్య. ఇంకా గట్టిగా చెప్పాలంటే భావి తరాల సమస్య. ఈ రోజున ఉన్న రాజకీయ పార్టీలు కానీ నాయకులు కానీ సరైన నిర్ణయం ఈ విషయంలో తీసుకోకపోతే మాత్రం భావి తరాలు తీరని నష్టానికి నోచుకుంటాయి. ఎంపీ సీట్ల నుంచే కాదు నిధుల విడుదల నుంచి అభివృద్ధి నుంచి కూడా దక్షిణాది రాష్ట్రాలు ఇబ్బందులు పడతాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇది అత్యంత సీరియస్ ఇష్యూగా ఉంది.

ఈ రోజున ఇంతకు మించిన తీవ్రమైన అంశం వేరొకటి లేదు. రాజకీయ పార్టీలు అన్నీ కలసి సంఘటితం కావాల్సిన తరుణం ఇది. ఇపుడు కాకపోతే మరెప్పుడు అన్నట్లుగా ఉద్యమించాలి. చూస్తూండగానే 2026 వచ్చేసి డీలిమిటేషన్ కనుక అమలు అయితే మాత్రం సౌత్ స్టేట్స్ తీరని నష్టంతో కొట్టుమిట్టాడుతాయన్నది మేధావులు నిపుణుల మాటగా ఉంది.పొరుగున ఉన్న తమిళనాడు అలాగే తెలంగాణా కర్ణాటక కేరళ వంటి రాష్ట్రాలు ఈ విషయంలో సీరియస్ గానే ఉన్నాయి. ఏపీ మాత్రమే నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఏపీకి సంబంధించి టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు వైపు అలాగే వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ వైపు దక్షిణాది పార్టీల నేతలు చూస్తున్నారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ ని అంతగా లెక్కలోకి తీసుకోవడం లేదు అని అంటున్నారు. ఇక చంద్రబాబు కానీ జగన్ కానీ డీలిమిటేషన్ మీద ఎంత వరకూ సీరియస్ గా ఉన్నారని కూడా సౌత్ స్టేట్స్ పార్టీలకు చెందిన పెద్దలు నిశితంగా గమనిస్తున్నారు. అయితే ఎంతో అనుభవం కలిగిన రాజకీయ నాయకుడు చంద్రబాబు డీలిమిటేషన్ గురించి అసలు పట్టించుకోవడం లేదు అని అంటున్నారు. ఇక జగన్ సైతం అఖిలపక్షం రోజున ప్రధానికి స్మూత్ గా ఒక లేఖ రాసేసి మమ అనిపించారు ఇది అలాంటి చిన్న విషయమా అన్నది కూడా ఆలోచించడంలేదని అంటున్నారు. అదే తమిళనాడులో అన్ని పార్టీలూ డీలిమిటేషన్ కి వ్యతిరేకంగా గొంతు కలిపాయి. అలాగే రాజకీయంగా బద్ధ శత్రువులు గా ఉన్న కాంగ్రెస్ బీఆర్ఎస్ ఈ రెండు పార్టీలకు చెందిన నాయకులు చెన్నై మీటింగుకు వెళ్ళి వచ్చాయి. అక్కడ సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ కూడా డీలిమిటేషన్ మీద చాలా సీరియస్ గానే ఉన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి అన్నది ఆలోచిస్తున్నారు. కానీ ఒక్క ఏపీ మాత్రమే తేడా కొడుతోంది అని అంటున్నారు. సీఎం చంద్రబాబు మాజీ సీఎం జగన్ ఇద్దరూ ఇంతటి కీలకమైన ఇష్యూని పట్టించుకోకపోవడం మీద విమర్శలు వస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 సీట్లకు ఒకటో రెండో పెరిగితే పెరగవచ్చు. అంతకు మించి ఏమీ ఉండదు. అంతే కాదు కేంద్రంలో చక్రం తిప్పాలన్న కలలకు శాశ్వతంగా సమాధి కట్టినట్లే అంటున్నారు. వైసీపీ టీడీపీ రెండూ ప్రాంతీయ పార్టీలు. ఈ పార్టీలకే ఎక్కువ ఇబ్బందులు డీలిమిటేషన్ వల్ల వస్తాయని అంటున్నారు. జాతీయ పార్టీల ప్రాధాన్యత పెరుగుతుందని దాంతో వాటి వైపే జనాలు మొగ్గు చూపితే కనుక ప్రాంతీయ పార్టీల అస్తిత్వమే లేకుండా పోతుంది అని అంటున్నారు. ఈ రోజున కేంద్రంలో ప్రభుత్వం ఉంది అంటే టీడీపీ మద్దతుతో. దాంతో ఎంతో కొంత బాబు మాట చెల్లుబాటు అవుతోంది. మరి డీలిమిటేషన్ తరువాత ఉత్తరాదికే రాజకీయం మొత్తం పరిమితం అయితే ఫ్యూచర్ లో ఈ పార్టీల సంగతేంటి అన్న ఆలోచన అయినా చేఅయాలి కదా అని అంటున్నారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ కి మేము వ్యతిరేకం అని బాబు అల్టిమేటం ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే జగన్ సైతం సౌత్ స్టేట్స్ కి జరుగుతున్న అన్యాయం మీద గళం విప్పాలని అంటున్నారు. అపుడే కేంద్రం కూడా తన ఆలోచనలు మార్చుకుంటుంది అని అంటున్నారు. సౌత్ లో ఎన్డీయే ప్రభుత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీనే. అక్కడ నుంచే ఆందోళన మొదలైతేనే ఆ సెగ వేరే లెవెల్ లో కేంద్రానికి తాకుతుంది అని అంటున్నారు. మరి బాబు జగన్ ఇద్దరూ డీలిమిటేషన్ మీద మోడీని ఢీ కొట్టడానికి సిద్ధమేనా అన్నదే చర్చ. అలా కనుక చేయకపోతే మాత్రం విమర్శల పాలు అవడం ఖాయమని అంటున్నారు.

# అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి మానవుడు...యూరీ గగారిన్

## మార్చి 27...యూరీ గగారిన్ వర్ధంతి




యూరీ అలెక్సియేవిచ్ గగారిన్ ఒక సోవియట్ పైలట్, వ్యోమగామి, ప్రపంచ%అ%వ్యాప్తంగా గుర్తింపు పొందిన అంతరిక్ష యాత్రికుడు. 1961 ఏప్రిల్ 12న, వోస్టోక్ 1 అనే అంతరిక్ష నౌకలో ప్రయాణించి, భూమిని ఒకసారి పరిభ్రమించిన మొదటి మానవుడిగా చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత అతన్ని అంతర్జాతీయంగా ఒక మహావ్యక్తిగా నిలిపింది. అంతరిక్ష పరిశోధనలో ఒక కొత్త శకానికి నాంది పలికిన గగారిన్, మానవ జాతికి సరికొత్త దిశను చూపించాడు. యూరీ గగారిన్ 1934, మార్చి 9న, సోవియట్ యూనియన్‌లోని రష్యాలోని స్మోలెన్స్క ప్రాంతంలోని క్లుషినో అనే చిన్న గ్రామంలో జన్మించాడు. ఆయన తండ్రి అలెక్సీ గగారిన్ ఒక పెదకారు (కార్పెంటర్), తల్లి అన్నా గగారినా ఒక పాల ఉత్పత్తి కార్మికురాలు. గగారిన్ బాల్యం సామాన్యమైనదే అయినా, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ ఆక్రమణ వల్ల ఆయన కుటుంబం తీవ్రంగా ప్రభావితమైంది. యుద్ధం తర్వాత, ఆయన విద్యను కొనసాగించి, ఓడ నిర్మాణ విద్యనభ్యసించేందుకు మాస్కోకు వెళ్లాడు. అక్కడే ఆయన విమానయానంపై ఆసక్తి కలిగి, ఒక వైమానిక క్లబ్‌లో చేరి తన మొదటి పాఠాలను అభ్యసించాడు. ఇది ఆయనను పైలట్‌గా మారే దిశగా నడిపించింది. 1955లో, గగారిన్ సోవియట్ వైమానిక దళంలో చేరి, "ఒరేన్‌బర్గ్ పైలట్ స్కూల్"లో శిక్షణ పొందాడు. 1957లో, మిగ్–15 యుద్ధ విమానాన్ని నడిపే అర్హత పొందాడు. అదే సంవత్సరం, వలెంటినా గోర్యచేవా అనే యువతిని వివాహం చేసుకున్నాడు. 1960లో, అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించి వ్యోమగాములను శిక్షించేందుకు, సోవియట్ యూనియన్ కొంతమంది పైలట్లను ఎంపిక చేసింది. 3,000 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, 20 మందిని ఎంపిక చేశారు. గగారిన్ తన ప్రతిభ, శారీరక స్థైర్యం, మానసిక మాన్యతలతో ప్రత్యేకంగా నిలిచాడు. ఆయన చివరి పోటీలో జర్మన్ టైటోవ్‌తో కలిసి ఉన్నా, తన చిన్న కదలికలతో కూడిన శరీర ఆకృతి (5 అడుగుల 2 అంగుళాల ఎత్తు) వల్ల వోస్టోక్ క్యాబిన్‌లో సులభంగా కూర్చో గలుగుతాడని ఎంపికయ్యాడు. 1961, ఏప్రిల్ 12న, గగారిన్ "వోస్టోక్ 1" అనే అంతరిక్ష నౌకలో ప్రయాణించి, 108 నిమిషాల్లో భూమిని పూర్తిగా ఒకసారి చుట్టి వచ్చాడు. ఇది మానవాళి అంతరిక్ష యాత్రలో మొదటి ఘన విజయం. వోస్టోక్ 1 వ్యోమనౌక బైకొనూర్ కాస్మోడ్రోమ్ నుంచి ప్రయాణమైంది. భూమి చుట్టూ సుమారు 27,400 కి.మీ వేగంతో తిరిగింది. గగారిన్ అంతరిక్షంలో 108 నిమిషాలు గడిపాడు. ఆయన భూమిని చూసి చెప్పిన ప్రముఖ మాట %–% "పృథ్వీ ఎంత అందంగా ఉంది!" తిరిగి భూమిపై దిగేటప్పుడు, ఆయన 7 కిలోమీటర్ల ఎత్తునుండి పారాచూట్ ద్వారా కిందకు దిగి భద్రంగా ల్యాండ్ అయ్యాడు. ఈ ఘనత ప్రపంచాన్ని ఉద్రూతలూగించింది. సోవియట్ యూనియన్ గొప్ప విజయం సాధించిందని ప్రపంచ మంతటా గుర్తింపు లభించింది. వోస్టోక్ 1 ప్రయాణం తరువాత, గగారిన్ ఒక అంతర్జాతీయ ప్రముఖుడిగా మారిపోయాడు. సోవియట్ యూనియన్ అతనికి "హీరో ఆఫ్ ద సోవియట్ యూనియన్" అనే అత్యున్నత పురస్కారం అందించింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను సందర్శించి, శాంతి మరియు అంతరిక్ష పరిశోధన కోసం తన మద్దతును తెలిపాడు. సోవియట్ అంతరిక్ష యాత్రికుల శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1967లో "సోయుజ్ 1" అనే కొత్త అంతరిక్ష నౌకను పరీక్షించేందుకు ఎంపికయ్యాడు, కానీ దానికి బదులుగా అతని మిత్రుడు వ్లాదిమీర్ కొమరోవ్‌ను పంపారు. కొమరోవ్ ఆ ప్రయాణంలో మరణించడంతో, గగారిన్ తదుపరి అంతరిక్ష యాత్రకు ఎంపిక కావడానికి అవకాశం తగ్గిపోయింది. 1968, మార్చి 27న, గగారిన్ తన శిక్షణా పైలట్ వ్లాదిమీర్ సెరోగిన్‌తో కలిసి మిగ్–15 యుద్ధ విమానం నడుపుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. కిర్జాచ్ నగర సమీపంలో విమానం కూలిపోవడంతో, ఇద్దరూ మరణించారు. ఆ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటికీ పూర్తిగా అర్థం కాలేదు. కొందరు ఇది వాతావరణ సమస్య కారణంగా జరిగిందని భావిస్తారు. మరికొందరు ఇతర యుద్ధ విమానం వద్దకు వచ్చినప్పుడు ఏర్పడిన గందరగోళం వల్లనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. కొన్ని వాదనలు అసలు ప్రమాదం ఒక కుట్ర అని కూడా చెబుతున్నాయి. అయితే, గగారిన్ మృతితో అంతరిక్ష పరిశోధనలో ఒక గొప్ప ధైర్యవంతుడిని కోల్పోయింది. రష్యాలో అనేక అంతరిక్ష కేంద్రాలు, రహదారులు, శిల్పాలు గగారిన్ పేరుతో నామకరణం చేయబడ్డాయి. ఏప్రిల్ 12ని "అంతర్జాతీయ మానవ అంతరిక్ష ప్రయాణ దినోత్సవం"గా పాటిస్తారు. గగారిన్ యొక్క విగ్రహాలు ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టబడ్డాయి. 1980లో "స్టార్ సిటీ" అనే అంతరిక్ష శిక్షణా స్థలానికి అతని పేరు పెట్టారు బైకొనూర్ కాస్మోడ్రోమ్‌లోని అతను ప్రయాణించిన లాంచ్ ప్యాడ్‌కు ఈ పేరు పెట్టారు. యూరీ గగారిన్ కేవలం ఒక వ్యోమగామి మాత్రమే కాదుబీ ఆయన మానవ సాహసానికి, శాస్త్రీయ పురోగతికి, మానవత్వానికి ఒక ప్రతీక. ఆయన చేసిన తొలి అంతరిక్ష యాత్ర మానవాళికి నూతన మార్గాలను చూపింది. ఆయన పేరు ఎప్పటికీ మానవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. గగారిన్ స్ఫూర్తితో, భవిష్యత్తులో మరిన్ని అంతరిక్ష యాత్రలు, పరిశోధనలు జరగనున్నాయి. **రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# ఎక్కువ సేపు కూర్చుని పని చేస్తున్నారా?

## అయితే కొత్త సమస్యను తెచ్చుకున్నట్టే

మారుతున్న లైఫ్ స్టైల్ లో ప్రతి ఒక్కరికీ గంటల తరబడి కూర్చుని పనిచేయడం ఇప్పుడు చాలా కామనైపోయింది. ఆఫీస్ లో అయినా, ఇంట్లో అయినా కనీసం 6 నుంచి 8 గంటలు కూర్చుని పనిచేయాల్సి వస్తుంది. ఇలా ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల శరీరానికి ఎంతో ప్రమాదమని చెప్తున్నాయి ఆరోగ్య పరిశోధనలు. రోజుకి 6 గంటలకు పైగా కూర్చుని పని చేసే వ్యక్తులకు ఊబకాయంతో పాటూ నాడీ వ్యవస్థదెబ్బ దెబ్బతిని వెన్ను నొప్పి ఎక్కువవుతుందని గతంలో ఎన్నో ఆరోగ్య పరిశోధనలు, అధ్యయనాలు తెలిపాయి. ఎక్కువసేపు కూర్చుని వర్క్ చేయడం వల్ల ఇప్పుడు మరో సమస్య కూడా వాటిల్లే అవకాశమున్నట్టు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చేసిన



పరిశోధనల్లో తేలింది. అదే ఫ్యాటీ లివర్ సమస్య. రోజులో ఎక్కువ సేపు కూర్చునే ఉండటం వల్ల శరీరం పెద్దగా శ్రమ పడదు. దీంతో ఫ్యాటీలివర్ సమస్య బారిన పడే అవకాశముంటుందని పరిశోధనలో తేలింది. ఐటీ ఎంప్లాయిస్ ఎక్కువగా కూర్చునే వర్క్ చేస్తుండటంతో వారిలో ఎక్కువమంది ఈ సమస్యతో బాధ పడుతున్నట్టు హెచ్‌సీయూ తెలిపింది. దీన్ని నివారించుకోవడానికి ప్రతి అరగంటకు ఓసారి బ్రేక్ తీసుకుంటూ కనీసం రెండు మూడు నిమిషాలు నడవడం లాంటివి చేస్తే మంచిది. వర్క్ ప్లేస్ లో లిఫ్ట్ కు బదులు మెట్లను ఎంచుకోవడం, ఆఫీసులో, ఇంట్లో కావాలని కొన్ని పనులను నడుస్తూ చేసుకోవడం లాంటివి చేయాలి. వీటితో పాటూ ప్రతీరోజూ కనీసం 30 నిమిషాల పాటూ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మంచిది.

# కబడ్డీ మాజీ ప్లేయర్ దీపక్ హుడాపై పోలీస్ స్టేషన్‌లో భార్య దాడి: వీడియో వైరల్

భారత కబడ్డీ జట్టు మాజీ ఆటగాడు దీపక్ నివాస్ హుడా... అతని భార్య ప్రముఖ భారత బాక్సర్ స్వీటీ బూరా కొంతకాలంగా విభేదాలతో దూరంగా ఉంటున్నారు. తాజాగా వీరి వివాదం మరింత ముదిరింది. అదనపు కట్నం కోసం దీపక్ తనను వేధిస్తున్నాడని స్వీటీ బూరా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఈ విషయంపై పెద్దల సమక్షంలో చర్చలు జరుగుతుండగా స్వీటీ బూరా అసహనంతో దీపక్ హుడా కాలర్ పట్టుకొని దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనకు ముందు హిసార్ మహిళా పోలీస్ స్టేషన్‌లో మోసం, దాడి, వరకట్న వేధింపుల కేసులో ఇరువర్గాలను విచారణకు పిలిచారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాక్సర్ అయిన స్వీటీ బూరా, ఆమె మామ , తండ్రితో కలిసి తనపై దాడి చేశారని దీపక్ హుడా ఆరోపించారు. దీపక్ ఫిర్యాదు మేరకు సదర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీపక్ హుడా తన ఫిర్యాదులో ఫిబ్రవరి 25న స్వీటీ బూరా తనపై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని



పేర్కొన్నారు. "ఈ విషయంపై విచారణ కోసం మార్చి 15న నన్ను హిసార్ మహిళా పోలీస్ స్టేషన్‌కు పిలిచారు. స్వీటీ , ఆమె కుటుంబ సభ్యులు కూడా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో, నాకు – స్వీటీకి మధ్య వాగ్వాదం జరిగింది. అది తీవ్రం కావడంతో, స్వీటీ నాపై దాడి చేసింది. ఆమె తండ్రి, మామ కూడా ఆమెకు సహకరించారు. నాకు గాయాలు కావడంతో నేరుగా హిసార్‌లోని సివిల్ ఆసుపత్రికి వెళ్లాను. చికిత్స పొందిన తర్వాత మార్చి 16న సదర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను" అని దీపక్ వివరించారు. మరోవైపు స్వీటీ బూరా తరపున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే, వైరల్ అవుతున్న వీడియోలో ఆమె ఆగ్రహంగా దీపక్ హుడా కాలర్ పట్టుకోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటన ఇరువురి మధ్య నెలకొన్న వివాదం ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తోంది. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇరువైపుల ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కబడ్డీ – బాక్సింగ్ రంగాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ఇద్దరు క్రీడాకారుల మధ్య నెలకొన్న ఈ వివాదం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.


చురకలు

## సంపాదకీయం

# మోడీ ముందు ఎంపీలతో పరేడ్ అంటున్న స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ పట్టు వదలని విక్రమార్కుడి గా కనిపిస్తున్నారు. ఆయన డీలిమిటేషన్ వ్యవహారంలో ఎక్కడా తగ్గడం లేదు. గత కొంతకాలంగా ఆయన ఇదే ఇష్యూ మీద సీరియస్ గానే పోరాటం చేస్తూ వస్తున్నారు తాజాగా దక్షిణాదికి చెందిన సీఎంలు కీలక రాజకీయ పార్టీల నేతలతో ఆయన అతి ముఖ్య సమావేశం పెట్టి సౌత్ వార్ కి తెర తీశారు. డీలిమిటేషన్ వ్యవహారంలో సౌత్ అంతా ఒక్కటే అని కేంద్రానికి నిరూపించారు. ఇపుడు చూస్తే ఆయన మరో వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. అదేంటి అంటే డీలిమిటేషన్ వల్ల తమిళనాడుకు దక్షిణాదికి ఎంత నష్టమో నేరుగా ప్రధాని నరేంద్రమోడీకే వివరించబోతున్నారు. అందుకోసం ఆయన తమిళనాడుకు చెందిన 39 మంది ఎంపీలతో ప్రధానిని కలవబోతున్నారు. ఈ విషయం స్వయంగా స్టాలిన్ మీడియాకు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీతో తొందరలోనే తామంతా కలవబోతున్నామని అన్నారు. ఇటీవల ముగిసిన అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తీర్మానాన్ని ప్రధాని నరేంద్ర మోడీకి అందచేస్తామని చెప్పారు. తమ బాధలను ప్రధానికి చెబుతామని అన్నారు. డీలిమిటేషన్ తో తమకు తీరని నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. అందువల్ల తమ పోరాటం ఎక్కడా ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరులో తామే కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే స్టాలిన్ తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలతో ప్రధానిని కలవాలనుకోవడం రాజకీయంగా అతి పెద్ద చర్చకు దారి తీసే అవకాశం ఉంది. ఒక దక్షిణాది రాష్ట్రం నుంచి డీలిమిటేషన్ ఇష్యూ మీద ఇంత పెద్ద ఎత్తున ఎంపీలు కలిస్తే అది జాతీయ స్థాయిలోనూ చర్చగా మారుతుంది. అంతే కాదు కేంద్రం ఆలోచనలోనూ మార్పు రావచ్చు అని అంటున్నారు. బీజేపీకి ఈ రోజున దక్షిణాది మీద ఫోకస్ ఉంది. ఈ కీలక సమయంలో అనుకూల వాతావరణాన్ని పాడుచేసుకోదని అంటున్నారు. దాంతోనే స్టాలిన్ కూడా ప్రధానిని కలసి సమస్యలు చెబితే అంతా సానుకూలం అవుతుందని ధీమాగా ఉన్నారు. అయితే అంతా బాగానే ఉన్నా స్టాలిన్ 39 మంది ఎంపీలతో వస్తాను అంటే ప్రధాని ఆఫీసు అపాయింట్మెంట్ ఇస్తుందా అన్నది. ఒకవేళ ఇస్తే ఒక రకంగా ఇవ్వకపోతే మరో రకంగా రాజకీయం ఉండొచ్చు. సో బీజేపీ పెద్దలకు చిక్కులలో పడేసేలా స్టాలిన్ వ్యూహం ఉందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. స్టాలిన్ మోడీతో ఎపుడు ఈ కీలక భేటీని నిర్వహిస్తారో ఆ ముహూర్తం ఎపుడో.

# ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్ - మార్చి 27....విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ జయంతి



19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు. రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27,1845 - 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యులుల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెప్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడరల్ పాలిటెక్నిక్ సంస్థ లో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869 లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్టు కుండ్త్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్ట్రాస్ ఫర్గు విశ్వ విద్యాలయంలో అధ్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్ట్రాస్ ఫర్గు విశ్వ విద్యాలయంలో మరల అధ్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900 లో ప్రభుత్వ అభ్యర్ధనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించ గలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్క గుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం - శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది.ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్-కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్-కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు. ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్ధిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు. రమ్ ఫోర్డ్ మెడల్ (1896), మాటెక్కీ మెడల్ (1896), ఎలియట్ క్రెస్సన్ మెడల్ (1897), భౌతిక శాస్త్రం లో నోబెల్ బహుమతి (1901) పొందాడు. నవంబరు 2004 లో పరమాణు సంఖ్య 111 గా గల మూలకానికి ఆయన పై గౌరవార్థం రాంట్జెనీయం అని IUPAC సంస్థ నామకరణం చేసింది. IUPAP కూడా ఈ పేరును నవంబరు 2011 లో దత్తత తీసుకుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నాటకానికి పునర్వైభవం తేవాలి - మార్చి 27.. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య రూపకం. జానపద కళలు విలసిల్లు తున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోదాన్ని కలిగించేదే కాకుండా, వివిధ సంస్కృ తుల్నీ, జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. అక్కడే మనం ఆనందిస్తాంబీ దుఃఖం లోకి నెట్టబడతాంబీ ఆలోచనలకి అంకురార్పణ చేస్తాంబీ స్ఫూర్తి చెందుతాం. ఇదీ రంగస్థల గొప్పతనం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతం, యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్య నాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని తెలుస్తున్నది. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచనలకు తెర తీసింది నాటి ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధు నిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభం కాగా నాటక ప్రదర్శన మాత్రం 1880లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం 1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన 'మంజరీ మధుకరీయం'. "ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధు లైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871 లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన 'నరకాసుర విజయం' అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలము' ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని 'సీజరు చరిత్రము' అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడులు రూపకర్తలు. వీరేశ లింగం సంభాషణ రూపాన 'బ్రాహ్మ వివాహం' అను ప్రహసనమును తన 'హాస్య సంజీవని' అను పత్రికలో రచించగా, అనంతరం 'వ్యవహార ధర్మబోధిని' వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి 'రత్నావళి', 'చమత్కార రత్నావళి' అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగు నాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన 'వ్యవహార ధర్మబోధిని' సంస్కృత నాటక అనువాదమైన 'రత్నావళి', ఆంగ్ల నాటక అనుసరణ అయిన 'చమత్కార రత్నావళి' ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880లో జరిగింది. అందుచేత 1980వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశ పెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. ఆయన నాటకాలలో ప్రసిద్ధమై, 'వేణీ సంహారము'. తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884%-%86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయవంతంగా ప్రదర్శించారు. పాటలు పాడుట అయన ప్రవేశ పెట్టిన కొత్త అంశం. ధర్మవరం రామకృష్ణమాచార్యులు తన తొలి తెలుగు నాటకమైన 'చిత్రనళీయం' ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయ వంతంగా ప్రదర్శిం చారు. 'సారంగధర' తెలుగు లోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే 'ఆంధ్ర నాటక పితామహ' అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో 'గయోపాఖ్యానం' సుప్రసిద్ధమైనది. 1891లో వెంకటరాయశాస్త్రి రచించిన 'ప్రతాప రుద్రీయం' బహుళ ఖ్యాతి నొందింది. 1887లో గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరం లోని జగన్నాధ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. '1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీని వాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడం చేత 'చారిత్రక నాటక పితామహుడు'గా పేరొందారు. ఆయన నాటకాలకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు రచించిన తొలి నాటకం 'నర్మదా పురుకుత్సీ యం' 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో 'రాధాకృష్ణ', 'పాదుకా పట్టాభిషేకం', 'కంఠాభరణం' ప్రసిద్ధమైనవి. 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగు దేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపిం చాయి. 1906%-%20 మధ్య కాలంలో బయల్దేరిన




'హరిశ్చంద్ర' నాటకాలు 13. 'సారంగ ధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు, నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగు దేశంలో వ్యాపార నాటక రంగం విజృంభించడం గమనార్హం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశ మంతటా వ్యాపించాయి. 'గయోపాఖ్యానం', 'పాండవ ఉద్యోగ విజయములు', 'బొబ్బిలి యుద్ధం', 'రంగూన్ రౌడీ' మొదలగు నాటకాలకు విడివి డిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. 'విశ్వశాంతి', 'ఎన్.జి.ఒ.', 'మా భూమి', 'కీర్తిశేషులు', 'నిర్మల' 'కుక్క' వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన 'చింతామణి', 'వరవిక్రయం', 'మధుసేవ' సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపు మాపడం కోసం రచనలు చేసిన వారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకటచలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఆ కాలంలో దువ్వూరి రామిరెడ్డి 'కుంభరాణా', విశ్వనాథ సత్యనారాయణ 'నర్తనశాల' ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబం ధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన 'మరో మొహెంజొదారో' నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగం కొత్త పుంతలు తొక్కింది. నాటక ప్రదర్శన అత్యంత ఖర్చుతో కూడినదిగా మారింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ప్రత్యేక హాల్ లేక, ఎక్కడో ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టంలూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళ సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరుతో కొన్ని నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంటున్నది. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థ లకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకుమంటూ ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న నాటకరంగం బతికి బట్టకట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించకపోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగుకాక తప్పని స్థితి నెలకొంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## వృథా నీటికి చెక్ డ్యాం

జగిత్యాల : జిల్లాలో ఏటా సగటున 943 మి.మీ వర్షం కురియటం, ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీళ్లు రావటం, వరదకాలువ నుంచి వాగుల్లోకి నీటిని వదలటం, గోదావరి నుంచి ఎత్తిపోతలు, ఎల్లంపల్లి నీటి తరలింపుతో చాలా వాగులు నిరంతరం జలకళతో ఉంటాయి. ప్రాజెక్టుల నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించటం తదితర సానుకూలతలతో వాగులు నిరంతరం నీటితో పారుతూ మిగులు వృథా జలాలను గోదావరిలోకి మోసుకెళ్తాయి. ఈ నేపథ్యంలో గోదావరిలోకి తరలిపోయే వృథానీటిని ఒడిసిపట్టేలా వాగులపై చెక్‌డ్యాం(ఆనకట్ట)ల నిర్మాణాన్ని 2019లో చేపట్టారు. జిల్లాలోని 5 సెగ్మెంట్ల పరిధిలో 75 ఆనకట్టలను నిర్మించవచ్చని గుర్తించగా ఇందులో 35 పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటివరకు 34 పనులు పూర్తికాగా మరో చెక్‌డ్యాం నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది. కొన్నిచోట్ల చెక్‌డ్యాంల కట్టలకు గత వానాకాలంలో భారీ వర్షాలతో గండ్లు పడగా మరమ్మతులు చేపట్టారు.

**గ్రావిటీ కాలువల తవ్వాలి..**

నిర్మాణం పూర్తయిన చెక్‌డ్యాంలతో 3 టీఎంసీల నీటినిల్వతో 2,603 ఎకరాలకు నీరందే అవకాశమేర్పడినా నిల్వనీటిని పంటపొలాలకు తరలించేలా గ్రావిటీ కాలువలను తవ్వాల్సి ఉంది. వాగుల అంతర్భాగం



లోనే చెక్‌డ్యాంలను నిర్మించటం వల్ల నీరు కరకట్టల లోపలనే నిలువుండి ముంపు, భూసేకరణవంటి సవగొల్లపల్లి మండలంలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంన్సమస్యలు ఏర్పడలేదు. జిల్లాలోని ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో చెక్‌డ్యాంలను నిర్మిస్తుండగా వాగుల్లో పారేనీటికి అడ్డుకట్టతో చాలావరకు నీరు వెనక్కి నిలువుండి వాగులకు ఇరువైపులా భూగర్భ జలమట్టం సాధారణస్థాయిలో కొనసాగుతోంది. భూగర్భ జలాలను, ఆనకట్టల్లోని నీటిని రైతులు మోటార్ల ద్వారా పంటలకు మళ్లించుకోవచ్చు. కట్టలకు ఇరువైపులా గ్రావిటీ కాలువలద్వారా రైతుల పంటపొలాలకు మళ్లించనున్నారు. వాననీటితో పాటు ప్రాజెక్టుల నుంచి వదిలేనీరు ప్రతి ఆనకట్టలోనూ అయిదారు మీటర్ల వరకు ఎత్తు వరకు నిలిచి చేపల పెంపకానికి అవకాశముంది. ఈ నేపథ్యంలో గుర్తించిన మరో 40 చెక్‌డ్యాంలను నిర్మించటం, నిర్వహణ, గ్రావిటీ కాలువల తవ్వకం తదితరాలకు నిధులను విడుదలచేసి పనులు వేసవిలో పూర్తిచేస్తే జిల్లావాసులకు దీర్ఘకాలికంగా లాభించనుంది.

నిర్మాణాల పూర్తితోనే ప్రయోజనం
జిల్లాలో తలపెట్టిన మొత్తం చెక్‌డ్యాంలు: 75
పనులు పూర్తయి, పురోగతిలో ఉన్నవి: 35
ఇంకా మంజూరివ్వాల్సినవి: 40
నూతన నిర్మాణాలు, పాతవాటి నిర్వహణకు
కావాల్సిన నిధులు: రూ.89.11 కోట్లు
రాష్ట్ర నిధులతో చేపట్టిన చెక్‌డ్యాంలు: 9
పనులు పూర్తయినవి: 8
ఖర్చుచేసిన నిధులు: రూ.32.79 కోట్లు
నాబార్డుద్వారా చేపట్టిన చెక్‌డ్యాంలు: 26
పనులు పూర్తయినవి: 26
ఖర్చుచేసిన నిధులు: రూ.58.67 కోట్లు

## ప్లాస్టిక్ ముప్పు.. కలిగేనా కనువిప్పు

మంథని : నేటి ఆధునిక కాలంలో మానవుని మనుగడకు ప్లాస్టిక్ భూతం అనేక అనర్థాలకు కారణమవుతోంది. ప్రజలు తమ చిన్న చిన్న అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు, సీసాలను ఉపయోగిస్తున్నారు. అనంతరం ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. వాటిని మూగజీవాలు తిని అనారోగ్యంబారిన పడుతున్నాయి కొన్నిచోట్ల కుప్పలుగా పేరుకుపోతుండటంతో కాల్చేస్తున్నారు. దీంతో పర్యావరణానికి, మానవాళికి ముప్పు పొంచి ఉంది. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగిస్తున్నా మార్పు కనిపించడం లేదు.

మంథని మున్సిపల్ పరిధిలో రోజుకు 8 ఆటో ట్రాలీలు, 7 రిక్షాలు, 2 ట్రాక్టర్లతో 20 టన్నుల వ్యర్థాలను సేకరిస్తారు. సేకరించిన వ్యర్థాలను గాడుదుల గండి గుట్ట వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇందులో తడి చెత్త 8 టన్నులు, ప్లాస్టిక్ వ్యర్థాలు 3 టన్నులు, మిగితాది



అట్టలు, టైర్లు, వైద్యశాలల వ్యర్థాలు, ఇతరాలు ఉంటాయి. మున్సిపల్ పరిధిలో దుకాణాలు, హోటళ్లు, కూరగాయల వ్యాపారులు, వైన్స్‌లలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి యజమానులపై జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదు.

మంథని పురపాలక సంఘం పరిధిలో..
మొత్తం వార్డులు 13
జనాభా : 18 వేలు
ఏడాదిలో నమోదు చేసిన కేసులు : 14
వసూలు చేసిన అపరాధ రుసుము రూ.11 వేలు

31 తర్వాత కవర్లు కనిపిస్తే చర్యలు

మున్సిపల్ పరిధిలోని 13 వార్డులలో ప్రతి రోజు వాహనాలు, రిక్షాల ద్వారా చెత్తను తరలిస్తున్నాం. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేరుచేసి సహకరించాలి. మురికి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండటంతో మురుగుముందుకు పారడం లేదు. మార్చి 31 తర్వాత వాణిజ్య సముదాయాలలో ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే భారీగా జరిమానాలు విధిస్తాం. సీజ్ చేస్తాం.
మనోహర్, మున్సిపల్ కమిషనర్

## బంతి పడిందా.. బెట్టింగ్ దందా



హైదరాబాద్ : ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ పోరు ఉత్కంఠ రేపితే.. మైదానం వెలుపల బెట్టింగ్ జోరుగా సాగింది. బంతిబంతికి పందెం కాస్తూ ఒక్కరోజే రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి. ఆన్‌లైన్‌లోనే కాదు.. ఆఫ్‌లైన్‌లోనూ బెట్టింగ్ ముఠాలు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించాయి. నగరవ్యాప్తంగా అపార్టుమెంట్లు, విల్లాల్లో భారీగా పందేలు నిర్వహించినట్లు సమాచారం. దీనికితోడు వారాంతం కూడా కలిసి రావడంతో నగర శివారులోని ఫాంహౌజ్‌లకు గిరాకీ పెరిగింది. టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసులు పందెం రాయుళ్ల మీద నిఘా పెట్టారు. పాతబస్తీలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

**అంతా ఆన్‌లైన్..!..** ఒకప్పుడు బెట్టింగ్ అంటే ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు, పంటర్లతో గొలుసుకట్టు వ్యవస్థలా ఉండేది. పంటర్లు నోట్ల కట్టలతో టీవీల ముందు కూర్చుని పందెం కాస్తుంటే ఆర్గనైజర్లు లెక్కలు రాసుకునేవారు. ఇప్పుడీ పరిస్థితి దాదాపుగా మారిపోయింది. బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్ల రాకతో ఫోన్ల నుంచే అంతా నడుస్తోంది. ఫోన్‌లో స్కోరు చూస్తూనే పందెం కాసేలా యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఫేక్ జీపీఎస్‌లతో ఏమారుస్తు పోలీసులకు చిక్కకుండా భారీగా పందెం కాస్తున్నారు.

**బ్లాక్‌లో టికెట్లు ..:** ఉప్పల్ కేంద్రంగా బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్ల దందా సాగింది. శనివారం ముగ్గురి నుంచి 9 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్టేడియం పరిసరాల్లో బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్న 24 మంది నుంచి 61 టికెట్లను ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురి అరెస్టు: అంబర్‌పేట శివం రోడ్డుకు చెందిన సాయికిర ణ్‌గౌడ్ (29), రాహుల్ (28), తిలక్‌నగర్‌కు చెందిన మహమ్మద్ మెహతాబ్ (28)లు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తుండగా ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కాచిగూడ సీఐ జ్యోత్స్న తెలిపారు.

**మ్యాచ్‌లకు కట్టుదిట్టమైన భద్రత**

ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చోరీలు, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా 450 సీసీ కెమెరాలతో పర్యవేక్షించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు మ్యాచ్‌కు ముందు గ్యాలరీలు వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు. ఉప్పల్ స్టేడియం వెలుపల బ్యాగులు భద్రపరిచేందుకు రూ.300 వసూలు చేశారు. ఈ విషయం తెలియక కొందరు బ్యాగులతో వచ్చి ఇబ్బంది పడ్డారు.

## జలమే జీవం.. జగతికి బలం



వికారాబాద్ : వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. తాగు, సాగు నీటికి కష్టాలు పెరుగుతున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా బోర్లు తవ్వుతున్నారు. వాస్తవానికి అనుమతి ఉంటేనే బోర్లు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వీటిని కాలరాదని జిల్లాలో నీటి వ్యాపారం సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాల సంరక్షణకు ఏంచేయాలి, నీటి వ్యాపారం ఎలా సాగుతోంది.. వంటి అంశాలతో 'న్యూస్‌టుడే' కథనం.

నెలకు రూ.17 కోట్లు తాగే నీళ్లకే ఖర్చు..

ప్రభుత్వం రూ.లక్షల కోట్లు వెచ్చించి మిషన్ భగీరథ పేరిట స్వచ్ఛమైన నీటిని అందిస్తోంది. అయితే దీనిపై అపోహలు తొలగించక పోవడంతో డబ్బానీటిపైనే ఆధారపడుతున్నారు. దీంతో పట్టణం, పల్లె అనే వ్యత్యాసం లేకుండా నీటి ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నెలకు తాగునీటి కోసం జిల్లా వాసులు అక్షరాల రూ.17 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.

**వీటిని పాటిస్తే మేలు**

మిషన్ భగీరథపై అపోహలు తొలగించాలి.
పంపులు, బోర్ల వద్ద నీటి వృథాను అరికట్టడం.
పైపులకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు, బిరడాలు బించాలి.
వృథాగా పోతుంటే వెంటనే అధికారులకు తెలియజేయడం
గృహావసరాల్లో పొదుపు పద్ధతులు పాటించడం.
కాలనీలు, పార్కులు, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం
పొలాల్లో నీటికుంటలు తవ్వించడం.
గతంలో తవ్వి వదిలేసిన ఇంకుడుగుంతల పునరుద్ధరణ
గ్రామాల్లో పురాతన, చేద బావుల పునరుద్ధరణ.

డబ్బా నీళ్లూ అపరిశుభ్రమే..

ప్రస్తుత వేసవి కాలంలో రూ.20 చెల్లించి రోజుకు రెండు డబ్బాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఒక్కోసారి డబ్బా నీళ్లు కూడా అపరిశు భ్రంగానే కనిపిస్తున్నాయి.
షోయబ్, ఇందిరాభాయి కాలనీ, వికారాబాద్.

కొత్త బోర్లు వేయించొద్దు..

ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలకు బోరు బావుల ద్వారా భూగర్భ జలాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఫలితంగా త్వరితగతిన పాతాళగంగ మరింత దిగజారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా ఎవరూ బోరు బావులు వేయించొద్దు.
రవిశంకర్, జిల్లా భూగర్భ వనరుల శాఖాధికారి.

ఇదీ సమాచారం
అనుమతిలేని శుద్ధి ప్లాంట్లు: 400
ఒక్కో ప్లాంట్‌లో ప్రతి రోజు వృథా అయ్యే నీరు: 60వేల లీటర్ల నుంచి 80 వేల లీటర్లు
అన్ని ప్లాంట్లలో వృథా నీరు: 2.40 కోట్ల నుంచి 3.20 కోట్ల లీటర్లు
ఒక్కో ప్లాంట్ యజమాని నెల సంపాదన: రూ.90వేల నుంచి రూ.1.20 లక్షలు

## ఇప్పుడిప్పుడే 'దారి'కొస్తోంది



హైదరాబాద్: ట్రాఫిక్ కష్టాలను తొలగించడమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ రోడ్డు విస్తరణ పనులకు నడుం బిగించింది. పాతబస్తీ, హైటెక్ సిటీతో పాటు ప్రధాన నగరంలో టౌన్ ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టింది. ఏ రోడ్డుకు, ఎన్నెన్ని నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుందో లెక్కిస్తోంది. అనంతరం టెండరు ప్రక్రియను చేపట్టి పనులు ప్రారంభిస్తామని ఇంజినీరింగ్ విభాగం స్పష్టం చేస్తోంది.

**అన్నీ ప్రధాన రహదారులే..** అత్యంత రద్దీ రహదారుల్లో.. హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌నుంచి సైబర్‌టవర్స్ రోడ్డు మొదటిది. ఉదయం 9నుంచి రాత్రి 9 గంటల వరకు కిక్కిరిసి ఉంటుంది. శేరిలింగంపల్లి జోనల్ అధికారులు ఎన్ఐఏ భవనం నుంచి సైబర్‌టవర్స్ పైవంతెన వరకు రోడ్డును 120అడుగుల మేర విస్తరిస్తున్నారు. నెలలో పూర్తిచేస్తామని సహాయ ఇంజినీరు ప్రశాంత్ తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నం.1 నుంచి రోడ్డు నం.12మీదుగా, జూబ్లీ చెక్‌పోస్టు కూడలి వరకు రోడ్డును విస్తరించనున్నారు. తాజాగా భూసేకరణలో కదలిక వచ్చింది. 306 ఆస్తులను సేకరించాల్సి ఉందని అంచనా. ఇప్పటికే కొన్నింటి కొలతలు తీసుకున్నామని సర్కిల్ సహాయ ప్రణాళికాధికారి శ్రీనివాస్ తెలిపారు. హెచ్-సిటీ కింద పాతబస్తీలో బెంగళూరు జాతీయ రహదారినుంచి శాస్త్రిపురం కూడలి వరకు, అక్కడినుంచి ఇంజిన్ బౌలి వరకు రోడ్డును 100 అడుగులమేర విస్తరించాలన్నది ప్రణాళిక. అందుకుగాను రూ.54 3 కోట్ల వ్యయాన్ని జీహెచ్‌ఎంసీ అంచనా వేసింది. కొండా పూర్‌లో మజీద్‌బండ నుంచి హెచ్‌సీయూ రోడ్డును కలిపేరోడ్లను 100 అడుగుల మేర విస్తరించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ట్రిపుల్ ఐటీ చౌరస్తా, విప్రో కూడలి మధ్యలో పైవంతెన నిర్మాణం ప్రారంభించి.. నియోపొలిస్ వద్ద రింగురోడ్డును కలుపుతూ పైవంతెన నిర్మాణానికి టీఎస్ఐఐసీ ప్రణాళిక రూపొందిస్తోంది. బాలాపూర్ రోడ్డు నుంచి సోయెబ్ హోటల్, చాంద్రాయణగుట్ట ఎక్స్‌రోడ్డునుంచి బార్కస్‌కు, నక్రీపూల్‌బాగ్ నుంచి జీహెచ్‌ఎంసీ జోనలాఫీసు వరకు, తులసినగర్ నుంచి గౌస్‌నగర్ వరకు రోడ్లను రూ.320కోట్లతో బల్దియా సిద్ధమైంది.

## స్వచ్ఛత అడుగులో అవరోధాలు

ధర్మపురి: స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులు కుమ్మరిస్తున్నా.. నిర్వహణ లోపంతో లక్ష్యం నీరుగారుతోంది. జిల్లాలోని అయిదు పురపాలకాల్లో స్వచ్ఛత మెరుగుకు సులభ్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయగా.. అవి నిరుపయోగంగా మారాయి. ధర్మపురి లాంటి పుణ్యక్షేత్రం ప్రాంతంలో ఎక్కువ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఉన్నవాటి నిర్వహణ కూడా మరిచారు.

**జనాభా ప్రాతిపదికన**

జనాభా ప్రతిపాదికన ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం సులభ్ కాంప్లెక్సుల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తోంది. గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చినా.. పలు చోట్ల స్థల సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రద్దీ ప్రాంతాల్లో నిర్మిస్తున్నా.. నిర్వహణ లోపం, నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానికుల నుంచి కూడా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీల్లో బహిరంగ మలవిసర్జనను ఇప్పటికే కట్టడి చేశారు. ధర్మపురి దేవస్థానం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గోదావరినది తీరంలో రెండు చోట్ల, బస్టాండ్, మార్కెట్‌లలో మరుగుదొడ్లను నిర్మించారు. కొత్తవాటి నిర్మాణానికి స్థలం కొరత



ఏర్పడుతోంది. ధర్మపురిలో శనివారం వారసంత సమయంలో మరుగుదొడ్లు లేక ప్రజలకు, మహిళలకు చాలా అసౌకర్యంగా ఉంటోంది. అపరిశుభ్రత, నీటి వసతిలేక ఉన్నవాటికి తాళాలు వేస్తున్నారు.

నిర్వహణపై చర్యలు తీసుకుంటాంధర్మపురిలో ఇప్పటికే పలుచోట్ల స్వచ్ఛత కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మించాం. వీటి నిర్వహణపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నూతనంగా ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై సమగ్ర పరిశీలన చేస్తాం. 2025లో ధర్మపురి పురపాలకంలో 12 ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.
ఏ.శ్రీనివాస్‌రెడ్డి, పుర కమిషనర్, ధర్మపురి

## అదనపు బాధ్యతలకు ఆరు నెలలు

గోదావరిఖని : రాష్ట్రంలోనే జిల్లా కేంద్రం కాని ఏకైక నగరపాలిక రామగుండం. ఆరు నెలలుగా ఇన్‌ఛార్జి కమిషనర్ పాలనలోనే కొనసాగుతోంది. ఇక్కడ కమిషనర్‌గా పని చేసేందుకు అధికారుల్లో ఆసక్తి లేకపోవడంతో పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జులనే నియమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో నలుగురు కమిషనర్లు ఆరేడు నెలలకు మించి పని చేయకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకొని వెళ్లడం గమనార్హం. గత కమిషనర్ శ్రీకాంత్ ఏడు నెలలు పని చేసి 2024 సెప్టెంబర్ 19న సెలవుపై వెళ్లి వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. అప్పటి నుంచి జిల్లా



అదనపు కలెక్టర్ అరుణశ్రీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పాలకవర్గం గడువు ముగియడంతో మూడు నెలలుగా జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్నారు.

**ఆది నుంచి అవే పరిస్థితులు**

నిధుల కొరత, రాజకీయ ఒత్తిళ్లు, పాలనాపరమైన ఇబ్బందులతో రామగుండం నగరపాలక కమిషనర్ బాధ్యతలను అధికారులు ముళ్ల కిరీటంగా భావిస్తున్నారు. రామగుండం నగరపాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది నెలల్లోనే ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకొని వెళ్తున్న సంఘటనలున్నాయి. 2010లో సత్యనారాయణ, 2011లో షాహీద్ మసూద్ ఆరేసి నెలలు, 2012లో మోహన్‌రెడ్డి 9 నెలలు మాత్రమే పని చేశారు. ఈ తర్వాత ఎవరూ రాకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులకే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒకటిన్నర దశాబ్దంలో ఏడు సార్లు నగరపాలిక ఇంజినీరింగ్ అధికారులే కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్‌గా పనిచేసిన తొలి ఐఏఎస్ అధికారి ఉదయ్‌కుమార్ 2020 ఫిబ్రవరి నుంచి 2021 ఆగస్టు వరకు విధుల్లో కొనసాగారు. ఆ తర్వాత నలుగురు కమిషనర్లు మారగా, ముగ్గురు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించారు.

## జలం.. సమస్య మరింత తీవ్రం

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో యాసంగి సీజన్‌లో ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు సాగునీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. బోర్లు, బావులు ఒక్కసారిగా వట్టిపోతుండడంతో అయోమయానికి గురవుతున్నారు. పొట్ట, ఈనే దశలో ఉన్న పైర్లు ఎండిపోతుండా కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య భూగర్భజలాలు సగటున 1.30 మీటర్ల లోతుకు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**బోరుబావుల తవ్వకాలు.. మోటార్ల కొనుగోళ్లు**

భూగర్భజలాలు అడుగంటి పోతుండడంతో అన్నదాతలు కొత్తగా బోరుబావుల తవ్వకాలు, మోటర్లు, పైపుల కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. ఇందు కోసం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

కొందరు రైతులు రూ.లక్షలు వెచ్చించి బోరుబావుల తవ్వకాలు చేపడుతున్నారు. వాటిలోనూ చుక్కనీరు పైకిరాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఈనే దశలో ఉన్న పంటను రక్షించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా పొలాల్లో నీటిని పోయించుకుంటున్నారు. మరికొందరు రైతులు తమ సమీపంలో ఎక్కువగా నీరందించే బోర్లు, బావుల నుంచి కిలోమీటర్ల దూరం మేరకు పైపులు వేసుకుంటున్నారు.

ఇంకొందరేమో దగ్గరలో ఉండే కాల్వల నుంచి నీటిని తమ పొలాలకు తీసుకెళ్లేందుకు కొత్తగా వ్యవసాయ విద్యుత్తు మోటర్లు, పైపులను కొంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ దుకాణంలో కేవలం నెల వ్యవధిలోనే 600లకు పైగా మోటార్లు, వేలాది మీటర్ల పొడవైన పైపులను రైతులు కొనుగోలు చేయడం క్షేత్రస్థాయి పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది.

ఈ చిత్రంలోని రైతు ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాకు చెందిన భూక్య శంకర్‌నాయక్. నాలుగెకరాల్లో వరి సాగు చేశారు. రెండు బోర్లు వట్టిపోవడంతో రూ.లక్ష ఖర్చుతో కొత్తగా రెండు బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదు. అప్పటికే రెండెకరాల్లో పైరు పూర్తిగా ఎండిపోయింది. పక్కనే ఉన్న కెనాల్‌లోకి నీరు రావడంతో విద్యుత్తు మోటారు, పైపులు, తీగలు కొనుగోలు చేశారు. ఇలా మొత్తం రూ.1.26 లక్షలు ఖర్చు చేస్తే చివరికి దక్కింది రెండెకరాలు మాత్రమే అని శంకర్‌నాయక్ వాపోతున్నారు.

# ట్యాంకర్లు.. నిబంధనలకు నీళ్లు

హైదరాబాద్ : కాచిగూడలో అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐటీ ఉద్యోగి అక్కడికక్కడే మరణించాడు. షేక్‌పేట్ సమీపంలో అపసవ్యదశలో వచ్చిన ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. అక్కడ చేరిన కొందరు ఆటోడ్రైవర్‌ను బెదిరించి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను అక్కడ నుంచి తప్పించారు. శేరిలింగంపల్లిలోని అపార్ట్‌మెంట్‌కు మురుగు నీరు సరఫరా చేసిన ట్యాంకర్ డ్రైవర్ నిలదీసిన వారిపైనే దౌర్జన్యానికి దిగినట్టు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా దూసుకెళ్తున్న వాటర్ ట్యాంకర్లు వాహనదారుల వెన్నులో వణకు పుట్టిస్తున్నాయి. తాగునీటి వాహనం వస్తుందంటే దారెంట ప్రయాణించేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటడం, తాగునీరు చాలకపోవటంతో నగర పౌరులు ప్రత్యామ్నాయంపై ఆధాపడుతున్నారు. ఇదే అదనుగా సొమ్ము చేసుకునేందుకు వేలాది వాటర్ ట్యాంకర్లు బయటకొస్తున్నాయి. వీలైనంత ఎక్కువ ట్రిప్పులు తిరిగేందుకు డ్రైవర్లు ఇష్టానుసారం నడుపుతున్నారు. నెల వ్యవధిలోనే 15 రోడ్డు ప్రమాదాలకు ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు కారణంగా పోలీసులు గుర్తించారు. 10 మంది గాయాలపాలవ్వగా, ముగ్గురు మృత్యువాతపడ్డారు. నీటి సరఫరా చేస్తున్నాయనే ఉద్దేశంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేయటం



సామాన్యుల ప్రాణాలతో చెలగాటంగా మారింది.

**దూసుకొస్తున్నాయ్.. ప్రాణాలు తీస్తున్నాయ్**

అతివేగం, అనుభవలేమితో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. నారాయణగూడ సమీపంలో జలమండలి వాటర్ ట్యాంకర్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న కార్పెంటర్‌జగన్నాథం చారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. మియాపూర్‌లో పని ముగించుకొని నడచుకుంటూ వెళ్తున్న మాల్యాద్రి అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొని చనిపోయారు. కూకట్‌పల్లిలో ప్రైవేటు వసతి గృహంలోకి వాటర్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ప్రహరీని ఢీకొట్టి ఆగిపోయింది. నిబంధనల విరుద్ధంగా నడిచే ట్యాంకర్లు, లైసెన్స్ లేని డ్రైవర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

**మైనర్లే డ్రైవర్లు.. నంబర్‌ప్లేట్ కనిపించదు**

వేసవి వచ్చిందంటే తాగునీటి కటకట. రోజువారీ నీటి అవసరాలకు జనం ఇబ్బంది పడుతుంటారు. ఈ ఏడాది ముందుగా నీటి ఇబ్బందులు తలెత్తటంతో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శివారు ప్రాంతాల్లో వందలాది బోర్లు పుట్టుకొచ్చాయి. రేయింబవళ్లు వాటి నుంచి యథేచ్ఛగా నీరుతోడి నిల్వ చేస్తున్నారు. నగరంలో సుమారు 1000 జలమండలి, సుమారు 5-6వేలకు పైగా ప్రైవేటు ట్యాంకర్లు ఉన్నట్టు అంచనా. నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలకు రంగులు వేసి నడుపుతున్నారు. పాతటైర్లు, మరమ్మతుకు నోచుకోని బండ్లు కావటంతో బ్రేక్ విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రిళ్లు తిరిగే చాలా ట్యాంకర్లు నంబర్ ప్లేట్ లేకుండానే తిరగటం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి ఆధ్వర్యంలోని వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు కొందరు మైనర్లకు స్టీరింగ్ అప్పగించి వారు విశ్రాంతి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రైవేటు పరిస్థితి మరీ ఘోరంగా మారింది.

# తుది దశకు బైపాస్ నిర్మాణం

పెద్దపల్లి: కాజీపేట నుంచి కరీంనగర్‌కు నేరుగా వెళ్లేందుకు పెద్దపల్లి వద్ద నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఉగాది పర్వదినం కంటే ముందే పూర్తి చేసేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు పెద్దపల్లి, కొలనూరు నుంచి బైపాస్ మార్గంలోని క్యాబిన్‌తో ఇంటర్‌లాకింగ్ పనులతో పాటు కమీషనింగ్ పనులు పూర్తి చేయనున్నారు. బైపాస్ మార్గంలో లూప్‌లైన్(రెండో లైన్) నిర్మాణానికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ పనులు కూడా ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి గూడ్స్ రైళ్లను మాత్రమే బైపాస్ మీదుగా మళ్లించనున్నారు. ప్రయాణికుల రైళ్లను తప్పనిసరిగా పెద్దపల్లి స్టేషన్ మీదుగానే నడుపుతారు.

**స్టేషన్‌పై తగ్గనున్న ఒత్తిడి**

బైపాస్ లైన్ నిర్మాణంతో పెద్దపల్లి ప్రధాన స్టేషన్‌పై ఒత్తిడి తగ్గనుంది. బైపాస్ మార్గంలో నిర్మించిన క్యాబిన్ ద్వారానే అక్కడి స్టేషన్ మాస్టర్ రైళ్ల నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తారు. ఈ రైలు మార్గాన్ని రైల్వే శాఖ రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గం హుస్సేన్‌మియా వాగు వంతెన సమీపం నుంచి చీకురాయి రైల్వే గేటు రంగంపల్లి వద్ద ప్రస్తుత కరీంనగర్ రైలు మార్గానికి అనుసంధానమవుతుంది. ఈ మార్గం పూర్తయితే కరీంనగర్ వైపు నుంచి వెళ్లే గూడ్స్ రైళ్లు పెద్దపల్లి స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా కాజీపేట, వరంగల్ వైపు వెళ్తాయి. పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్ వెళ్లే రైళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కాజీపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే రైళ్లు కరీంనగర్ వెళ్లాలంటే పెద్దపల్లి స్టేషన్‌లో ఇంజిన్ మార్చుకోవాల్సి వస్తుంది. దీనికే అధికంగా సమయం పట్టనుంది.

**చొరవ చూపితేనే కొత్త రైళ్లు**నిజామాబాద్ నుంచి హైదరాబాద్, ముంబయి మినహా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా సికింద్రాబాద్ మీదుగా ప్రయాణించాల్సిందే. కరీంనగర్ నుంచి తిరుపతికి మినహా మరే దూర ప్రాంతానికి రైళ్లు లేవు. రెండు జిల్లా కేంద్రాల మీదుగా ఢిల్లీ, చెన్నై లాంటి ప్రాంతాలకు కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఇద్దరు ఎంపీలు చొరవ చూపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంపీ అరవింద్ నిజామాబాద్ నుంచి ఢిల్లీకి కొత్త రైలు కోసం ప్రతిపాదించారు. విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగళూర్ వైపు కొత్త రైళ్లను నడిపించేందుకు ఆయనతో పాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవ చూపాల్సి ఉంది.

# ఖాళీగా ఉంది.. కలిపేసుకుంటే మనది!




హైదరాబాద్: మహానగరపాలక సంస్థ.. రంగారెడ్డి.. మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సరిహద్దులు.. కంచెలు.. జియోట్యాగింగ్‌లు లేకపోవడంతో కొందరు వాటిని ప్రైవేటు పట్టాభూముల ఖాతాల్లోకి కలిపేసుకుంటున్నారు. మండలాల వారీగా రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు డిజిటల్ సర్వేలు, జియోట్యాగింగ్‌లు చేస్తామని అధికారులు ప్రకటించినా.. ఇప్పటి వరకూ అవేవీ ప్రారంభం కాలేదు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 400 ఎకరాల భూములను, మేడ్చల్ జిల్లాలో 270 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారని విశ్వసనీయ సమాచారం. వీటి విలువ రూ.2500 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.. ఈ అంశంపై ఇప్పటికే రెవెన్యూ ఉన్నతాధికారులు జిల్లాల కలెక్టర్లతో కొద్దిరోజుల క్రితం అంతర్గతంగా చర్చించినట్టు తెలిసింది. సర్వేల్యాండ్ రికార్డులు, ధరణి పోర్టల్‌లోని ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. వచ్చే వారం నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

**జీహెచ్‌ఎంసీ.. మున్సిపాలిటీల పరిధుల్లో ఉండడంతో..**

నగర శివారులో 250కి పైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. ఈ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల విలువ రూ.కోట్లు పలుకుతుండడంతో కొందరు తమ భూముల పక్కనున్న వాటిని కొంచెం, కొంచెంగా ఆక్రమించుకుంటున్నారు. ప్రభుత్వ భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో మండలాల పరిధిలో ఉన్నాయి. గ్రామాలు మాత్రం గ్రేటర్, మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. రికార్డులు పక్కాగా లేకపోవడంతో ఆక్రమించుకున్న భూములకు బైనంబర్లు వేసి పన్ను చెల్లిస్తున్నారు. రెవెన్యూ విభాగంలోని కిందిస్థాయి సిబ్బందితో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి వారి పరం చేసుకుంటున్నారు. రెండు నెలల క్రితం గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఇవి వెలుగు చూశాయి.

**పక్కాగా లేని డిజిటల్ రికార్డులు..**

పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లోని ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా డిజిటల్ రికార్డుల్లో లేవు. గ్రేటర్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ భూముల్లో హెచ్‌ఎండీఏకు, ఐటీ, పరిశ్రమల శాఖలకు కేటాయించారు. ధార్మిక సంస్థలు, కుల సంఘాలకూ భూములను గత ప్రభుత్వం కేటాయించింది. మిగిలిన వాటిని డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తామని, జియోట్యాగింగ్ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. క్షేత్రస్థాయిలో అన్నీ అటకెక్కించారు. సర్వే చేసేందుకు సరైన సంఖ్యలో సర్వేయర్లు లేరు.

# ఇష్టారీతిన ఇసుక దోపిడీ



కొడంగల్ : జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి, దోమ తదితర మండలాల్లో కాగ్న, కాకరవాణి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో అక్రమార్కులు నిరాటంకంగా తమ పని కానిచ్చేస్తున్నారు.

**ప్రభుత్వ పనుల అనుమతుల పేరుతో..:** ప్రభుత్వ పనులకు అనుమతుల పేరుతో యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఉదాహరణకు బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, కాకర్లగండితండా, మహంతిపూర్, దుప్‌చర్ల గ్రామాల శివారు ప్రాంతాల గుండా పారే కాకరవాణి వాగులో భారీగా పేరుకున్న ఇసుక నిల్వలను ఖాళీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల జాడ కనిపించడం లేదు.

ఇక తాండూరు పరిధిలోని కాగ్నా నది పరివాహకంలో ఇసుక దోపిడీ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లలో నింపి కళ్లముందే తరలిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడడమే కాకుండా భూగర్భ జలాలు తగ్గి తాగు, సాగునీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యూహం మార్చిన వ్యాపారులు**

ఇసుక అక్రమార్కులు తమ వ్యూహాన్ని మార్చుకుంటున్నారు. వాగు నుంచి పగలు ట్రాక్టర్లలో తరలించి నిల్వ చేసి రాత్రి లారీలలో తరలించేవారు. ఇది తెలిసి రెవెన్యూ అధికారులు ఇటీవల ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని వేలం వేశారు. దీంతో రాత్రికి రాత్రే ట్రాక్టర్లలో తరలించి ఎవరి కంట పడకుండా అప్పటికప్పుడే లారీలలో లోడ్ చేసి తరలించేస్తున్నారు. ఎవరైనా అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. అధికారులు అభివృద్ధి పనులకు రోజుకు ఒకటి లేదా రెండు ట్రిప్పులకు అనుమతి ఇస్తున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తున్నారు.

ప్రభుత్వ పనులకే అనుమతులు: పద్మావతి, తహసీల్దార్, బొంరాస్‌పేట కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ పనులకే ఇసుక తరలించేందుకు అనుమతులు ఇస్తున్నాం. ఇటీవల నిబంధనలు ఉల్లంఘించి నిల్వ చేసిన డంపులను కూడా వేలం వేశాం. సిబ్బంది లేకపోవడం కూడా కొంత ఇబ్బందిగా మారింది. సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం.

# యువతకు ఉపాధి చదువులు



వికారాబాద్ : యువతకు డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారు ఉపాధి అవకాశాలు సొంతం చేసుకునే విధంగా ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకుంటోంది. వీరికి నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించటం లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఆడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలో మూడు ఏటీసీలను ఏర్పాటు చేయనున్నారు. భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం..

**సరిపోని శిక్షణ సంస్థలు**

జిల్లాలో ప్రభుత్వ పరంగా వికారాబాద్, మర్పల్లిలో ఐటీఐ లున్నాయి. తాండూరులో ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేసినా ప్రారంభించలేదు. ప్రైవేట్ పరంగా వికారాబాద్, తాండూరులో ఐటీఐలున్నాయి. జిల్లా యువత దాదాపు 3 లక్షలు ఉంటే ఏటా టెన్త్, ఇంటర్ చదివి బయటకు వస్తున్న వారి సంఖ్య దాదాపు 20,000 ఉంటోంది. సంఖ్య ఎక్కువే అయినా సాంకేతిక శిక్షణ కేంద్రాలు సరిపోక పోవడంతో నేర్చుకోలేక పోతున్నారు.

**కేంద్రాల సమాచారం**

జిల్లాలో వికారాబాద్, తాండూరు, మర్పల్లిలో కొత్త ఏటీసీలు

అన్నీ ఒకే విధంగా నమూనాలు

కోర్సులు 6, సీట్లు 240

కోర్సు కాల వ్యవధి.. 2 సంవత్సరాలు.

ఎంతో ప్రయోజనం కలుగుతుంది గడ్డం ప్రసాద్‌కుమార్, స్పీకర్, ఎమ్మెల్యే వికారాబాద్.

జిల్లాలోని వికారాబాద్, మర్పల్లి, తాండూరు ప్రాంతాల్లో ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వికారాబాద్ నియోజక వర్గంలో రెండు కేంద్రాలను మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఈ శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి. ఉజ్వల భవిష్యత్తుకు దోహదం.. నరేంద్రబాబు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, వికారాబాద్

ప్రభుత్వం ప్రారంభించబోయే ఏటీసీలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు దక్కుతుంది. ఈ కేంద్రాల్లో ప్రారంభించే కోర్సులను పూర్తి చేస్తే ఎంతో మంచి అవకాశాలుంటాయి.

# నిమ్స్ ఎల్వోసీ జారీలో మార్పులు

హైదరాబాద్ : పేదలకు అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) విధానంలో మార్పులు చేశారు. రాష్ట్రంలో కేవలం ప్రభుత్వ రంగ ఆస్పత్రులకు మాత్రమే ఎల్వోసీ జారీ చేస్తున్నారు. ఇందులో నిమ్స్ కూడా ఉంది. ఆరోగ్యశ్రీ లేని వారు, చికిత్సలకు పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందనే రోగులకు మాత్రమే ఇది వర్తింపచేస్తారు.

**ఇప్పటి వరకు ఇలా..**ఆస్పత్రిలో చేరిన రోగి చికిత్సకు రూ.3లక్షలకు పైగా ఖర్చు అయితే వైద్యులు ఎల్వోసీ దరఖాస్తు చేసుకోవాలని సూచించేవారు. వారికి వైద్యులు అంచనా రసీదు ఇచ్చేవారు. దాని ఆధారంగా మెడికల్ రికార్డ్స్ విభాగం రూ.50 తీసుకొని అభ్యర్థన పత్రాన్ని జారీ చేసేది. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రుల సిఫారసు లేఖల ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమోదం లేఖలను తీసుకొని ఆస్పత్రిలో ఇచ్చేవారు.

**ఇకపై అంతా ఆన్‌లైన్** ప్రస్తుతం ఆస్పత్రిలో ఎల్వోసీ ప్రక్రియను డిజిటలైజ్ చేశారు. ఉదాహరణకు రోగికి కార్డియాలజీలో చికిత్సకు రూ.3లక్షలకు పైగా అవుతుందని వైద్యులు చెప్పి, ఎల్వోసీ కోసం నిమ్స్ హెచ్‌ఎంఐఎస్ ద్వారా డిజిటల్ రూపంలో ఎస్టిమెట్ రూపొందించి పాలన విభాగం సహాయ మెడికల్ సూపరింటెండెంట్‌కి పంపిస్తారు. అక్కడ పరిశీలించి ఆమోదం తెలుపుతారు. మెడికల్ రికార్డ్స్ విభాగంలో రూ.50 రుసుము చెల్లించి లేఖ తీసుకోవాలి. ఆ లేఖను ఆమోదం కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, ఎంపీ వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. వారు సీఎంఆర్ఎఫ్ పోర్టల్‌లో పరిశీలించి ఆమోదం తెలిపి ఎల్వోసీ మంజూరు చేస్తారు. దీంతో అవినీతికి తావు లేకుండా సేవలందుతాయని అధికారులు చెబుతున్నారు.

# వరి వైపు.. అన్నదాతల చూపు

కరీంనగర్ : జిల్లాలో ఆరేడేళ్ల క్రితం రైతులు యాసంగిలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేవారు. కానీ క్రమేణా ఆరుతడి పంటల స్థాయి గణనీయంగా పడిపోయింది. సాగు అయిన భూవిస్తీర్ణంలో 90 శాతంపైగా వరి సాగు చేస్తున్నారు. ఆధునిక వరి వంగడాలతో దిగుబడి సైతం ఆశించిన స్థాయిలో వస్తుండటంతో వరి సాగుకు మొగ్గుచూపుతున్నారు.

శంకరపట్నం మండలంలో 24,303 ఎకరాల్లో పంట సాగు చేయగా, అందులో 24,250 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

గత వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఈసారి వాటిని ఎక్కువ మంది వేశారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సంప్రదాయ వ్యవసాయ విధానంలో యాసంగిలో వేయాల్సిన వేరుశెనగ, మొక్కజొన్న, పెసర, కంది, ఇతర పంటల సాగు పూర్తిగా తగ్గుతూ వస్తోంది.ముఖ్యంగా కూరగాయల సాగు జిల్లా వ్యాప్తంగా



952 ఎకరాలకే పరిమితం కావడంతో, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి మీదనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుత వ్యవసాయ విధానంలో పంట మార్పిడి జరగట్లేదని, నేలలో సారం తగ్గిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జిల్లాలో యాసంగి సాగు వివరాలు..

మొత్తం ఎకరాలు:2,90,000

వరి: 2,66,896

మొక్కజొన్న: 20,203

ఇతర పంటలు: 2,901


**వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తున్నాం**

పంట మార్పిడితో లాభాలు, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా ఇతర పంటల సాగులో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, మార్కెటింగ్ తదితర కారణాలతో రైతులు వరి ధాన్యం వైపు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు.జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# రామగిరి ఖిల్లాకు పర్యాటక సిరి

రామగిరి : పెద్దపల్లి జిల్లాలోని రామగిరి ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించగా, కేంద్ర ప్రభుత్వ పర్వతమాల ప్రాజెక్టు కింద రోప్‌వే ఏర్పాటుకు ప్రతిపాదించింది. రామగిరి మండలంలో బేగంపేట నుంచి రత్నాపూర్, కల్వచర్ల గ్రామాల వరకు దాదాపు 7 చదరపు కిలోమీటర్ల మేర ఖిల్లా విస్తరించి ఉంది. ఇక్కడి కట్టడాలు, దర్వాజలు, బురుజులు, రాతి గోడలు ఆకట్టుకుంటున్నాయి. ఖిల్లా చుట్టూ 3-120 అడుగుల ఎత్తులో శత్రుదుర్భేద్యంగా రాతి గోడను నిర్మించారు. క్రీ.శ.ఒకటో శతాబ్దంలో ఖిల్లా కేంద్రంగా రాజులు పాలించినట్లు తెలుస్తోంది.

**చూడదగిన ప్రదేశాలు**ఖిల్లాపై సీతారాముల పాదముద్రలు, సీతమ్మ కొలను, కుంకుమరాళ్లు, సింహాల కోట, పిల్లల ఫిరంగులు, దర్వాజాలు, మల్లెవనం, బృందావనం వంటి కనువిందు చేసే ప్రదేశాలను చూడవచ్చు. రాతి గోడలపై చెక్కిన సీతారామచంద్రుల విగ్రహాలు



నాటి శిల్ప కళకు అద్దం పడతాయి. పెద్దపల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే ఖిల్లాపైకి బేగంపేట వైపు నుంచి ఎక్కడానికి, రత్నాపైర్ వైపు నుంచి దిగడానికి దారులున్నాయి. ఏటా శ్రావణమాసంలో భక్తులు దాదాపు 5-7 కిలోమీటర్ల దూరం నడిచి కోటపై సీతారామచంద్రులను దర్శించుకుంటున్నారు.

**అయిదేళ్ల కిందటే సర్వే**

రామగిరి ఖిల్లా అభివృద్ధికి సుమారు అయిదేళ్ల కిందట రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు సర్వే నిర్వహించారు.

అప్పట్లో వేయి స్తంభాల గుడి, హనుమకొండ, ఖిల్లా వరంగల్, రామప్ప, కాళేశ్వరం, రామగిరి ఖిల్లా, కోటిలింగాల, ధర్మపురి, ఎలగందుల ఖిల్లాలను కలుపుతూ పర్యాటక వలయంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు.

గతేడాది నవంబరులో దేవాదాయ శాఖ అధికారులు ఖిల్లాపై సర్వే నిర్వహించారు. కోటపై శివలింగం, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఆలయాలను నిర్మించేందుకు రూ.50 లక్షల చొప్పున అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రామగిరిఖిల్లాకు బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) కింద రూ.5 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రెండు వైపులా కోట కింది వరకు రహదారులు నిర్మించనున్నారు.

రామగిరి ఖిల్లాకు 2 కి.మీ.ల రోప్‌వే నిర్మాణంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఎంపీ వంశీకృష్ణలు ఈ నెల 11న ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

రోప్‌వే ఏర్పాటైతే కోట కింది నుంచి పర్యాటకులు నేరుగా ఖిల్లాపైకి చేరుకునే అవకాశం ఉంది.

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం

రామగిరిఖిల్లా అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరు చేశాం. ఇక్కడి పుణ్య క్షేత్రాలతో ఖిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ నడుస్తోంది. రోప్‌వేపై ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. రహదారులు నిర్మించిన అనంతరం కోటపై దర్వాజాలు, కళా ఖండాలను అభివృద్ధి చేస్తాం.

డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

## పదిలో పాసైతే నేరుగా ఇంటర్

కొండగల్ : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి నేరుగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించాలని గురుకుల సొసైటీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయంతో పేద విద్యార్థులకు మేలు కలుగనుంది.

**100 శాతం సీట్ల భర్తీకి నిర్ణయం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇంటర్ గురుకుల కళాశాలల్లో వందశాతం సీట్లను భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు గురుకుల కళాశాలల్లో ప్రవేశం కల్పించడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సొసైటీలు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేవి. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్‌లో అడ్మిషన్ కల్పించేవారు. ఒక్క మైనార్టీ గురుకులాల్లో మాత్రం ఎవరు ముందు ప్రవేశం తీసుకోవడానికి వస్తారో వారికి అడ్మిషన్ ఇస్తారు. అర్హత సాధించని



విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చేరేవారు. పేద విద్యార్థులు ప్రైవేటులో చేరే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడేవారు. అర్హత సాధించని వారు లేకపోవడంతో చాలా సీట్లు మిగిలిపోయేవి. దీనిని నివారించడానికే గురుకుల సొసైటీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

**2,000కు పైగా విద్యార్థులు**

జిల్లాలో ఎస్సీ 6, ఎస్టీ 4, బీసీ 10, మైనార్టీ 6 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి విద్యార్థులు 2,000కుపైగా చదువుకుంటున్నారు. ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుండడంతో అర్హత సాధించిన వారికి మాత్రమే అడ్మిషన్ లభిస్తోంది. దీంతో కొందరు సీట్ల కోసం ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. గురుకుల పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థికి ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా నేరుగా ఇంటర్ గురుకులాల్లో ప్రవేశం కల్పించాలని సొసైటీలు తీసుకున్న నిర్ణయంతో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దందా మారలేదు.. తీరే మారింది

హైదరాబాద్: మత్తు పదార్థాలకు పెరిగిన డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొత్తదారులు వెతుకుతున్నారు. పోలీసుల తనిఖీనుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్నారు. నగరానికి వివిధ మార్గాల్లో రోజూ భారీగా గంజాయి చేరుతోంది. యంత్రాంగం దాడులు నిర్వహిస్తున్నా పూర్తిగా కట్టడి చేయలేకపోతున్నారు. రాజధానికి చేరుతున్న గంజాయిలో కేవలం 10–20శాతమే గుర్తిస్తున్నారు. ఏవోబీ, ఏపీలో కిలో రూ.6–8వేలకు కొనుగోలు చేస్తారు. హైదరాబాద్ చేరగానే దాని విలువ రూ.10–12వేలకు చేరుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, దిల్లీ వంటి ప్రాంతాల్లో కిలో రూ.60–70వేలు పలుకుతోంది. నిఘా పెరగడం, ఇప్పటికే



జైలుకెళ్లొచ్చిన ముఠా సభ్యులు పీడీ యాక్ట్ భయంతో వెనక్కి తగ్గి.. తెరవెనుక ఉండి కొత్తవారిని రంగంలోకి దింపుతున్నారు.

**నయా పంథా**

ఇటీవల గంజాయి సరఫరా చేస్తున్న రౌడీషీటర్లు అబ్దుల్ ఖదీర్, మహ్మద్ జోయెబ్‌ను అరెస్ట్ చేశారు. వీరివద్ద 2.5 కిలోల గంజాయి దొరికింది. 18 కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిపై 7 వరకు నాన్ బెయిలబుల్ వారెంట్లున్నాయి. పోలీసుల కన్నుగప్పి మకాం మార్చి గంజాయి దందా సాగిస్తున్నట్టు గుర్తించారు. పలు ఠాణాల్లో రౌడీ షీటర్లుగా నమోదైన వారిలో 10–15 మంది అనుచరులతో కలసి స్మగ్లింగ్ చేస్తున్నారు. విశాఖలో రైల్లోకి చేరిన ఏజెంట్లు సరకును ఒకచోట ఉంచి.. మరోచోట కూర్చుంటారు. తనిఖీల్లేవని నిర్ధారించుకున్నాక నల్గొండ, అల్వాల్, ఘటకేసర్ వంటిచోట దిగిపోతారు. అక్కడినుంచి సరకును శివారు ప్రాంతాలకు చేరవేసి భద్రపరుస్తారు. చోరీ చేసిన, నంబరు ప్లేట్ తీసేసిన బండ్లను అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ఇటీవల చిక్కిన నలుగురు నిందితులు ఏపీలో కొట్టేసిన బైక్‌లను వాడటం గమనార్హం. గంజాయి ప్యాకెట్లను పెడ్లర్లకు చేరవేసేందుకు యాచకులు, ఇంటినుంచి పారిపోయి నగరం చేరి కాలిబాటలపై, డివైడర్ల మధ్య ఉంటున్న మధ్య వయస్కులను ఉపయోగిస్తున్నారు.

## లక్ష్యం అధిగమించేలా.. ఉపాధి పనులు

బోయినపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా జిల్లాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న పని దినాల లక్ష్యం అధిగమించే దిశగా అధికారులు సాగుతున్నారు.వలసల నిరోధానికి...వలసలు నిరోధించి స్థానికంగా ఉపాధి కలించాలన్న లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పించడానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉపయోగకరమైన పనులను గుర్తించడంతో పాటు కూలీ పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. అధికంగా ఫీడర్ ఛానల్, మట్టి రోడ్లు, ఫారంపాండ్స్, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం, ఇంకుడు గుంతలు, నర్సరీల ఏర్పాటు, పశువుల షెడ్లు, నీటి కుంటల నిర్మాణం, నాటిన మొక్కలకు నీరు పోయడం తదితర పనులను చేయిస్తున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ పనులకు హాజరయ్యే విధంగా క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవోలు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో కూలీల హాజరు సంఖ్య తక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం కూలీలు అధిక సంఖ్యలో పనులకు హాజరవుతున్నారు. ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ప్రభుత్వం భూమిలేని కూలీలను గుర్తిస్తోంది. ఉపాధిహామీ పథకంలో పనిచేయాల్సి ఉండటంతో ఇప్పుడు అనేక మంది కూలీలు పనులు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.తొంభై శాతానికిపైగా...జిల్లాలో 12 బ్లాక్‌లు ఉండగా 255 గ్రామపంచాయతీల పరిధిలో 98వేల జాబ్ కార్డులున్నాయి. రెండు లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో 64 వేల జాబ్‌కార్డులు యాక్టివ్ కాగా 1.01 లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 17.6 లక్షల పనిదినాలు లక్ష్యం నిర్దేశించుకోగా 21.81 లక్షల పనిదినాలు కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21.78 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకోగా నేటికి 20.06 లక్షల పనిదినాలు కల్పించారు.

# ఎక్కడెంత..ఎవరిదెంత..?



హైదరాబాద్ : రాష్ట్రంలో నివసిస్తూ.. ఇండో– పాకిస్థాన్ యుద్ధం జరిగినప్పుడు ఇక్కడ ఉండలేక పాకిస్థాన్‌కు వెళ్లిన కొన్ని కుటుంబాల ఆస్తులను ఎనిమీస్ ప్రాపర్టీస్‌గా పిలుస్తుంటారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ త్వరలో వీటి లెక్క తేల్చనుంది. కొన్ని భూములు ఆక్రమణకు గురికాగా.. కొంత ప్రజాప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవడంతో వాటి విస్తీర్ణం తగ్గిపోయింది. తాజాగా వాటి స్థితిగతులను తెలుసుకొని కేంద్రం పరిష్కారం చూపనుంది. గ్రేటర్ పరిధిలో ఎనిమీస్ ప్రాపర్టీస్ భూముల విలువ మార్కెట్ ధరల ప్రకారం రూ.50వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**ఎకరా రూ.కోట్లలో..** కొత్వాల్‌గూడలో ఎకరా భూమి రూ.50కోట్లకుపైగా ఉండగా.. మియాపూర్‌లో రూ.50కోట్ల నుంచి రూ.70కోట్ల వరకూ పలుకుతోంది. ముషీరాబాద్‌కు సమీపంలోని బాకారంలో ఉన్న 25వేల చదరపు గజాల స్థలం కూడా గజం రూ.లక్ష నుంచి రూ.2లక్షలు మధ్య ఉంది. ఈ భూములను సర్వే చేసి హద్దులు సక్రమంగా ఉన్నాయా? ఎవరైనా ఆక్రమించుకున్నారా? రైతులు సాగుచేస్తున్నారా? ఆక్రమణదారులు ఎవరికైనా విక్రయించారా? అక్కడ పరిశ్రమలేవైనా ఉన్నాయా? అన్న అంశాలను నివేదిక రూపంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు మార్చి నెలాఖరులోపు పంపించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులను ఆశించారు.

**క్రమబద్ధీకరణకు అవకాశం..**

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తనకున్న విచక్షణాధికారాలు, ఎనిమీస్ ప్రాపర్టీస్ పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం.. విషయం తెలియకుండా ఆ భూములు కొన్నవారు, పాకిస్థాన్‌కు వలసవెళ్లిన యజమానుల కుటుంబ సభ్యుల వారసులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రయోజనాల కోసం లీజుకిచ్చిన భూములను క్రమబద్ధీకరించే అధికారం ఉంది.

సెక్షన్8 ప్రకారం రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ, మియాపూర్‌లోని 890 ఎకరాల్లో కొంత భాగం మినహా.. మిగతా భూములు రాష్ట్ర ప్రభుత్వానికే వస్తాయని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొత్వాల్‌గూడలో బాహ్యవలయ రహదారి నిర్మాణం కోసం కొన్ని ఎకరాలను హెచ్ఎండీఏ తీసుకుంది.

తప్పుడు పత్రాలతో ఆక్రమించుకున్న వారి నుంచి భూములను స్వాధీనం చేసుకుంటే అవసరాలకు ఉపయోగపడతాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రేటర్ పరిధిలోనే అత్యధికం..

రంగారెడ్డి జిల్లా – 690 ఎకరాలు

హైదరాబాద్ – 5.26 ఎకరాలు

శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ – 630 ఎకరాలు

మియాపూర్ – 260 ఎకరాలు

# నిధుల్లేక నిరాశ.. ప్రగతికి ప్రయాస



బషీరాబాద్ : పంచాయతీలకు పాలకులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి మరమ్మతులు, విద్యుత్ దీపాలు, ఇతర ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా వెంటనే పనులు చేయించాలంటే డబ్బులు అవసరం. సాధారణ నిధులు, పన్ను వసూలు నిధులపైనే ఆధారపడాల్సి వస్తోందని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

**రావాల్సింది రూ.60కోట్లు..**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రతి ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. వీటితో వార్డుల్లో అత్యవసర పనులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, దోమల నివారణ, పైప్‌లైన్ల మరమ్మతులు, ఇతర ప్రజా ఉపయోగ పనులను చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ముగింపు వరకు జిల్లాలోని పంచాయతీలకు రూ.60కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.35–40 కోట్లు మొత్తంగా రూ.100 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి కాగా, సాధారణ నిధులు, పన్నుల వసూళ్ల రాబడితో పంచాయతీల నిర్వహణ జరుగుతోంది.

**కార్యదర్శులపైనే భారం..:** సర్పంచి ఎన్నికల గడువు ముగిసి ప్రత్యేకాధికారులతో పల్లెపాలన కొనసాగడం ఏడాది కావస్తోంది. సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏసమస్య వచ్చినా సొంతంగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. విద్యుత్ దీపాలకు, మోటర్ల మరమ్మతులకు వెచ్చించిన డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందంటున్నారు. రాష్ట్ర నిధులు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకే సరిపోతుందంటున్నారు.

**సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం**

పంచాయతీల్లో నిధులు లేకున్నా.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. సర్పంచులు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు ఆగాయి. స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే నిధులు విడుదలవుతాయి. పన్నుల వసూలు, సాధారణ నిధులతో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి, వికారాబాద్.

పంచాయతీలు: 566

వార్డులు: 5,058

జనాభా: 12,90లక్షలు

15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.60 కోట్లు (ఏడాదికి)

రాష్ట్ర నిధులు: రూ.35–40 కోట్లు (ఏడాదికి)

# పనుల జోరు.. పల్లె రోడ్డు మారె



తాండూరు : దారిపొడవునా కంకరతో ప్రయాణ కష్టాలు పడ్డారు. అనేక మంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలయ్యారు. ఆస్పత్రుల్లో చేరి జేబులు ఖాళీ చేసుకున్నారు. రెక్కలుముక్కలు చేసుకొని సంపాదించిన కూలీ డబ్బులు మోటారు సైకిళ్ల మరమ్మతులకు వెచ్చించారు. ఎట్టకేలకు కంకర దారులను తారు రహదారులుగా తీర్చిదిద్దడంతో ప్రయాణ బాధలు తీరాయి. వందల సంఖ్య వాహనదారులకు ఊరట లభించింది.

**రూ.54 లక్షల మంజూరులో ఎట్టకేలకు కదలిక:** తాండూరు మండలం వీరారెడ్డిపల్లి నుంచి జాతీయ రహదారి వరకు ఏళ్లుగా మరమ్మతులు లేక తారు తుడిచిపెట్టుకుపోయింది. దారిపొడవునా కంకరతో రహదారి ఆనవాళ్లు కోల్పోయింది. రహదారి నిర్మించాలంటూ గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులుకు మొరపెట్టుకున్నారు. మూడు సంవత్సరాలుగా ప్రయాణ బాధలతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రూ.54లక్షలు మంజూరు చేయడంతో నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. గుత్తేదారు కంకర వేసి మూడు నెలలుగా వదిలేయగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో శనివారం తారు పనులు చేపట్టారు. కంకర మార్గంలో తారు రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలకు రహదారి సమస్య తీరిందని సంబురపడుతున్నారు.

**సిరిగిరిపేటకు ఏడాదిన్నరగా..**

సిరిగిరిపేట నుంచి జాతీయ రహదారి వరకు మధ్యమధ్యలో తారు రహదారి దెబ్బతింది. గుంతలుపడి కంకర తేలింది. దీంతో రహదారి నిర్మాణానికి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో గుత్తేదారుతో అధికారులు దారిపొడవునా జేసీబీ యంత్రంతో చదును చేయించారు. అంతా రహదారి నిర్మిస్తారని భావించారు. కానీ అక్కడక్కడ గుంతలు పడిన రహదారి మార్గాన్ని పూర్తిగా తవ్వేయడంతో కంకరతేల్చి వదిలేశారు. తారు రహదారి నిర్మించకపోవడంతో ఉన్న దారిని చదును చేసి ప్రయాణాన్ని మరింత క్లిష్టతరం చేశారని గ్రామస్థులు మండిపడ్డారు. ఏడాదిన్నర నుంచి కంకర మీదుగా ప్రయాణానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఒకదశలో ప్రధాన పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి నేతలు గ్రామానికి వెళ్లేందుకు నిరాకరించారు. వస్తే గ్రామస్థులు రహదారి నిర్మాణంపై నిలదీస్తారని వెనకడుగు వేశారు. రెండు రోజుల క్రితం రూ.39.80లక్షలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు తారు రహదారి నిర్మాణ పనులు ప్రారంభింపజేశారు. కొత్తగా తారు రహదారి నిర్మించడంతో రాకపోకలకు సౌలభ్యంగా మారిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పోలోమంటూ మైదానాలకు

హైదరాబాద్ : చల్‌చల్ గుర్రం.. చలాకీ గుర్రం అంటూ అశ్వాలపై స్వారీ చేసేందుకు సెలబ్రిటీలు... రాజకీయ ప్రముఖులు ఆసక్తి చూపుతున్నారు. నగర శివారు శంకర్‌పల్లి, మొయినాబాద్ ప్రాంతాల్లోని పోలో మైదానాల్లో గుర్రపు స్వారీలో శిక్షణ పొందుతున్నారు. సెలబ్రిటీల వారసులు.. కొత్తగా సినీరంగంలోకి వెళ్లాలనుకుంటున్న వారూ నేర్చుకుంటున్నారు. గుర్రాలను ఇష్టంగా పెంచుకునే సినీ నటుడు రామ్‌చరణ్ పోలో మైదానాల నిర్వాహకులకు సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. నాలుగైదేళ్లుగా శిక్షణకు ఔత్సాహికులు ఎక్కువగా వస్తున్నారు.శిక్షణ కాస్త ఖరీదే... గుర్రపు స్వారీ శిక్షణ కాస్త ఖరీదే. వృత్తిపరంగా.. హాబీగా నేర్చుకుంటే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశా లుంటాయన్న భావనతో పిల్లలు.. యువకులు పోలో మైదానాలకు వెళ్తున్నారు. ప్రవేశ కోర్సు 16 రోజులకు రూ.15వేలు, అడ్వాన్స్‌డ్ కోర్సు మరో 16 రోజులు, జంపింగ్ సెషన్స్ 16 రోజుల పాటు శిక్షణ తీసుకోవాలి. ఈ శిక్షణ పూర్తయ్యాక గుర్రపు స్వారీ చేయాలంటే రుసుం చెల్లించాలి.

ఆరేళ్ల చిన్నారుల నుంచి అరవైఏళ్ల వయసున్న వారూ నేర్చుకోవచ్చు.. బరువు 90కిలోలు మించకూడదు. ఉదయం 6 గంటల నుంచి 8.30



వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 కోసం శిక్షణ ఇస్తారు. సినీ నటులు, ఇతర ప్రముఖుల కోసం ప్రత్యేక ఎరీనాలు (మైదానాలు) అందుబాటులో ఉన్నాయి.

రూ.లక్షల్లో ధరలు..

గుర్రాల సంరక్షణకు పోలో మైదానాల నిర్వాహకులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బ్రీడ్ ఆధారంగా ఒక్కో గుర్రం రూ.2లక్షల నుంచి రూ.30లక్షలుంటుందని ఓ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు తెలిపారు. వీటి పోషణ కోసం కూడా భారీగానే వెచ్చిస్తామని చెబుతున్నారు. కొందరు ప్రముఖులు సొంతంగా గుర్రాలను కొనుగోలు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను పోలో మైదానాల్లోని వారికి అప్పగిస్తుంటారు. ఇందుకు నెలకు ఒక్కో గుర్రానికి కనీసం రూ.35వేలు తీసుకుంటున్నారు. శిక్షణ ఇచ్చేవారికి నిర్వాహకులు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకూ వేతనం ఇస్తున్నారు.

## హైదరాబాద్ మెట్రో.. 40 కి.మీ.లు.. 40 నిమిషాలు

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రోలో 40 నిమిషాల్లో చేరుకునేలా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) తయారీపై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు (హెచ్ఏఎంఎల్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రోరైలు విస్తరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి మీర్‌ఖాన్‌పేటలో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు జరుగుతున్న సర్వే పనులను హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు.

**ఫోర్త్ సిటీకి ఇలా..**

విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీకి దాదాపు 40 కి.మీ.దూరం ఉంటుంది. టర్మినల్ నుంచి మొదలై.. కొత్తగా చేపట్టే మెట్రో రైలు డిపో సమీపం నుంచి విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి మెట్రో మార్గం కొంత భూమార్గంలో, మరికొంత ఎలివేటెడ్‌గా వెళ్తుంది.

బహదూర్‌గూడలోని 1000 నుంచి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తారు.

పెద్ద గోల్కొండ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల



ఎగ్జిట్ వరకు 14 కి.మీ. పొడవున మెట్రో ఎలివేటెడ్ మార్గమే.

రావిర్యాల నుంచి కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్ పేట వరకు దాదాపు 22 కి.మీ. దూరం ఉంటుంది. ఇందులో 18 కి.మీ. వరకు భూమార్గంలోనే మెట్రో వెళ్తుంది. ఇక్కడ హెచ్ఎండీఏ 100 మీటర్ల వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు మెట్రోరైలుకు కేటాయించారు. ఇందులో మెట్రోని భూమార్గంలో నిర్మిస్తారు.

మేడ్చల్, శామీర్‌పేట కారిడార్లతో పాటూ ఈ ఫ్యూచర్‌సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్‌ను సైతం మార్చి నెలాఖరుకు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి సమర్పిస్తామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

ప్రాథమికంగా డీపీఆర్ స్వరూపమిలా...(కి.మీ.లలో..)

ప్రతిపాదిత స్టేషన్ల సంఖ్య 16

భూమార్గం 18

తక్కువ ఎలివేటెడ్ (ఓఆర్ఆర్ వెంట) 14

ఎలివేటెడ్ దూరం 6

భూ గర్భంలో మెట్రో 2

మొత్తం దూరం 40

చురకలు



# పర్యవేక్షణ గోరుకల్లు

పాణ్యం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో గోరుకల్లు జలాశయం నిర్లక్ష్యానికి గురైంది. నిర్వహణ నిధులు కేటాయించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అత్యవసర మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు చేపడుతున్నా పర్యవేక్షించేవారు కరవయ్యారు.

**ఇటుచూసే వారు లేరు**

జలాశయం పనులను ఎవరూ పర్యవేక్షించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించకపోవడంతో పైపైన గుంతలు పూడ్చి మమ అనిపించేస్తున్నారని అన్నారు. నెల రోజులకుపైగా పనులు సాగుతున్నా అధికారులు ఎవరూ ఇటువైపు రావడం లేదంటున్నారు. ఈ విషయమై గోరుకల్లు జలాశయం డీఈ జ్యోతి మాట్లాడుతూ.. సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. పనుల పర్యవేక్షణ కోసం తనతోపాటు మరో ఇద్దరు మహిళా ఏఈలను కేటాయించారన్నారు. పలు సమావేశాలకు హాజరుకావడం.. కుందూన ది వెడల్పు పనుల పర్యవేక్షణకు వెళ్లాల్సి రావడంతో గోరుకల్లు పనుల



వద్ద ఉండలేకపోతున్నామని చెప్పారు. పనులన్నీ పూర్తి కావాలంటే రూ.99 కోట్లు అవసరం అవుతుందని చెప్పారు.

**నిధులివ్వని వైకాపా**

ఎస్సార్బీసీ కాలువకు అనుసంధానంగా 12.44 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన గోరుకల్లు జలాశయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. గతంలో కట్ట బలహీనపడటంతో అప్పటి తెదేపా ప్రభుత్వం నిధులు కేటాయించింది. 92 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా లోపలివైపు కట్ట కుంగిపోయింది. **రూ.కోటి కేటాయింపు** కట్టపై కంపచెట్లు తొలగించడం, కోతకు గురైన కట్టను సరిచేయడం తదితరాలకు కూటమి ప్రభుత్వం రూ.కోటి ఇచ్చి ంది. ఈ నిధుల్లో గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్తు బిల్లులకు రూ.35 లక్షలు కేటాయించారు. మిగిలిన నిధులతో మూడు నెలల్లోపు మరమ్మతులు పూర్తిచేసేలా ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు.

# అదో పెద్ద ఫోర్‌ట్వంటీ వ్యవహారం!

విశాఖపట్నం : వైకాపా పాలనలో ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసిన ఉదంతాలు ఇప్పటికీ బయట పడుతూనే ఉన్నాయి. చెరువులను సైతం వదలని వైనాలు వెలుగులోకి వస్తున్నాయి. వాటి మీద ఫిర్యాదులు చేసినా అప్పట్లో అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. వివరాల్లోకి వెళితే... పెందుర్తి మండలం పెదగాడి రెవెన్యూ పరిధి జెర్రిపోతులపాలెంలో స్థానిక వైకాపా నేత ఏకంగా ఓ చెరువును మాయం చేశారు. ఆక్రమించేసి దాని స్వరూపాన్ని మార్చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ చెరువుకు చెందిన సర్వే నంబరును సబ్‌డివిజన్ చేసి వారి కుటుంబ సభ్యుల పేర్లతో మార్పించుకున్నారు. ఆ భూముల విలువ ప్రస్తుతం రూ.50 కోట్లు పలుకుతుండగా వాటిలో మొక్కలు పెంచుతూ స్వాధీనంలో ఉంచుకున్నారు.

పెదగాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 420లో 4.75 ఎకరాలు ప్రభుత్వ భూమి చెరువుగా ఉంది. గతంలో అదే చెరువులో గనుల శాఖ అనుమతులతో మట్టి తవ్వకాలు సైతం జరిపేవారు. ఎఫ్‌ఎంబీ రికార్డులోనూ జలవనరు, గెడ్డగా ఉంది. విలువైనది అవ్వడంతో గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆ చెరువు స్థలాన్ని కాజేశారు. అప్పట్లో అధికారుల మీద ఒత్తిడి తెచ్చి వ్యూహాత్మకంగా రికార్డుల్లో వివరాలు మార్పించుకున్నట్లు సమాచారం. సర్వే నంబరు 420లో చెరువు ఉంటే దానికి సబ్ డివిజన్లు సృష్టించుకున్నారు. 420-1 సర్వే నంబరుతో వైకాపా నేత, అతని సోదరుడి పేరుతో రెండేసి ఎకరాలు చొప్పున నాలుగెకరాలు పట్టా కింద వివరాలు నమోదు చేయించారు. అంటే ఇక్కడ చెరువు స్థలాన్ని దర్జాగా వారి పేర్లతో మార్చేసుకున్నారు. అప్పుడే ఆ చెరువు స్థలాన్ని నెమ్మదిగా చదును చేసి మొత్తం పూడ్చేశారు. ఇప్పుడు దాన్ని వ్యవసాయ క్షేత్రంగా మార్చేసి సరుగుడు మొక్కలు పెంచుతున్నారు.

ఏవిధంగా చేశారో..: రికార్డులో పక్కాగా చెరువుగా ఉన్నదాన్ని పట్టా భూములుగా నమోదు చేయించడం ప్రస్తుతం చర్చనీయాంశ



మవుతోంది. వాస్తవానికి 420 సర్వే నంబరులో 4.75 ఎకరాలకు నాలుగెకరాలు రాస్తే మిగిలిన స్థలం చెరువుగా చూపించాలి. అలాకాకుండా ఆ రెండింటినీ చూపించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. దీని మీద ఫిర్యాదులు అందినా అధికారులు మిన్నకుండడంపై విమర్శలు వస్తున్నాయి.

**జాతీయ రహదారి విస్తరణలో..**

ఆక్రమించిన స్థలంలో కొంత షీలానగర్-సబ్బవరం ఆరు వరుసల రహదారిలో పోయింది. రికార్డుల ప్రకారం ఆయన పరిహారానికి అర్హుడు కాకపోయినా రాజకీయ ఒత్తిడితో రూ.50 లక్షలకు పైగా పరిహారం కొట్టేశారు. ఇక్కడ జాతీయ రహదారి కోసం భూసేకరణ చేపట్టారు. అందులో అరెకరం వరకు రహదారి కోసం తీసుకున్నారు. వాస్తవానికి అది ప్రభుత్వ చెరువు అవ్వడంతో పరిహారం ఇచ్చే జాబితాల్లో మొదట స్థానిక నేత పేరు చేర్చలేదు. సంబంధిత అధికారుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చి పరిహారం వచ్చేలా చేయించుకున్నారు.

# పట్టురైతుల ఆశలన్నీ ప్రభుత్వం పైనే




హిందూపురం : కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు ఉత్పత్తి చేయాలంటే రైతుకు రూ.450 నుంచి రూ.500 వరకు వ్యయం అవుతోంది. అంటే మార్కెట్‌లో కిలో పట్టుగూళ్లు ధర రూ.650 నుంచి రూ.700 వరకు విక్రయమైతే రైతుకు రూ.100 వరకు చేతికి అందే అవకాశం ఉంది. ప్రస్తుతం స్థానిక మార్కెట్లో నాణ్యమైన గూళ్లు రూ.550 ధర పలుకుతున్నాయి. దీనివల్ల రైతు కుదేలు అవుతున్నాడు. గతంలో రూ.1,500 చెల్లిస్తే రాయితీపై రైతులకు విజేత, బ్లీచింగ్, సున్నం, శానిటైజర్, ఎరువులు అందించేవారు. గత వైకాపా ప్రభుత్వం ఈ రాయితీ రద్దు చేయటంతో ప్రతి రైతులు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు వీటికి అదనంగా డబ్బు వెచ్చించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మా ఆశలన్నీ కూటమి ప్రభుత్వం మీదే ఉన్నాయని పట్టు రైతులు తమ మనోగతాన్ని వెల్లడించారు.

**తాతల కాలం నుంచి సాగు చేస్తున్నాం- సిద్దేశ్, కేకే పాళ్యం**

మా తాతల కాలం నుంచి రేషం సాగు చేస్తున్నాం. కుటుంబం మొత్తం దీనిపైనే ఆధారపడి ఉంది. గతంలో అన్ని ప్రభుత్వాలు సహకరిస్తున్నందున పంట సాగు గిట్టుబాటుగా ఉండేది. ప్రస్తుతం గుడ్ల నుంచి ఆకు ధర, కూలీ వ్యయం, మందులు, ఎరువుల ధరలు పెరిగినా మార్కెట్లో గూళ్ల ధరలు తగ్గాయి. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

**రూ.100 పెంచి ఆదుకోవాలి- మంజునాథ్, తిమ్మలాపురం**

ఆధునిక పద్ధతులు పాటించటంతో వంద గుడ్లకు వంద కిలోల గూళ్ల దిగుబడి వస్తోంది. అయినా మార్కెట్లో ఎంత నాణ్యమైన గూళ్లు తీసుకెళ్లినా రూ.550కి మించి ధర లభించటం లేదు. గతంలో అందించే ప్రోత్సాహం రూ.100కు పెంచి ప్రతి రైతుకు కనీసం అవసరమైన మందులు, ఎరువులు రాయితీతో అందిస్తే కొంతమేరకైనా రైతులకు ఊరట కలుగుతుంది. **ధర తగ్గినా ప్రోత్సాహం ధీమా ఇచ్చేది - నాగరాజు, హిరేతుర్పి** గతంలో వాతావరణం, మార్కెట్ పరిస్థితులను బట్టి ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వస్తుందన్న ధీమా ఉండేది. గత వైకాపా ప్రభుత్వం ఇవ్వక పోవటంతో ధరలు గిట్టుబాటుగా లేవు. కూటమి ప్రభుత్వం పట్టురైతుల సంక్షేమాన్ని ఆలకించి కిలోకు రూ.100 ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి.

# ముద్ర వేస్తేనే రేషన్ సరకులు



పుట్టపర్తి : రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే బియ్యం సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది. గతంలో రేషన్‌కార్డులో సభ్యులందరికీ ఈ-కేవైసీ చేశారు. చాలా మంది ఈ ప్రక్రియను పూర్తి చేసుకోలేదు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ-కేవైసీ చేయాలని శ్రీకారం చుట్టింది. రేషన్ పంపిణీలో అక్రమాల కారణంగా రూ.కోట్ల విలువైన సరకులు పక్కదారి పడుతున్నాయి. దీన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేవలం అర్హులు మాత్రమే నిత్యావసరాలు పొందేలా ఈ-కేవైసీ చేయిస్తోంది. దీనిపై రెండు నెలలుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. సుమారు 1,73,597 మంది ప్రక్రియకు దూరంగా ఉన్నారు. నెలాఖరుతో గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులంతా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు. **వలసదారులే అధికం** జిల్లాలో పలువురు లబ్ధిదారులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. అక్కడే పనులు చేసుకుంటూ నివసిస్తున్నారు. రెండు, మూడు నెలలకోసారి ఆయా కుటుంబాల్లోని సభ్యులు స్వగ్రామాలకు వచ్చి ముద్ర వేసి రేషన్ సరకులు తీసుకుంటున్నారు. ఆయా కుటుంబాల్లో చాలమంది ఈ-కేవైసీ చేయించలేదు. ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు చేతి వేళ్లపై ముద్రలు అరిగిన వారి ప్రక్రియ పూర్తి కాలేదు. కార్డులోని సభ్యులందరికీ ఈ-కేవైసీ పూర్తి చేసి సమగ్ర డేటాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ తర్వాత అర్హులకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ-కేవైసీ చేస్తున్నారు. ఎక్కడైనా చేయించుకోవచ్చు - సింధు, జిల్లా పౌరసరఫరాల ఉపఅధికారి

స్వగ్రామాలకు దూరంగా ఉన్నవారు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా ఈ-కేవైసీ చేసుకునే అవకాశం ఉంది. రేషన్ దుకాణం, మీసేవ, ఆధార్ కేంద్రాల్లోనూ నమోదు చేయించుకోవచ్చు. చిన్నారులకు సంబంధించి ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేస్తే సరిపోతుంది.

చౌక దుకాణాలు : 1,368
రేషన్ కార్డులు : 5,66,108
మొత్తం సభ్యులు : 16,89,531
ఈ-కేవైసీ పూర్తయినవారు : 15,15,934
చేయించుకోవాల్సిన వారు : 1,73,597

# నీటి కుంట.. నిండుపంట



చిత్తూరు : అన్నదాతల సాగునీటి అవసరాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం మరో ముందడుగేసింది.. నీటినిల్వ సాంద్రత పెంచేందుకు.. సాగుకు నీటికొరత తలెత్తకుండా చూసేందుకు పంటకుంటలు విరివిగా నిర్మించాలని నిర్ణయించింది.. నిర్మాణాన్ని ఇప్పటికే యజ్ఞంలో చేపట్టడంతోపాటు సరికొత్త నమూనాతో రైతులకు అదనపు ప్రయోజనం కల్పించనుంది.

జిల్లాలో 697 గ్రామ పంచాయతీల్లో పంట కుంటలు తవ్వనున్నారు.. ఒక్కో పంచాయతీ పరిధిలో కనీసం 20 చొప్పున ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం జిల్లాలో 13 వేల పంటకుంటలు లక్ష్యం కాగా ఇప్పటికే 15,503 మంజూరు చేశారు.. ముందుగా ప్రతి గ్రామంలో మార్చి 31లోగా పదివేల కుంటలు నిర్మించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి మిగిలినవి నిర్మిస్తారు. ఇప్పటికే రైతుల పొలాల్లో వీటి తవ్వకాలు ప్రారంభించారు.

**మెట్టప్రాంత రైతులకు వరం**

పంట కుంటలు మెట్టప్రాంత రైతులకు వరంగా మారనున్నాయి. ప్రధానంగా జిల్లాలోని పశ్చిమప్రాంత రైతులకు వీటితో ప్రయోజనం కలగనుంది. పొలం విస్తీర్ణాన్నిబట్టి పంటకుంటను ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చు. ఈ కుంటల విస్తీర్ణాన్ని బట్టి నిధులు ఖర్చు చేయనున్నారు. 5ఐ5, 10ఐ10, 15ఐ15, 20ఐ20 మీటర్ల విస్తీర్ణంలో వీటిని తవ్వనున్నారు. విస్తీర్ణాన్ని బట్టి రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చుకానుంది. వందశాతం ఉపాధి నిధులతోనే ఈ పనులు చేస్తారు. పూర్తిగా వేతనదారుల ఖాతాలకే డబ్బులు జమవుతాయి.

**రెండు వరుసల్లో..**

ప్రతి కుంటకు ఇన్‌లెట్, అవుట్‌లెట్ ఉండేలా ఏర్పాటు చేయనున్నారు. వీటిలో విధిగా నీరు నిల్వ చేయడం ద్వారా చుట్టూ భూగర్భ జలాలు పెరిగి పంట దిగుబడి అధికమవుతుంది. కుంట చుట్టూ రెండు వరుసల్లో గట్ల నిర్మాణం చేపడతారు. ఒక వరుసలో కూరగాయల సాగు, రెండో వరుసలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టనున్నారు. కిచెన్ గార్డెన్ కిట్లు, పండ్ల మొక్కలు ఇవ్వనున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

పంటకుంటల తవ్వకంతో వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలనీటి మట్టాన్ని పెంపొందించవచ్చు. చుట్టూ గట్లపై పండ్ల మొక్కలు, కూరగాయలు పెంచవచ్చు. తద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. రవికుమార్, పీడీ, డ్వామా

# వ్యాధి నిర్ధారించరు

బనగానపల్లి : నిరుపేదలకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకుగాను బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు దూరంగా ఉన్నాయో ఆ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకుగాను 2022లో బీపీహెచ్ యూనిట్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. మూడేళ్లవుతున్నా ఇప్పటివరకు పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా జనం ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.3.50 కోట్ల కేటాయింపు**

నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్ల, గడివేముల, శిరివెళ్ల, పాములపాడు, బండిఆత్మకూరు, నొస్సం, ప్యాపిలి ప్రాంతాలను ఎంపిక చేశారు. ఒక్కో భవనానికి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.3.50 కోట్లు కేటాయించారు. మూడేళ్లు దాటినా భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల పూర్తైనా.. మరికొన్నిచోట్ల ఆగిపోయాయి.



గత వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

**అందుబాటులోకి వస్తే..**

కొలిమిగుండ్లలో భవనం చివరి దశలో ఆగిపోవడంతో రోగులు అనంతపురం జిల్లా తాడిపత్రికి లేదా బనగానపల్లి ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి. ప్యాపిలిలో భవనం అందుబాటులోకి రాకపోవడంతో డోన్‌కు వెళుతున్నారు. శిరివెళ్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆళ్లగడ్డ, నంద్యాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ఆయా కేంద్రాల్లో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రోగ నిర్ధారణ సంబంధ 30 రకాల పరీక్షలు నిర్వహిస్తారు.

విషయమై డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ ఈ కేంద్రాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణాలు పూర్తి చేస్తే సిబ్బందిని నియమిస్తామని అన్నారు.

# అకాల కష్టం

పాణ్యం : అకాల వర్షాలతో మిరప రైతులు కుదేలయ్యారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం కురిసిన వడగళ్ల వాన కారణంగా మిరప పంటకు అపార నష్టం జరిగింది. అన్నదాతలకు కన్నీరే మిగిలింది. నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మిరప సాధారణ సాగు 12,262 హెక్టార్లు కాగా 10,067 హెక్టార్లలో సాగైంది. ఎకరాకు రూ.2 లక్షలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తెగుళ్లు పెద్దఎత్తున ఆశించడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సి ఉండగా.. 10 నుంచి 15 క్వింటాళ్లకే పరిమితమైంది. మరోవైపు ధర సైతం పడిపోయింది. ప్రస్తుతం సరకు నాణ్యతను బట్టి క్వింటా రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది.

**వందలాది ఎకరాల్లో నష్టం** అసలే ఒకపక్క దిగుబడులు రాక.. మరోపక్క ధర లేక రైతులు అల్లాడు తుండగా.. కురిసిన అకాల వర్షంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, ఎం.ఉప్పులూరు, కోవెలకుంట్ల, కలుగొట్ల, జొలదరాశి తదితర గ్రామాల్లో భారీ గాలులతోపాటు వడగళ్ల వాన కురిసింది. ఫలితంగా వందలాది ఎకరాల్లో మిరప పంట దెబ్బతింది. ఒక్క రేవనూరు గ్రామంలోనే 500 ఎకరాల్లో సాగు చేయగా 300 ఎకరాల్లో పంట దెబ్బతినడం గమనార్హం. మరోవైపు కల్లాల్లో ఆరబోసిన దిగుబడులు సైతం తడిసిపోయాయి.

**ప్రభుత్వమే ఆదుకోవాలి :సత్యరాజు, రైతు, రేవనూరు**నేను ఎకరా రూ.50 వేల చొప్పున ఐదెకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగు చేశా. ఎకరాకు రూ.1.70 లక్షలు పెట్టుబడిగా పెట్టా. ప్రస్తుతం పంట కోతకు రావడంతో పనులు ప్రారంభించాలని భావిస్తున్న సమయంలో అకాల వర్షంతో పంట దెబ్బతింది. చెట్టుకు ఉన్న కాయ లన్నీ వడగళ్ల దెబ్బకు పగిలిపోయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

# కట్టు తప్పితే కటకటాలే!

నర్సీపట్నం : మత్తుమందుల విక్రయాలకు నిబంధనలు కఠినతరం అయ్యాయి. ప్రభుత్వం ఇప్పుడు వీటిపై నిఘా తీవ్రతరం చేసింది. 'ఆపరేషన్ గరుడ' పేరిట చేపట్టిన ఆకస్మిక దాడుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వీటిని యథేచ్ఛగా అమ్ముతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇకపై గుర్తింపు కలిగిన వైద్యుడి చీటీ లేకుండా వీటిని విక్రయించకుండా మరింత కట్టుదిట్టం చేయాలని సర్కారు నిర్ణయించింది. నిబంధనలు ఉల్లంఘించే వారికి గట్టి శిక్షలు అమలు చేస్తూ వీటికి చెక్ పెట్టాలని ప్రతిపాదించింది.

గంజాయి ఇతర మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాల నిరోధానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజున పోలీసు తదితర ఉన్నతాధికారులతో కూడిన ఈగల్ తదితర బృందాలు ఔషధ దుకాణాల్లో సోదాలు చేపట్టాయి. ఇందులో మత్తు పదార్థాలకు తోడు ఇతర ప్రమాదకర మందులు పట్టుబడ్డాయి. నిబంధనలను ఉల్లంఘించి వీటిని ఔషధ వ్యాపారులు కొందరు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు చిన్న దుకాణాలు మినహా అమ్మకాలు అధికంగా ఉండే అన్ని దుకాణాలపై కట్టుదిట్టమైన నిఘాకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో సాగిన విక్రయాల్లో అక్రమాలు పెద్దగా చూడకపోయినా ముందుజాగ్రత్తగా ఇక్కడ సైతం అన్ని దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. వైద్యుడి సిఫార్సు లేకుండా విక్రయాలు సాగించే దుకాణ యజమానులను మాదక ద్రవ్యాల నిరోధక (ఎన్‌డీపీఎస్) చట్టం కింద అరెస్టు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

చీటీ ఉంటేనే అనుమతించాలి: జిల్లాలోని ఔషధ దుకాణ యజమానులందరికీ మత్తు మందుల అమ్మకాలపై తగిన హెచ్చరికలు జారీ చేశాం. వైద్యుడి చీటీ ఆధారంగానే ఇవ్వాలని సూచించాం. ఇకపై ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవి అమ్మినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాం. అనకాపల్లిలో వీటి అమ్మకాలకు సంబంధించి రిజిస్టర్ లేకపోవడం, అమ్మిన వాటికి బిల్లులు ఇవ్వకపోవడం వంటివి గుర్తించాం. వీటిపై నలుగురికి నోటీసులు అందజేశాం. ఇకపై ఆకస్మిక సోదాలు విస్తృతంగా కొనసాగనున్నాయి. నిబంధనలు పాటించకుంటే తక్షణం కేసులు నమోదు చేస్తాం.

చురకలు



# పచ్చనిచెట్టు.. తెరమరుగు

కుప్పం : పొలం గట్లపై పెంచిన చెట్లను నరకాలంటేనే రెవెన్యూ, అటవీ అనుమతులు తప్పనిసరి.. అనుమతి లేకుండా నరికితే కేసుల తోపాటు జరిమానాలు కట్టాలి. కానీ కలప వ్యాపారంలో ఆరితేరిన బడావ్యక్తులు ఎకరాల కొద్దీ వృక్షాలను యథేచ్ఛగా నరుకుతూ రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు.

కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 70 వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. వ్యవసాయ బీడు భూములతోపాటు పొలం గట్లపై చెట్ల పెంపకానికి రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లోని నిర్దేశిత విస్తీర్ణంలో 40 శాతానికి పైబడి పచ్చదనం అలముకుంది. దీనిపై పొరుగు రాష్ట్రాల కలప వ్యాపారుల కన్నుపడింది. తమిళనాడు, కర్ణాటకలో చెట్ల నరికివేతపై అక్కడి ప్రభుత్వాలు కఠినంగా



ఆంక్షలు విధించడంతో.. కలప వ్యాపారులు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు.

**వేబ్రిడ్జిల ముసుగులో..**

రెండు నియోజకవర్గాల్లోనూ వాణిజ్య అవసరాలకు మించి వే బ్రిడ్జిల(ఎలక్ట్రిక్ తూకపు యంత్రాలు)ను ఏర్పాటు చేశారు. కుప్పం–పలమనేరు జాతీయ రహదారితో పాటు గ్రామీణ మార్గాల పక్కన పదుల సంఖ్యలో వే బ్రిడ్జిలను రూ.లక్షల వ్యయంతో నెలకొల్పారు. సరిహద్దు కర్ణాటక పరిధిలోనూ వే బ్రిడ్జిల నిర్వహణ ముసుగులో కలప సేకరణ, తరలింపును నిత్యకృత్యంగా కొనసాగిస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**వి.కోట, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడుపల్లె, బైరెడ్డిపల్లె తదితర మండలాల్లో నరికిన చెట్ల నుంచి కలప పైపొట్టును తొలగించి ట్రాక్టర్లలో వే బ్రిడ్జిలకు చేరవేస్తారు. అక్కడ లారీల్లో నింపి కుప్పం–పలమనేరు జాతీయ రహదారి మీదుగా తమిళనాడులోని మేటుపాళ్యంకు రవాణా చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ, అటవీ చెక్‌పోస్టులు ఉన్నా.. అడ్డుకోకపోవడం గమనార్హం.

# కుమారా.. అనుమతి ఎవరిచ్చారయ్యా..!

చిత్తూరు : మట్టి మాఫియా పట్టపగలే.. అందరూ చూస్తుండగానే.. చాలా పద్ధతిగా సహజ వనరుల్ని స్వాహా చేస్తోంది. ఈ తతంగం జరిగేది ఏదో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటు. జిల్లా కేంద్రం చిత్తూరు నగర నడిబొడ్డున కట్టమంచిలో జరుగుతోంది. ఆర్టీసీ–2 డిపో సమీపంలోని స్వామి వివేకానంద సాగర్ చెరువులో కొద్దిరోజులుగా మట్టి వనరుల్ని అక్రమంగా జేసీబీతో తోడేసి ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. నిత్యం కనీసం 25 ట్రాక్టర్లకు తగ్గకుండా మట్టిని దర్జాగా తవ్వేసి తీసుకెళ్తున్నారు. ఇలా అక్రమంగా రూ.లక్షలు



దోచేస్తున్నారు. ఇదంతా చిత్తూరు, పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. సంబంధిత యజమానుల నుంచి భారీగా గుంజేస్తున్నారు. ఈ అక్రమాలు ఏంటని అధికారులు చెరువు వద్దకు వెళ్లి తవ్వకాలకు అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించారు. 'మా వెనుక ఎవరున్నారో తెలుసా'? అంటూ తవ్వకాలు చేస్తున్న వ్యక్తులు.. కనిపించని ఉత్తర కుమారుడికి ఫోన్ చేసి ఇస్తున్నారు. ఆ వ్యక్తితో మాట్లాడిన అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండ వెళ్లిపోతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై జలవనరుల శాఖ ఏఈ పీరాను.. వివరణ కోరగా.. తవ్వకాలకు తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. ఎవరైనా అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# దళారీ పంతం.. ధాన్యం ధరల పతనం

గూడూరు : రబీ సీజన్‌లో ధాన్యం దిగుబడులు క్రమంగా తగ్గడం.. గిట్టుబాటు ధరలేకపోవడంతో వరి రైతులు ఈసారి నష్టాలు భరించాల్సి వస్తోంది. తెలుగుగంగ నీటిని ముందస్తుగా చెరువులు, కాలువలకు విడుదల చేయడంతో జిల్లాలో 1,82,790 ఎకరాల్లో సాగు చేశారు.సీజను ప్రారంభంలో పలు మండలాల్లో ఎడతేరిపి లేకుండా వర్షాలు కురవడంతో వరినాట్లు, పైర్లు దెబ్బతిన్నాయి. వెన్నుతీసే దశలో మంచుతీవ్రత అధికంగా ఉండటంతో చీడపీడల బెడద ఎక్కువైంది. ఎకరానికి 45 బస్తాలు రావాల్సిన దిగుబడి 30–35 బస్తాలు వచ్చింది. ముందస్తుగా సాగుచేసిన రైతులకు 25 బస్తాలలోపే ఉంది. జిల్లాలో గూడూరు, సూళ్లూరుపేట,



వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వరికోతలు చివరిదశలో ఉన్నాయి. మిల్లర్ల తరఫున ధాన్యం కొనుగోలు చేసే దళారులు మద్దతు ధర కంటే తక్కువగా రైతుల నుంచి కొనుగోలు దగా చేస్తున్నారు. తేమశాతం, గోనిసంచి పేరుతో బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తగ్గించి నగదు చెల్లిస్తున్నారు. రైతు, మిల్లరకు మధ్యలోని దళారుల జోక్యంతో బస్తాకు రూ.300 వరకు ధర తగ్గిపోతుంది. రుణబాధలతో నేరుగా మిల్లరు లేదా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించలేక దళారులు అడిగిన మేరకు ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తోందని సన్నచిన్నకారు రైతులు వాపోతున్నారు.

**సాగు వివరాలు..**జిల్లాలో వరి సాగు: 1.85 లక్షల ఎకరాలు

దిగుబడి : 6.40 లక్షల పుట్లు

గతేడాది ధర ఏగ్రేడ్ బస్తా: రూ.2,200–2,500

ప్రస్తుతం ధర: రూ.1,550–1,600

# పల్లె గొంతెండుతోంది



అనంతపురం : వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. గుక్కెడు నీటికి ప్రజలు కష్టాలు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. దీంతో ప్రజలు వ్యవసాయ పొలాల్లోని బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. కొన్నిచోట్ల ద్విచక్రవాహనాల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొందరు ప్రైవేటు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో చేతిపంపులు ఉన్నా.. అవి దిష్టిబొమ్మల్లా మారాయి. వీటి నిర్వహణకు వైకాపా ప్రభుత్వ పాలనలో చొరవ చూపకపోవటంతో పనికి రాకుండా పోయాయి. జిల్లాలో 127 గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంటుందని, వీటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని అధికారులు నివేదించారు.

**గుక్కెడు నీటికి పక్క కాలనీలకు..**

కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురం గ్రామంలో 2008లో ఆర్డీటీ కాలనీ ఏర్పాటైంది. ఇక్కడ 40 కుటుంబాలు ఉండగా, సుమారు 215 మంది జనాభా నివాసం ఉంటున్నారు. కాలనీలో బోరుబావులు తవ్వినా నీరు పడలేదు. శ్రీరామిరెడ్డి నీటి పథకం నీరు రావడం లేదు. చేతిపంపులు లేవు. విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడు మాత్రమే ప్రజలు పక్క కాలనీలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మురళి వివరణ కోరగా నీటి సమస్య గ్రామాల్లో ట్రాక్టర్లతో సరఫరా చేసేందుకు నివేదించాం. చేతిపంపులను వినియోగంలోకి తెస్తామన్నారు.

**క'న్నీటి' కష్టం తొలగేదెన్నడో?**

కూడేరు మండలం మరుట్ల–3 గ్రామంలో 250కిపైగా గృహాలు ఉండగా 1,000 వరకు జనాభా నివాసం ఉంటున్నారు. ఏడాదిన్నరకుపైగా తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామస్థులు అధిక మంది తెదేపాకు ఓటు వేశారన్న అక్కసుతో గత వైకాపా ప్రభుత్వం నీటి సరఫరాను నిలిపేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నీటి సరఫరా పునరుద్ధరణలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అలసత్వాన్ని వీడడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో కుళాయిల్లో నీరు రాక ప్రజలు అల్లాడుతున్నారు.

**బయన్నపేటలో దాహం కేకలు**

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి పంచాయతీ పరిధిలోని బయన్నపేట గ్రామంలో 100 కుటుంబాలు ఉండగా.. 400 మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. తాగడానికి చుక్కనీరు లభించక ప్రజలు వ్యవసాయ పొలాలకు పరుగులు తీస్తున్నారు. గ్రామంలోని పంచాయతీ బోరులో నీరు అడుగంటడం, నరసమ్మ ఆలయం వద్ద ఉన్న బోరు నీటిని కొందరు రైతులు పొలాలకు మళ్లించుకోవడంతో సమస్య మొదలైంది. దీనిపై ఈవోఆర్డీ సదాశివను వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# చాపకింద నీరులా క్షయ



అనంతపురం : క్షయ బాధితులు తుమ్మినా, దగ్గినా వ్యాధి గాలి ద్వారా ఇతరులకు విస్తరిస్తుండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేసులు పెరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ బ్యాధి బారినపడుతున్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో 2,041, శ్రీసత్యసాయి జిల్లాలో 2,119 మంది బాధితులు వైద్య చికిత్సలు పొందుతున్నారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలతోపాటు అనంతపురం జిల్లాలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో, శ్రీసత్యసాయి జిల్లాలో బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రి, మరో ఏడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. బాధితులకు వైద్య చికిత్సలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. క్షయ బాధితులకు గత ఏడాది నవంబరు నుంచి ప్రతి రోగికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నిక్షయ్ పోషణ్ యోజన కింద రూ.1000 నగదును ప్రభుత్వం అందజేస్తోంది.

**లక్షణాలివి..**

రెండు వారాల కంటే ఎక్కువ రోజులు జ్వరం, దగ్గు, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గటం, ఆకలి లేకపోవటం, నలత, అలసట, రక్తం పడటం, నీరసం, ఛాతిలో నొప్పి, ఏదైనా శరీర భాగంలో గుల్లలు, వాపు రావటం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు ఉంటే క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. ఆరు, తొమ్మిది, 24 నెలల వైద్య చికిత్స కోర్సును కచ్చితంగా పాటిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కోర్సు పాటించకపోతే రోగం తిరగపెడుతుంది.

**దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు జాగ్రత్త**

మధుమేహం, హెచ్‌ఐవీ, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుండటంతో ఎక్కువగా క్షయ బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అలాంటి వారిలో క్షయ లక్షణాలు కనపడిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం- తిప్పేస్వామి, డీఎల్‌ఏటీఓ, శ్రీసత్యసాయి జిల్లా**


శ్రీసత్యసాయి జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ఎనిమిది టీబీ యూనిట్ల ద్వారా పరీక్షలు చేసి, రోగులకు ఉచిత వైద్యంతోపాటు పౌష్టికాహారం కోసం ఆరు నెలలపాటు నెలకు రూ.1000 చొప్పున అందజేస్తున్నాం. శ్రీసత్యసాయి జిల్లాలో క్షయ రహిత పంచాయతీలు 29 ఉన్నాయి.

**మందులు వాడితే నయమవుతుంది- డాక్టర్ కావేటి సతీశ్‌కుమార్, పల్మనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, అనంతపురం**

క్షయ అంటే ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రోగులు వైద్యులు సూచించిన కోర్సు ప్రకారం మందులు వాడితే వ్యాధి కచ్చితంగా నయమవుతుంది. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. మందులూ ఇస్తున్నారు.

# కలకలంలోనూ.. కదలని ఎస్బీ

చిత్తూరు : పుంగనూరు ఘటన నేపథ్యంలో మాజీమంత్రి, తెదేపా సీనియర్ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పోలీసు శాఖపై దుమ్మెత్తిపోశారని, తమ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపారని ఎస్పీ మణికంఠ ప్రక్షాళన దిశగా అడుగులేశారు. 264 మందిని బదిలీ చేసినా కీలకమైన, పోలీసుశాఖకు ఆయువు పట్టులాంటి స్పెషల్ బ్రాంచ్‌ను కదపకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.. ఈ విభాగంలో ఏళ్లతరబడి పాతుకుపోయి ఒకేచోట కొందరు విధులు నిర్వర్తిస్తున్నా ఎస్పీ పట్టించుకోకపోవడం యావత్ జిల్లా యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేసింది.



చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన కానిస్టేబుళ్ల బదిలీలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని సిబ్బంది అంతర్గతంగా వ్యాఖ్యానిస్తున్నారు. పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్య నేపథ్యంలో పలమనేరు ఎమ్మెల్యే పోలీసుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపేలా ఘాటుగా స్పందించిన విషయం విదితమే. దీంతో స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ ఆగమేఘాలపై 264 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఇవన్నీ కౌన్సెలింగ్ లేకుండా చేయడం విమర్శలకు తావిస్తోంది. వీటిలో ముఖ్యంగా సీసీ, ఏ–2 క్లర్క్, సూపరింటెండెంట్‌లు ఉండగా కొందరికి స్థానికంగానే పోస్టింగ్‌లు ఇచ్చారని, డీపీవోలో పనిచేసే వారు.. కొందరు సిబ్బంది నుంచి డబ్బు తీసుకుని చేతివాటం ప్రదర్శించారనే బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**స్పెషల్‌బ్రాంచా.. అమ్మో..?..**

జిల్లాలో ఎక్కడ ఏంజరిగినా.. ఏంజరగాలన్నా ప్రత్యేక బ్రాంచి(ఎస్‌బీ) నిఘా ఉంటుంది. అవినీతి, అక్రమాలు అణచివేయడం నుంచి సిబ్బంది పనితీరుపై ఈ విభాగం డేగలా వెంటాడుతుంది. అయితే.. ప్రస్తుత బదిలీల్లో ఈ విభాగాన్ని కదిలించకపోవడం విడ్డూరం. ఇక్కడ పనిచేసేవారిలో కొందరు పదేళ్లకుపైగా పాతుకుపోయారు. పైగా వీరు వైకాపా పెద్దలతో మంచి పరిచయాలు ఉన్నవారే. అయినా వారు ఇప్పుడు బదిలీ కాకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కొందరికి కోరుకున్న చోటే..**

జిల్లాలో కొందరికి కోరుకున్నచోటే విధులు అప్పగించడం మిగిలిన వారిలో నిరాశ మిగిల్చింది. బదిలీ ప్రక్రియలో ఎస్పీతోపాటు ఉండే కొందరు అధికారులు తమవారు అనుకునే కొందరికి స్థానికంగానే విధులు కేటాయించారు. అందులో.. యాదమరిలోని ఓ కానిస్టేబుల్‌ను చిత్తూరు ట్రాఫిక్(నివాసం చిత్తూరు నగరం)కు, మరొకరిని కల్లూరు (నివాసం తలపులపల్లి.. కల్లూరుకు 12 కి.మీ.)కు, సదుంలోని ఓ కానిస్టేబుల్‌కు చిత్తూరు క్రైం కేటాయించారు. ఎస్పీ పునఃపరిశీలించి కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయాలని వేడుకుంటున్నారు.

# క్రికెట్ మైదానం.. సరికొత్త హంగులతో..!

తిరుపతి : తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. క్రీడా మైదానాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇందులో భాగంగా తిరుపతి స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన క్రికెట్ స్టేడియంను శాప్ స్వాధీనం చేసుకొని క్రీడాకారుల సాధనకు, పోటీలకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది.

జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పరిధిలో ఉన్న శ్రీశ్రీనివాస క్రీడా సముదాయానికి అనుసంధానంగా నూతన క్రికెట్ స్టేడియంతో పాటు సమీకృత క్రీడా సముదాయం అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు తిరుపతిలో క్రికెట్ పోటీలకు అనువుగా ఎస్వీయూ తారకరామ మైదానం మాత్రమే ఉండేది. శాప్‌నకు



సంబంధించిన స్టేడియం ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్న ఆలోచనతో శాప్ ఛైర్మన్ రవి నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా తిరుపతి స్మార్ట్‌సిటీ నిధులతో గొల్లవానిగుంటలో నిర్మించిన క్రికెట్ స్టేడియంను శాప్ ఆధీనంలోకి తీసుకోవడానికి కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యను ఒప్పించారు. ఇటీవల పలు అంశాలపై చర్చించారు.అదనంగా చేపట్టేలా..: 65 మంది సీటింగ్ సామర్థ్యంతో పెవిలియన్, 315 మంది సీటింగ్ సామర్థ్యంతో గ్యాలరీ నిర్మాణదశలో ఉంది. రూ.6 కోట్లలో రూ.4.5 కోట్ల పనులు పూర్తయ్యాయి. గొల్లవానిగుంటలో సమీకృత క్రీడా సముదాయం నిర్మాణం కోసం అదనంగా రూ.2 కోట్ల ప్రతిపాదన సిద్ధంగా ఉంది.

# పేదల ఇళ్లలో దీపం వెలుగు

కర్నూలు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. పేదల కష్టాలు తీరుస్తోంది. వారికి అండగా నిలుస్తోంది. ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గతేడాది నవంబరులో దీపం–2 పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8.77 లక్షల మంది అర్హులున్నట్లు గుర్తించారు.

**ఇక వారం రోజులే గడువు**

ఉచిత దీపం పథకానికి ఇక వారం రోజులే గడువు ఉంది. మార్చి నెలాఖరుతో ఈ ఏడాది కోటా గడువు పూర్తవుతుంది. ఇంకనూ 1.10 లక్షల మంది ఈ పథకానికి దూరంగా ఉన్నారు. ఈనెలాఖరులోగా వీరందరూ ఉచిత గ్యాస్ కోసం నమోదు చేసుకుంటే వారికి రాయితీ సొమ్ము జమవుతుంది. అర్హులైనవారు త్వరితగతిన నమోదు చేసుకుని రాయితీ సొమ్ము పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్చి 2026 వరకు కొత్తగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తారు. ఏడాదిలో మూడు సిలిండర్లు పొందే అవకాశం ఉండటంతో రూ.180 కోట్లకు పైగా లబ్ధి కలుగుతుందని అంచనా వేస్తున్నారు.

**వెంటనే రాయితీ నగదు జమ**

ఉమ్మడి జిల్లాలో 8,77,521 మంది లబ్ధిదారులు అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 7,67,691 మంది గ్యాస్ వినియోగదారులు ఉచిత దీపం పథకం కోసం నమోదు చేసుకున్నారు. అందులో 7,58,580 మంది లబ్ధిదారులకు రూ.59.95 కోట్లను వారి ఖాతాలో జమ చేశారు. మరో 34,089 మందికి సంబంధించి వివిధ కారణాలతో రాయితీ పెండింగ్‌లో ఉంది. వీరికి త్వరలో జమ చేయనున్నారు. ఇప్పటివరకు ఉచిత గ్యాస్‌కు బుకింగ్ చేసుకున్న వారిలో కర్నూలు జిల్లాలో 98.82, నంద్యాల జిల్లాలో 98.80 శాతం మందికి రాయితీ జమైంది.

**చాలావరకు సమస్యలు పరిష్కరించాం**

రాజా రఘువీర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కర్నూలు

దీపం–2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులు నమోదు చేసుకున్న తక్షణమే అందిస్తున్నాం. రాయితీ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతోంది. రాయితీ సొమ్ము పడలేదని ఫిర్యాదులు రాగా చాలావరకు సమస్యలు పరిష్కరించాం. ఆధార్ కార్డు బ్యాంకు ఖాతాకు లింకు కాకపోవడం, బ్యాంకు ఖాతా నంబరు నమోదులో తప్పులు రావడం తదితరాలను పరిష్కరిస్తాం.

# కరివేపాకు ఎగుమతికి కష్టాలు

గుంతకల్లు : రైల్వే ఉన్నతాధికారుల తీసుకున్న నిర్ణయాలతో గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి ప్రాంతాల్లో కరివేపాకు సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైల్వే శాఖ సైతం పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతోంది.

**అస్తవ్యస్త నిర్ణయాలతో ఇక్కట్లు**

ఇది వరకు గుంతకల్లులో రోజూ ఉదయం పది గంటల లోపు కరివేపాకును



రైళ్లలో లోడింగ్ చేసేవారు. కన్యాకుమారి నుంచి ముంబయికి వెళ్లే జయంతి జనతా ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి ముంబయికి వెళ్లే మెయిల్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేవి. కరోనా సమయంలో జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌ను ముంబయి వరకు నడపకుండా పుణె వరకు మాత్రమే నడుపుతున్నారు. ఫలితంగా రైతులు ముంబయికి కరివేపాకును రవాణా చేసే సౌకర్యాన్ని కోల్పోయారు. ఇక మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలును ఉదయం కాకుండా మధ్యాహ్నం గుంతకల్లు వచ్చే విధంగా సమయాన్ని మార్చారు.

**గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాల్లో**

రోజూ రైళ్ల ద్వారా 400 నుంచి 500 బస్తాల ఆకును రవాణా చేసేవారు. ఇదంతా తక్కువ ధరలోనే ముంబయికి చేర్చేవారు. ఒక లారీ ఆకును రవాణా చేయాలంటే దాదాపు రూ. 40 వేలు ఖర్చు అవుతోంది. రైలులో రూ. 10 వేలకు మించి కాదు. గతంలో రైల్వేకు ప్రతినెలా కరివేపాకు రవాణా ద్వారా రూ. 50 లక్షలకు పైన వచ్చేది. ఇప్పుడాపరిస్థితి లేదు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# బోధన ఆదర్శం.. భవిత బంగారం

ఆలూరు : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలనే సంకల్పంతో ఆదర్శ పాఠశాలలకు శ్రీకారం చుట్టారు. ఆదర్శ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి ప్రకటన జారీ చేశారు. ఈ నెల 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానున్నాయి.

**భవితకు చక్కని అవకాశం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 36 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలల వద్దే వసతి గృహాలు నిర్మించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు బాలికలు వసతిగృహంలోనే ఉంటూ చదువుకునే అవకాశం కల్పించారు. పేద ప్రతిభావంతులైన పిల్లలకు పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమ విద్య అందిస్తున్నారు.

**పాఠశాల ప్రత్యేకతలు**

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే ఆవరణలో చదువుకునే అవకాశం. అత్యాధునిక తరగతి గదుల్లో ఆంగ్ల మాధ్యమం, క్రమ శిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన. ఉన్నత విద్యార్హతలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన. ఎన్ఎమ్ఎమ్ఎస్, ఒలింపియాడ్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను ఆరో తరగతి నుంచే సన్నద్ధం చేయడం. శారీరక, మానసిక దృఢత్వం కోసం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం.



**ప్రవేశ పరీక్షతో ఎంపిక**

ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు ఉంటాయో అక్కడే ప్రవేశ పరీక్ష రాయొచ్చు. ప్రవేశ పరీక్షల్లో ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు వచ్చి ఉండాలి. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

**ఆన్‌లైన్‌లో నమోదు**

ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రకటన జారీ చేశారు. ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి.. అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్, నెట్ బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లించిన తరువాత ఒక జనరల్ నెంబర్ కేటాయిస్తారు. ఈ నెంబరు ఆధారంగా %www.csw. ap.gov.in% -లేదా %www.apms.ap.gov.in%- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఇవీ అర్హతలు** ఓసీ, బీసీలకు చెందిన విద్యార్థులు 01-09-2013 - 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2011 - 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీల వారు రూ.150 రుసుం చెల్లించాలి. ప్రభుత్వం లేక ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2023-2024 - 2024-2025 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. సద్వినియోగం చేసుకోవాలిరాఘవరావు, ప్రిన్సిపల్, ఆలూరు ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రకటన జారీ చేశారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఐదో తరగతి పూర్తిచేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆదర్శ పాఠశాలలు కొనసాగుతున్నాయి. నాణ్యమైన విద్యా బోధనతో

# డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్.. పెళ్లిళ్లకు పర్యాటక హోటళ్లు!



విశాఖపట్నం: డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఆదరణ పెరుగుతోంది. దూర ప్రాంతాల నుంచి పరిమిత సంఖ్యలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో వచ్చి వివాహాలు చేసుకునేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్రెండ్‌ను అందిపుచ్చుకునేలా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్రణాళిక చేస్తోంది. సంస్థకు చెందిన హోటళ్లను అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తోంది. కొత్తగా నవీకరించిన వాటిల్లోనూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. వివాహ వేదికలు, మందిరాలు, విడిది గదులు, ప్రత్యేక భోజన మెనూ సమకూర్చనున్నారు. ఉన్నతాధికారులు వీటి మీద దృష్టి సారించాలని ఆదేశించడమే కాకుండా 2025 వివాహ ముహూర్తాల క్యాలెండర్‌ను ప్రత్యేకంగా అందించడం గమనార్హం.

**డీవీఎం ఆధ్వర్యంలో..**

డివిజన్ పరిధిలో ఏపీటీడీసీకు విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏడు రిసార్టుల్లో 200 గదులున్నాయి. వీటిలో అరకు, అనంతగిరి, లంబసింగి, విశాఖలోని రిసార్టులను డెస్టినేషన్ వెడ్డింగ్, పుట్టినరోజు, వార్షికోత్సవాలు, కంపెనీల మీట్లు, అధికారిక సమావేశాలకు విరివిగా వినియోగించావాలని చూస్తున్నారు. వాటిల్లో బిజినెస్ డెవలప్‌మెంట్ కోసం డీవీఎం ఆధ్వర్యంలో ముగ్గురు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్ సంస్థలు, కంపెనీలతో నిత్యం అందుబాటులో ఉండి డిమాండు కల్పించేలా చేయాలి.అరకులోని మయూరి, వ్యాలీ రిసార్టులను ఇటీవల నవీకరించారు. గదులను విలాసవంతంగా మార్చారు. ఇక్కడ క్రాఫ్ట్ హట్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. అనంతగిరి, లంబసింగిలో ఆరుబయట వేడుకలకు ఏర్పాట్లున్నాయి. ఇందుకోసం లంబసింగి వద్ద అదనపు గదులు నిర్మించాలని చూస్తున్నారు.

టూరిజం రిసార్టులను సినిమాలు, లఘు చిత్రాల చిత్రీకరణకు ఇచ్చి వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తారు.

డిజిటల్ ప్రచారంతో... డివిజన్‌లోని ఏపీటీడీసీ రిసార్టులకు తగిన ప్రచారం కల్పించి రెవెన్యూ పెంచుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ వేదికలైన ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ట్రావెల్స్ గ్రూపులతో వాట్సాప్‌గ్రూపులు నిర్వహించడం వంటివి చేయాలనుకుంటున్నారు. రిసార్టుల్లోని అందాలు, సహజ వాతావరణ పరిస్థితులు, ఇతర ప్రత్యేకతలను వీడియోలు చిత్రీకరించి డిజిటల్ వేదికల్లో తరచూ పంచుకునేలా ప్రణాళిక చేస్తున్నారు. అలాగే పలు రంగాల్లో పేరొందిన వ్యక్తులను ప్రచారకర్తలుగా నియమించుకోవాలని చూస్తున్నారు. వారితో టూరిజం హోటళ్ల ప్రత్యేకతలను వివరింపజేయనున్నారు. స్థానికంగా ఇది కొంత సత్ఫలితాలు ఇస్తుందని భావిస్తున్నారు.

**ఆదాయం రెట్టింపయ్యేలా..** గత కొంతకాలంగా విశాఖ కేంద్రంగా ఏపీటీడీసీకు వస్తున్న ఆదాయం తక్కువగా ఉంది. దీన్ని రెట్టింపు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు తగిన ప్రణాళికలను రూపొందించాం. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఆరు రిసార్టులు, బొర్రా గుహలు, టూరిజం ప్యాకేజీలు, జల విన్యాసాలతో రూ. 19.77 కోట్ల ఆదాయం వచ్చింది. దీన్ని రూ.40 కోట్లకు పెంచడానికి వ్యూహాలు అమలు చేస్తున్నాం. ఎక్కడెక్కడి నుంచి ఎంత వస్తుందో సమీక్షించుకొని పెంచుకునే అవకాశాలున్న చోట పరిశీలిస్తున్నాం. జి.జగదీష్, డీవీఎం, ఏపీటీడీసీ

# అక్రమాలకు ఆధార్

ఆలూరు :కర్నూలుకు చెందిన స్వర్ణలత 2000 సంవత్సరంలో మునగాలపాడు పరిధిలో స్థలాలు కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కర్నూలుకు చెందిన రఘు కన్నేశాడు. రమాదేవి అనే మహిళను మీసేవా కేంద్రానికి తీసుకెళ్లి స్వర్ణలత పేరిట తప్పుడు ఆధార్ కార్డు సృష్టించారు. ఆమె స్థల యజమాని అని చూపి ఇంకొందరికి స్థలం విక్రయించారు. ఈ విషయం బయటపడటంతో 2012లో కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

2. కర్నూలుకు చెందిన లక్ష్మీదేవి అనే మహిళ 20 ఏళ్ల కిందట కర్నూలు సమీపంలోని జొహరాపురం రోడ్డులో స్థలం కొనుగోలు చేశారు. ఆమె హైదరాబాద్‌లో స్థిరపడినట్లు ఓ మాజీ కార్పొరేటర్ కుమారుడు తెలుసుకున్నాడు. ఓ మహిళను మీ సేవా కేంద్రానికి తీసుకెళ్లి లక్ష్మీదేవి పేరుతో ఆధార్ కార్డు తీసుకుని స్థల యజమానిగా చూపి మరొకరికి విక్రయించారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, ఆదోని నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2002 తర్వాత మాత్రమే ఫొటోతో కూడిన రిజిస్ట్రేషన్ విధానం అమలులోకి వచ్చింది. అంతకుముందు వరకు




ఆస్తి కొనుగోలుదారులు, విక్రయదారుల పేర్లు, చిరునామా వివరాలు నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేవారు. అప్పట్లో ఆధార్ కార్డులు కూడా ఉండేవి కావు. ఆ తర్వాత నుంచి ఆధార్ కార్డు అమలులోకి రావడంతో దీనిని రిజిస్ట్రేషన్‌కు తప్పనిసరి చేశారు. ఇదే అవకాశంగా తీసుకుని పలువురు అక్రమార్కులు బరితెగిస్తున్నారు. 2002 ముందు ఆస్తులు కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించి వారి పేర్లతో ఆధార్ కార్డులు, నకిలీ పత్రాలు తయారుచేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఫొటోతో కూడిన రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో స్థల యజమాని ఎవరో తెలియక, తప్పుడు ఆధార్ కార్డులను చూసి యజమానులుగా నమ్మి కొనుగోలుదారులు మోసపోతున్నారు. అసలైన స్థల యజమానులు కొన్నేళ్ల తర్వాత వారి స్థలాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుసుకొని న్యాయం చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కంప్యూటర్ సెంటర్ల అడ్డాలు

ఆధార్ కార్డును అన్నింటికీ తప్పనిసరి చేయంతో ఉమ్మడి జిల్లాలో పలు జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు నకిలీ ఆధార్ కార్డుల తయారీ కేంద్రాలుగా మారుతున్నాయి. డబ్బులిస్తే చాలు.. ఆధార్ కార్డులో చిరునామా మార్చేస్తున్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేయడం తదితరాలు చేస్తున్నారు. కర్నూలులోని ఓ ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు రూ.వెయ్యి తీసుకుని నకిలీ ఆధార్ కార్డు తయారుచేసి ఇవ్వడంతో హైదరాబాద్‌లో స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేసేశారు. కోర్టు విచారణకు హాజరుకాని వారి గురించి ఆరా తీసేందుకు వెళ్లి పోలీసులు సైతం తప్పుడు ఆధార్ కార్డుల చిరునామాతో కంగుతింటున్నారు.

# కస్తూర్బా విద్యాలయాలకు తాజా పాలు



విశాఖపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు వసతితో కూడిన బోధన అందిస్తున్న కస్తూర్బా విద్యాలయాల భోజన విషయంలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత మరింత నాణ్యతపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు తాజా పాలను అందించేలా సంబంధిత శాఖ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం గుత్తేదారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలో నక్కపల్లి, ఎస్.రాయవరం, వేములపూడి, రోలుగుంట, గొలుగొండ, చోడవరం, అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, చీడికాడ ఇలా 20 చోట్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు నడుస్తున్నాయి. ఇక్కడ ఆరు నుంచి ఇంటర్ వరకు బోధన, వసతితోపాటు భోజనం ఉంటుంది. మెనూలో భాగంగా వారానికోసారి మాంసాహారం, ప్రతి రోజూ కూరగాయలతో భోజనం ఉంటుంది. అదేవిధంగా పాలు, మజ్జిగ, గుడ్డు, అల్పాహారం, స్నాక్స్ ఇస్తుంటారు. వీటిని అందించేందుకు ఏటా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో టెండర్లు పిలుస్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. పిల్లలకు తాజా పాలను మాత్రమే అందించేలా మార్పు చేశారు. ఆ మేరకు ఇంతవరకు ఇస్తున్న టెట్రా ప్యాకెట్ల స్థానంలో తాజా పాల ప్యాకెట్లను పంపిణీ చేయిస్తున్నారు. టెట్రా ఇస్తే నెలలో రెండు మూడుసార్లు మాత్రమే సరఫరా చేసేవారు. దీనికి బదులు తాజా పాల ప్యాకెట్లు కచ్చితంగా రెండు రోజులకోసారి సరఫరా చేసేలా నిబంధన పెట్టారు. జిల్లా వ్యాప్తంగా రోజూ వెయ్యి లీటర్లకు పైగా వినియోగిస్తున్నారు

ఒక్కో కేంద్రానికి అవసరమైన పాలను అరు లీటర్ల ప్యాకెట్ల రూపంలో అందిస్తున్నారు. ఇవి రెండు రోజులపాటు నిల్వ ఉండటానికి వీలుగా సంబంధిత గుత్తేదారు మినీ ఫ్రిజ్‌ను విద్యాలయాలకు పంపించారు. పాల ప్యాకెట్లను వీటిలో భద్ర పరిచి వాడుతున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు 200 మి.లీ. పాలు ఇస్తారు. ఇందులో 80 మి.లీ. బూస్ట్‌లో కలిపి తాగేందుకు ఇస్తుండగా, 20 మి.లీ. పాలను రాగిజావలో కలుపుతారు. మిగిలింది మజ్జిగ రూపంలో రెండుపూటలా అందిస్తారు.

**నాణ్యత లేకుంటే వెనక్కి**

ప్రభుత్వ ఆదేశాలతో కస్తూర్బా విద్యాలయాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి పెట్టాం. దీనిలో భాగంగానే తాజా పాలను అందించాలని గుత్తేదారుకు సూచించాం. ఇలా అనకాపల్లి జిల్లాలో మాత్రమే తొలిసారి అమలు చేస్తున్నాం. ఇందుకోసం వారే ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు కూరగాయలు తాజాగా, నాణ్యతగా ఉండాలని సూచించాం. సరకు బాగుండకపోతే తీసుకోవాలని ప్రత్యేకాధికారులకు ఆదేశించాం. అదేవిధంగా బోధన నాణ్యత మరింత మెరుగుపడేలా చూస్తున్నాం.జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్ష, అనకాపల్లి

కేజీబీవీలు 20

విద్యార్థినులు 5129

రోజుకు వినియోగించే పాలు 1025 లీటర్లు

# వరుస కట్టి.. కొండను కొల్లగొట్టి

ఆలూరు : అర్ధరాత్రి అయితే చాలు.. వరుస కట్టి ఎర్రమట్టిని దోచేస్తారు. మళ్లీ పొద్దు పొడిచిందంటే చాలు తమకేం తెలియదన్నట్లుగా ఎవరి పనులు వారు చేసుకుంటుంటారు. ఆలూరులో అడ్డూఅదుపు లేకుండా ఎర్రమట్టి దందా కొనసాగుతున్నా అధికారులు మాత్రం అటువైపు తొంగి చూడటం లేదు.

**ఒప్పందం చేసుకుని..**

ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 915/బిలో 16 ఎకరాలు, 969లో 662.01 ఎకరాల కొండ, 557 సర్వే నంబరులో 105.04 ఎకరాల్లో కృష్ణాపురం కొండలు విస్తరించాయి. కృష్ణాపురం కొండ నుంచి ప్రతిరోజూ రాత్రి ఎర్రమట్టి తరలిస్తూ అక్రమ సంపాదనకు తెరలేపారు. ఈ మట్టిని పవన విద్యుత్తు సంస్థలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులతో ఒప్పందం చేసుకున్నవారు రాత్రైతే చాలు.. ఆ కొండలోకి ట్రాక్టర్లు తీసుకెళ్లి పొక్లెయిన్‌తో ఎర్రమట్టి తవ్వి ట్రాక్టర్లలో యథేచ్ఛగా



తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

**అనుమతులు లేకుండానే..**

ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే దారిలో ఏటీసీ కాల్వ గట్టుపై ఓ కి.మీ. దూరంలో ఎర్రమట్టి కొండను తవ్వి మట్టి విక్రయిస్తున్నారు. మట్టి తరలించాలంటే ఆయా శాఖల అనుమతి తప్పనిసరి. కానీ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. ఈ విషయమై ఆలూరు తహసీల్దార్ గోవింద్ సింగ్ వద్ద ప్రస్తావించగా.. రాత్రిళ్లు జరిగే మట్టి అక్రమ రవాణా సంగతి తమ దృష్టికి రాలేదని చెప్పారు. రెండు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశామని.. అక్రమ రవాణాపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో చాలాచోట్ల ఎర్రమట్టి దందా జరుగుతున్నా మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**బోర్డులున్నా..అడ్డేది**

హత్తిబెళగల్, అగ్రహారం గ్రామ పరిధిలోని ఓ కొండలో మట్టి తవ్వకాలు చేపట్టొద్దని రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని పలిపెట్టి మరోచోట గ్రామానికి దూరంగా ఉన్న కృష్ణాపురం కొండల్లో తవ్వకాలు చేపడుతున్నారు.

# స్థాయి పెరిగి.. సేవలు తరిగి

నంద్యాల : నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని జీజీహెచ్‌గా మార్పు చేసి రెండేళ్లు దాటింది. గతంలో 200 పడకలు ఉండగా.. ప్రస్తుతం 400 పడకలు చేశారు. త్వరలో 650 పడకల ఆసుపత్రిగా సిద్ధం చేయనున్నారు. అయినప్పటికీ వైద్యశాలలో అవసరమైన సేవలు అందడం లేదు. గుండె పోటుతో ఆస్పత్రికి వచ్చే రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు లేదా 80 కి.మీ దూరంలో ఉన్న కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు ఎప్పుడు వస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. **అవసరమైన భవనాలు లేక..**

ప్రస్తుతం నంద్యాల సర్వజన ఆసుపత్రిలో 400 పడకలు ఉన్నాయి. మరో 250 పడకల వరకు పెంచాల్సి ఉంది. దీనికి కావాల్సిన వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైన భవనాలు లేక పడకలు పెంచడం లేదు. ఆసుపత్రి ఆవరణలోని డీఎంహెచ్ఓ, డీసీహెచ్ కార్యాలయాలను ఖాళీ చేస్తే సుమారు 70 పడకలు పెరిగే అవకాశముంది. ఎంసీహెచ్ భవనంపై మరో అంతస్తు నిర్మించి పడకలు పెంచాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

**కర్నూలు వెళ్లాల్సిందే..**

నంద్యాల జిల్లా పరిధిలో.. ముఖ్యంగా గుండె సమస్యలతో వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజు ప్రైవేటు ఆసుపత్రుల్లో వందకు పైగా ఓపీ ఉంటోంది. స్థానిక జీజీహెచ్‌లో కార్డియాలజీ వైద్యుడు లేకపోవడంవల్లటికీ రోజుకు 10 నుంచి 15 మంది ఓపీకి వస్తున్నారు. వైద్యులు గుర్తించి టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్లు వేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు 108 సాయంతో కర్నూలు వెళ్తున్నారు. 108 వాహనం అందుబాటులో రాకుంటే ప్రైవేటు అంబులెన్సులో రూ.2,500 చెల్లించి వెళ్తున్నారు. సూపర్ స్పెషాలిటీ సేవలైన న్యూరో, నెఫ్రాలజీ వైద్యం అందుతున్నప్పటికీ కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ, రేడియాలజీ వైద్య సేవలు అందడం లేదు.

ఉన్నతాధికారులకు తెలియ జీజీహెచ్‌లో ఏకో యంత్రం ఉంది. కార్డియాలజీ వైద్యులు లేరు. గుండె సంబంధిత బాధితులు పెరుగుతున్నారు. గుండెపోటు వచ్చిన వారికి టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ ఇస్తున్నాం. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.30 వేలకుపైగా ఉంటుంది. ఈ ఇంజెక్షన్ వేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నాం. కార్డియాలజీ వైద్యుడిని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

జీజీహెచ్‌లో పడకలు 400 చికిత్స పొందేవారి సంఖ్య 300

ప్రతిరోజూ ఓపీ 1300 రోజుకు శస్త్రచికిత్సలు 2025

# ఉపాధికి బకాయిల బెడద



నంద్యాల : ఉపాధిహామీ పథకంలో పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. రూ.100 కోట్ల మెటీరియల్ నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ బిల్లులు రూ.144 కోట్లకు చేరుకున్నాయి. మరో రూ.15 కోట్ల పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. నిధులు రాకపోవడంతో రెండు జిల్లాల్లోని అత్యధిక మండలాల్లో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరోవైపు తొమ్మిది వారాలుగా కూలీలకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

**నెలన్నరగా ఎదురుచూపులు**

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు కర్నూలు జిల్లాలో రూ.23 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.21 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి 9 తర్వాత చెల్లింపులు ఆగిపోయాయి. నిబంధనల మేరకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ అప్‌లోడ్ చేసిన 15 రోజుల తర్వాత కూలీలకు వేతనాలు చెల్లించాలి. కానీ అలా జరగడం లేదు.

**సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రభావం**

ఉమ్మడి జిల్లాలో గత నవంబరు నుంచి పెద్ద ఎత్తున సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రెండు జిల్లాల్లో సుమారు రూ.210 కోట్లతో 2,039 రహదారుల పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. మూడు నెలల్లోనే 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వీటికి మెటీరియల్ నిధుల విడుదల కాకపోవడం ఇబ్బందికరంగా మారింది.

**నెమ్మదించిన పనులు**

కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు రూ.100 కోట్ల వరకు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధి పనులు నెమ్మదించాయి. నిధులు వస్తాయనే ధీమాతో రెండు జిల్లాల్లో మార్చి ఆఖరు నాటికి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనులు వేగవంతం చేశారు. వెనకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో నిధుల కొరత ప్రతిబంధకంగా మారింది.

ప్రత్యేకించి గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వ పనులపై నిధుల కొరత ప్రభావం చూపుతోంది.

నంద్యాల జిల్లాలోని వెలుగోడు, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, బండిఆత్మకూరు, గడివేముల మండలాలు, కర్నూలు జిల్లాలోని కోడుమూరు, పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి, చిప్పగిరి, సి.బెళగల్, కృష్ణగిరి, వెల్దుర్తి తదితర మండలాల్లో పనులు నెమ్మదించాయి.

నంద్యాల మండలంలోని కొత్తపల్లి, మిడుతూరు, పగిడ్యాల, రుద్రవరం, కర్నూలు జిల్లాలోని హాలహర్వి, తుగ్గలి, గోనెగండ్ల మండలాల్లో పనులు ముందుకు సాగడం లేదు.

# ఉమ్మడి పరీక్ష.. వద్దే వద్దు

తిరుపతి : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన విభాగాలు సైతం బోసిపోయి మనుగడ కోసం పోరాటం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో వేళ్లూనుకున్న రాజకీయాలు, ఉమ్మడి ప్రవేశాలతో పెద్దఎత్తున నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా వర్సిటీలకే పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తే మంచిదనే అభిప్రాయం అటు విద్యార్థులు ఇటు ఆచార్యుల్లో వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో కోర్సుల ప్రక్షాళనపైనా దృష్టి సారించి నైపుణ్యాభివృద్ధితోపాటు ఉపాధికి ఊతమిచ్చే చర్యలు తీసుకోవాలన్న విన్నపాలున్నాయి. 2019 వరకు ఆయా వర్సిటీలే ప్రత్యేకంగా పీజీ సెట్‌లు నిర్వహించేవి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి మంగళం పలికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ప్రవేశాలకు 2020-21లో మొదటిసారి ఏపీ పీజీసెట్ నిర్వహించింది. అలా ఇప్పటి వరకు ఉమ్మడిగా నాలుగు పీజీసెట్‌లు జరిగాయి. సుదీర్ఘ చరిత్రగల ఎస్వీయూలోనూ ప్రవేశాలు లేక పలు కోర్సులు మూతపడ్డాయి. కొన్నింటిలో ఒకే అంకెలో విద్యార్థులుంటున్నారు. పలు విభాగాల్లో ఆచార్యులు తప్ప విద్యార్థులు లేరన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో రాజకీయాలకు కేంద్రంగా వర్సిటీలు మారిపోవడంతో పెద్దఎత్తున



నష్టం జరిగింది.

**మహిళా వర్సిటీలో ఇలా..**

శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో 28 విభాగాలు 50 కోర్సులున్నాయి. ఇందులో 5,700 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సులు కాకుండా పీజీ కోర్సుల్లో మాత్రమే 984 సీట్లు ఉన్నాయి. 2019-20 వరకు ఎస్పీఎంవీవీ పీజీసెట్ నిర్వహించేవారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్సిటీ కావడంతో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల విద్యార్థినులు 42:36:22 నిష్పత్తిలో ప్రవేశాలు పొందేవారు. 2020 ముందువరకు కోరుకున్న కోర్సుల్లో ప్రవేశాలు దొరక్క నిరాశ చెందేవారు. అప్పటి గిరాకీ ఇప్పుడు కనిపించడం లేదు. వర్సిటీలకు ప్రత్యేకంగా పీజీసెట్ నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందని విద్యార్థి నేతలు, ఆచార్యులు పేర్కొంటున్నారు.

**పరీక్షతో నష్టం ఇలా..**

దరఖాస్తు చేసుకున్నా పరీక్షకు హాజరుకాకపోవడం

హాజరైనా సరైన కోర్సును ఎంపిక చేసుకోలేకపోవడం.

దగ్గరలోని వర్సిటీలో చేరేందుకు అవకాశం లేకపోవడం.


వ్యయభారం పెరగడం.

దగ్గరలో ఉన్నా సీటు రాలేదు

మాది కర్నూలు జిల్లా. దగ్గరలో రాయలసీమ వర్సిటీ ఉంది. కౌన్సెలింగ్‌లో అక్కడ కాకుండా మహిళా వర్సిటీలో సీటు వచ్చింది. రానుపోను ఖర్చులు, వసతి అదనపు భారం అయ్యాయి. పక్కనే యూనివర్సిటీ ఉండి ఇంతదూరం రావాల్సి వచ్చింది. కోర్సు పూర్తిచేసేలోపు ఖర్చు మరింత పెరగనుంది. సెలవుల్లో ఇంటికి వెళ్లాలన్నా కష్టమే. గాయత్రి, పీజీ విద్యార్థిని

# ఆలయాల పునర్వ్యవస్థీకరణ

చిత్తూరు : దేవాదాయ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయాలకు సంబంధించిన వివరాల నవీకరణ జరగకపోవడంతో వాటి అభివృద్ధి కార్యకలాపాలు, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియలో స్తంభన నెలకొంది. పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర దేవాదాయ శాఖ ఆలయాల పునర్వ్యవస్థీకరణపై ఉత్తర్వును జారీ చేసింది. ఆదాయ పరిమితిని సవరిస్తూ జిల్లాలో 18 ఆలయాలను జాబితాలో చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో 6(ఏ) కేటగిరీలో ఉన్న శ్రీ మొగిలీశ్వరస్వామి దేవస్థానం-బంగారుపాళ్యం మండలం, శ్రీ మాణిక్య



వరదరాజస్వామి ఆలయాల్ని (పుంగనూరు) 6(బి) కేటగిరీ కింద మార్పు చేశారు. శ్రీ 6(బి) కేటగిరీలో చిత్తూరు నగరంలోని శ్రీ సప్తకన్నికలమ్మ ఆలయం-దొడ్డిపల్లి, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం-తేనెబండ, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం-గిరింపేట, శ్రీ అగస్తీశ్వరస్వామి దేవస్థానం, శ్రీ శివషణ్ముగ సుందర వినాయకస్వామి దేవస్థానం, శ్రీ పొన్నియమ్మ ఆలయంతోపాటు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం-కార్వేటినగరం, శ్రీ సత్యగంగమ్మ దేవత ఆలయం-పాతపేట(పలమనేరు), శ్రీ రణభేరి గంగమ్మ దేవత ఆలయం-దిగువపల్లి(చౌడేపల్లి), శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయం-లక్ష్మీపురం(కుప్పం), శ్రీ ఆలియెలమ్మ దేవత ఆలయం-జీడీనెల్లూరు, పుంగనూరులోని శ్రీ భోగనంజుండేశ్వర స్వామి ఆలయాల్ని 6(సి) కేటగిరీ కింద చేర్చారు.

# అడిగేదెవరు.. దోచేయ్

చిత్తూరు : గ్రామీణ వుండలం కన్నికాపురం, సిద్ధంపల్లె రెవెన్యూ పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు.. చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి గుత్తేదారు సంస్థ సిబ్బంది కన్నికాపురం గుట్ట నుంచి కొద్ది రోజులుగా అక్రమంగా రవాణా సాగిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకపోకపోవడంపై వాహనదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్లు పునరుద్ధరించాలి** టిప్పర్లలో మట్టి రవాణాతో రోడ్లు ధ్వంసమయ్యాయి. దుమ్మూధూళి పశుగ్రాసంపై పడటంతో మేతకు పనికిరాదు. రోడ్డు పక్కన పంటలు సాగు చేసిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడం సహా ధ్వంసమైన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలి. ధనంజయనాయుడు, రైతు, ఎల్‌బీపురం

# పేరు మార్చేసి.. సొమ్ము ఎగ్గొట్టి!



అనంతపురం : నగరపాలికలో ఏదైనా వ్యాపారం చేయాలంటే ట్రేడ్ లైసెన్స్ పొందాల్సిందే. ప్రతి సంవత్సరం కొంత సొమ్ము చెల్లించి రెన్యువల్ చేసుకొని వ్యాపారాలు చేసుకోవచ్చు. రూ.కోట్లలో వ్యాపారాలు చేసుకుంటున్నా రెన్యువల్ సొమ్ము ఏళ్ల తరబడి చెల్లించకుండా దుకాణం పేరు ఒక అక్షరం మార్చో, లేక పేరు మొత్తం మార్చో కొత్త లైసెన్స్ పొందుతూ.. నగరపాలికకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. నగరంలో కమలానగర్ ప్రధాన వ్యాపార కేంద్రం. ఇక్కడ వేలల్లో వ్యాపార సముదాయాలున్నాయి. రోజుకు సరాసరి రూ.5 వేల వ్యాపారం మొదలుకొని రూ.కోట్లలో లావాదేవీలు సాగించే దుకాణాలెన్నో ఉన్నాయి. ఇందులో ఏ లైసెన్సూ పొందని దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నా అడిగేవారే లేరు. అప్పుడప్పుడు అధికారులు తనిఖీల పేరుతో సొమ్ము వసూలు చేసుకొని ఏ చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి.

**అక్రమాలు మచ్చుకు కొన్ని..**

ఈ నెల 13న కమలానగర్‌లోని ఓ దుకాణం వద్దకు నగరపాలక అధికారులు వెళితే లైసెన్సు లేకుండానే రూ.లక్షల్లోనే వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. కేవలం రూ.5 వేలు అపరాధ రుసుం విధించి వదిలేశారు.

2019 కంటే ముందు నగరంలో 26 వరకు మద్యం దుకాణాలుండేవి. కొన్నేళ్లుగా ఆయా దుకాణాల నుంచి రూ.25 లక్షలకు పైగానే కట్టాల్సి ఉన్నా శానిటేషన్ విభాగం అధికారులు, ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కై వారితో కట్టించుకోకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో 34 మద్యం దుకాణాలు వెలిశాయి. వాటికి ట్రేడ్ లైసెన్సులు వేయకుండా వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, పాఠశాలలు, రెసిడెన్సీలు, ఆసుపత్రులు, ద్విచక్ర వాహన విక్రయించే దుకాణాలు, పెట్రోలు బంకులు రెన్యువల్ సొమ్ము కట్టకుండా పేర్లు మార్చి కొత్త లైసెన్సులు పొందుతున్నారు. ఇందులో 4 కొత్త లైసెన్సులు పొందినవారూ ఉన్నారు. కొన్ని దుకాణాలపై పాత బకాయి రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పైగానే ఉంది. సొమ్ము కట్టించుకోకుండానే కొత్త లైసెన్సులు ఇవ్వడంపై భారీగా డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ మొట్టికాయ వేయడంతో బకాయిలు చెల్లించని యజమానుల వివరాలు సేకరించారు.

పాత బకాయిలు చెల్లిస్తేనే రెన్యువల్

- విష్ణుమూర్తి, నగర ప్రజారోగ్య అధికారి

గతంలో పాత బకాయిలున్నా వేర్వేరు పేర్లతో కొత్త లైసెన్సులు ఇచ్చారు. ప్రస్తుతం పాత బకాయిలు కడితేనే రెన్యువల్ చేస్తున్నాం. లైసెన్సులు లేకుండా ఏ తరహా వ్యాపారం చేసినా సంబంధిత శానిటేషన్ సెక్రటరీలు బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలి.

# ఆదుకుంటామన్నారు.. నట్టేట ముంచేశారు



అనంతపురం : చిన్న ఉద్యోగమైనా దక్కింది. ఇక ఎటువంటి కుటుంబ సమస్యలుండవు. జీవితం సాఫీగా సాగుతుంది. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించుకోచ్చునుకున్న వారి ఆశలను తుంచేసి నట్టేట ముంచేసింది రెడ్డి ఎంటర్‌ప్రైజస్ సంస్థ. వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించేందుకు క్లాప్(క్లీన్ ఆంధ్ర) పథకం కింద ఆటోలను ఏర్పాటు చేసింది. ఈ పనులను రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి ఎంటర్‌ప్రైజస్ అనే సంస్థకు అప్పజెప్పింది. మున్సిపాలిటీల్లో ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరించినందుకుగాను పన్ను వసూలు చేసి ఈ సంస్థకు ప్రతినెలా రూ.63,000 చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థే ఆటోలకు చోదకులను నియమించుకుని వారికి ప్రతినెలా రూ.16,000 (పీఎఫ్‌తో కలిపి) వేతనం ఇస్తామంది. దీని కోసం ప్రతి మున్సిపాలిటీలో సూపర్‌వైజర్లను నియమించుకుంది. ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా 130 క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసిన రెడ్డి ఎంటర్‌ప్రైజస్ సంస్థ అంతే సంఖ్యలో చోదకులను నియమించుకుంది. మున్సిపాలిటీ నుంచి ప్రతినెలా డబ్బులు వసూలు చేసిన సంస్థ చోదకులకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపింది. 2023 నవంబరు, డిసెంబరు నుంచే పలువురు చోదకులకు వేతనాలు ఇవ్వలేదు. సంస్థ ప్రతినిధులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. 2024 ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటా చెత్త పన్నును రద్దు చేసింది. దీంతో క్లాప్ వాహనాలు మున్సిపాలిటీ కార్యాలయానికే పరిమితమయ్యాయి. వేతనాల కోసం చోదకులు ఆందోళనలు చేసినా.. వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. 13 నెలల వేతనం అందాల్సి ఉంది. చోదకులకే సుమారుగా రూ.8 కోట్లకు పైగా రెడ్డి ఎంటర్‌ప్రైజస్ సంస్థ బకాయిపడింది.

**సూపర్‌వైజర్ ఉద్యోగానికి రూ.లక్ష ఇచ్చాను- రుక్మాంద, సూపర్‌వైజర్, ధర్మవరం** చెత్త తరలించే వాహనాలను సూపర్‌వైజ్ చేసే ఉద్యోగానికి రూ.లక్ష ఇవ్వాలని, ప్రతినెలా రూ.18,000 జీతం ఇస్తామని కర్నూలుకు చెందిన వీరాంజనేయప్రసాద్ అనేవ్యక్తి చెప్పడంతో నగదు అందజేశా. మొదటి మూడు నెలలు మాత్రమే వేతనం ఇచ్చారు. ఆ తరువాత 15 నెలలుగా ఇవ్వలేదు. డబ్బు తీసుకున్నవ్యక్తి, ఏజెన్సీ నిర్వాహకుల చరవాణులు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం - విశ్వనాథ్, మున్సిపాలిటీ ఆర్డీ**

క్లాప్ వాహనాల చోదకులకు రెడ్డి ఎంటర్‌ప్రైజస్ సంస్థే వేతనాలు ఇస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నారు. వారి నుంచే వేతనాలు అందేవి. సంస్థ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. క్లాప్ వాహనాలను తీసుకెళ్తున్న విషయంలో మాకు సంబంధం లేదు. చోదకుల సమస్యలు వింటే బాధగా ఉంది. ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

# జ్ఞానజ్యోతి.. సృజన క్రాంతి



హిందూపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు 'జ్ఞానజ్యోతి' పేరుతో విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యా బోధనలో మార్పులు తీసుకురానున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలను సుశిక్షిత బోధకులుగా తీర్చిదిద్దనున్నారు. దశల వారీగా వివిధ అంశాలపై 120 రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. ఇప్పటికే బత్తలపల్లి ప్రాజెక్టు పరిధిలోని ముదిగుబ్బలో కార్యకర్తలకు ఎంఈఓలు, ఐసీడీఎస్ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ఆరు రోజులుగా శిక్షణ ఇచ్చారు. కార్యకర్తలే స్వయంగా బొమ్మలు, చార్టులు తయారు చేసి ప్రదర్శించారు. పుట్టపర్తి ప్రాజెక్టు పరిధిలోని ఓడీసీలోనూ శిక్షణలో భాగంగా బొమ్మలు తయారుచేశారు.

**ఈ అంశాలపై తర్ఫీదు..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఒకటో తరగతి విద్యను అందిపుచ్చుకునేలా బోధించాలని కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,206 మెయిన్, 618 మినీ ఆరోగ్య కేంద్రాల నుంచి కార్యకర్తలు, ఆయాలు శిక్షణలో పాల్గొంటున్నారు. ప్రాథమిక దశలోనే మెరుగైన విద్యను అభ్యసించేలా క్షేత్రస్థాయిలో అమలు చేయడం కోసం అవగాహన కల్పిస్తున్నారు. మొదటి దశలో చిన్నారుల మేధోభివృద్ధికి, రెండో దశలో శారీరక అభివృద్ధి, మూడో దశలో భాషాభివృద్ధి, నాలుగు, ఐదు దశల్లో సాంస్కృతిక, సృజనాత్మకత పెంపు అంశాలపై తరగతులు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో సులువుగా నేర్చుకునేలా బొమ్మలు, చార్టులను తయారు చేయించి, సృజనాత్మకత జోడించి ఎలా బోధించాలో వివరిస్తున్నారు. చిన్నారుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు, అవసరమైన మెలకువలు, అంశాలకు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇలా మూడేళ్లలో అంగన్‌వాడీ కార్యకర్తలకు విడతల వారీగా ఏడాదికి 40 రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమం రూపొందించారు.

ప్రాథమిక దశలో మెరుగైన విద్య- వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా చిన్నారులకు ప్రాథమిక దశలోనే మెరుగైన విద్య అందించడమే జ్ఞానజ్యోతి శిక్షణ ముఖ్య ఉద్దేశం. ఐసీడీఎస్, విద్యా శాఖ కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రధానంగా చిన్నారులకు అన్ని విధాలా తీర్చిదిద్దాలని కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నాం.

# వలసల నివారణకు చర్యలు

అనంతపురం : వలసల నివారణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు ఒక కుటుంబానికి వందరోజులు మాత్రమే పనిదినాలు ఉండేవి. వంద రోజులు పనిదినాలు అయిపోయిన తరువాత సదరు కుటుంబానికి ఉపాధి పనులు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం కరవు మండలాల్లో వంద రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచుతూ కీలకం నిర్ణయం తీసుకుంది. కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తే వారు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నివారించవచ్చునని ప్రభుత్వం ఆలోచించింది. ఈ నిర్ణయాన్ని కూలీలు స్వాగతిస్తున్నారు. కరవు మండలాల్లో పనిదినాలు పెంచడం ద్వారా కూలీలకు ఆర్థిక భరోసా దక్కుతుందని అధికారులు చెబుతున్నారు.

**అడిగినవారందరికీ పనులు- సలీంబాషా, విజయేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా పీడీలు** అడిగినవారందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం. రోజువారీ ఒక్కో వేతనాదారుడికి రూ.300 కూలి ఇవ్వాలని నిర్ణయించారు. అయితే వారు చేసేపనిని బట్టి సగటున ప్రస్తుతం రోజుకు రూ.263 వరకు వేతనం పొందుతున్నారు. వలసలు నివారించడంలో భాగంగానే కూటమి ప్రభుత్వం అదనపు పనిదినాలు కల్పించింది. కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

# మన ఆరోగ్యం పదిలమేనా..?

పుత్తూరు: కొద్దిరోజులుగా ఎవరినోట విన్నా గులియన్ బారె సిండ్రోమ్ (జీబీఎస్) గురించే. మహారాష్ట్రలోని పుణెలో అధిక సంఖ్యలో జీబీఎస్ రోగులు ఉన్నారు. దీనికి ప్రధాన కారణం కలుషిత నీరు, ఆహారం, పారిశుధ్య లోపాలేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. తిరుపతిలో ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ఆహార కల్తీ జరిగినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. చిత్తూరు నగరం, ఉమ్మడి జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు తదితర పట్టణాల్లోనూ ఆహార విక్రయ కేంద్రాల పర్యవేక్షణలో అలసత్వం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాగం అప్రమత్తమై చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరాలు, పట్టణాలకు సుదూర ప్రాంతాల నుంచే తాగునీటిని అందిస్తున్నారు. తిరుపతి నగర ప్రజల దాహార్తి తీర్చడానికి కండలేరు నుంచి తరలిస్తున్నారు. శ్రీకాళహస్తికి సైతం అక్కడి జలాలే విడుదల చేస్తున్నారు. చిత్తూరు ప్రజలకు పెనుమూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి తాగునీటిని అందిస్తున్నారు. పలమనేరుకు కౌండిన్య ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. మిగిలిన మున్సిపాలిటీల్లో స్థానికంగా ఉన్న బోర్ల నుంచి పైపులైన్లు ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లీకేజీలు తోడు సుచీశుభ్రత లేని బయటి ఆహారంతో జీబీఎస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జిల్లాలో నగరపాలక సంస్థ: 1



మున్సిపాలిటీలు: 4

జనాభా: 4.5 లక్షలు


కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు..

తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలు పట్టణాలు, పంచాయతీల్లో మురుగునీటి కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. వర్షాకాలంలో అయితే మురుగునీటి కాలువల్లో ఉన్న పైపులైన్లలో నీరు చేరి ఒక్కోసారి డయేరియా ప్రబలిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది పుత్తూరులోని నందిమంగళంలో తాగునీటి కలుషితం కారణంగా డయేరియా ప్రబలి ముగ్గురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అప్పటికప్పుడు పైపులైన్లు కొత్తవి వేయడంతో అదుపులోకి వచ్చింది. కాలువల్లో పైపులైన్లు, కుళాయిలు ఆందోళన కలిగించే అంశం. దీనికితోడు పలు ప్రాంతాల్లో కుళాయిల పక్కనే చెత్తాచెదారాలు ఉంటున్నాయి. కాలువల్లోని పైపులైన్లు త్వరితగతిన బాగుచేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి..** నగరాలు, పట్టణాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా తాగునీటి లీకేజీలు, పైపులైన్ల మరమ్మతులు, మురుగునీటి కాలువల్లో ఉన్న పైపులైన్ల వ్యవస్థను పర్యవేక్షించాలి. ఆహార కల్తీ జరగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# అండగా.. ఆపద్బంధు

గూడూరు : రైతుల కోసం వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీల్లో రైతు బంధు పథకం ద్వారా ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. పెద్ద రైతులు పండించిన ధాన్యాన్ని రైసు మిల్లుల ద్వారా ఎగుమతి చేసి గిట్టుబాటు ధరకు విక్రయిస్తున్నారు. నిల్వచేసుకునే అవకాశం లేని సన్న, చిన్నకారు రైతులు పండించిన ధాన్యాన్ని రుణ బాధలతో కోతలు కోసిన రోజున తక్కువ ధరకు స్థానిక వ్యాపారులు, దళారులకు విక్రయించి



నష్టపోతున్నారు. ప్రస్తుతం సీజన్‌లో వ్యవసాయశాఖ ఈ పథకం గురించి అవగాహన కల్పించడం ద్వారా రైతులు ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

మార్కెట్ కమిటీల వివరాలు

మొత్తం కమిటీలు: 12

గోదాములు: 30


ధాన్యం నిల్వ సామర్థ్యం: 70 వేల టన్నులు

**12 మార్కెట్ కమిటీల్లో పథకం అమలు**

జిల్లాలో నాయుడుపేట, వాకా డు, సూళ్లూరుపేట గూడూరు వెంకటగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు బీఎన్‌కండ్రిగ, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి, పాకాల మార్కెట్ కమిటీల్లో రైతుబంధు పథకం ద్వారా ధాన్యం నిల్వచేసుకునే అవకాశం ఉంది. ఐదెకరాల లోబడి ఉన్న రైతులు 550 బస్తాలు వరకు ఈ పథకంలో 270 రోజులు ఉచితంగా ధాన్యం నిల్వచేసుకునే వెసులుబాటు ఉంది. నిల్వచేసిన ధాన్యం విలువలో 75 శాతం రుణం పొందొచ్చు. వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అవసరమైనప్పుడు విక్రయం.. సన్న, చిన్న రైతులు 270 రోజులు వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దాచిన ధాన్యంపై రుణం ఇస్తాం. ఇంటి దగ్గర ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేని రైతులు దరఖాస్తు చేసుకుంటే గోదాములో వసతి కల్పిస్తాం. అవసరమైనప్పుడు అమ్ముకునే అవకాశం ఉంది. ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి, నాయుడుపేట, వాకాడు

# అందాల నభా శిల్పం

కన్నడ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన నభా నటేష్ టాలీవుడ్‌లో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో పరిచయం అయింది. ఆ సినిమాలో నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది. ఆ సినిమాతో దక్కిన గుర్తింపుతో టాలీవుడ్‌లో వరుస సినిమా ఆఫర్లు సొంతం చేసుకుంది. 2019లో ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించి సూపర్ హిట్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఆ సినిమాలో నభా నటేష్ యాక్టింగ్, డైలాగ్ డెలివరీ అన్నింటికి మంచి మార్కులు పడ్డాయి. అయితే ఆ సినిమా సక్సెస్‌ను నభా సరిగ్గా వినియోగించుకోవడంలో విఫలం అయింది. ఆ సినిమాల తర్వాత నభా ఎంపిక చేసుకున్న సినిమాల వల్ల కెరీర్‌లో మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సి వచ్చింది. నితిన్ హీరోగా నటించిన మాస్ట్రో, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన అల్లుడు అదుర్స్ సినిమాల తర్వాత నభా నటేష్ పెద్దగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. గత ఏడాది డార్లింగ్ అనే వెబ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరోసారి ఆ సినిమాలోనూ మంచి నటనతో ఆకట్టుకుంది. అయినా కూడా సినిమాల్లో ఈమెకు ఆఫర్లు దక్కడం లేదు. సోషల్ మీడియాలో



రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. ఇన్‌స్టా ఫోటో షూట్స్‌తో ఎప్పుడూ వైరల్ అవుతూ ఉండే నభా నటేష్ మరోసారి తన అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. క్వీన్ ఆఫ్ యువర్ హార్ట్ అంటూ లవ్ ఈమోజీని షేర్ చేసిన నభా నటేష్ తన అందంతో చూపు తిప్పునివ్వడం లేదు. అందాల శిల్పం మాదిరిగా కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్‌తో, గ్లామర్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న నభా నటేష్ మరోసారి ఈ ఫోటోలతో యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. నడుము అందంను చూపిస్తూ నభా ఇచ్చిన ఈ ఫోజ్ అందమైన శిల్పంను గుర్తు చేస్తుందని, ఎల్లోర శిల్పం తరహాలో నభా నటేష్ అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న నభా నటేష్‌కి ఇండస్ట్రీలో ఆఫర్లు ఎందుకు రావడం లేదంటూ పలువురు షాక్ అవుతున్నారు. 2015లో కన్నడ చిత్రం వజ్రకాయతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. కన్నడంలో వరుసగా లీ, సాహెబా సినిమాల్లో నటించింది. మూడు సినిమాల్లో నటించిన తర్వాత తెలుగు నుంచి ఈమెకు ఆఫర్ దక్కింది. సుధీర్‌బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా తర్వాత తెలుగులో ఈమెకు అదుగో సినిమాలోనూ ఆఫర్ దక్కింది. 2018 నుంచి వరుసగా తెలుగు ప్రాజెక్ట్‌లను చేస్తూ వస్తుంది. ఆ మధ్య కాలంలో కాస్త గ్యాప్ ఇచ్చిన నభా నటేష్ మళ్లీ హీరోయిన్‌గా బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తుంది. త్వరలోనే ఈమెకు ఆఫర్లు దక్కుతాయని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు.

# యంగ్ టైగర్ హలీమ్‌ని క్షమించేదే లేదంటున్నాడే!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ నాన్ వెజ్ ప్రియుడని చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ చికెన్-మటన్ బిర్యానీ అంటే సింగిల్ గా హండీలే లాగించేస్తాడు. అంతేనా మంచి వంటగాడు కూడా. స్నేహితులొచ్చినా ..చుట్టాలొచ్చినా తానే స్వయంగా బిర్యానీ వండి వడ్డిస్తాడు. ఆదివారం వచ్చిందంటే? వంట గదిలోనే ఉంటాడు. అన్నయ్య కళ్యాణ్ రామ్ కి ఫోన్ చేసి ఇంటికి రప్పించుకుని బిర్యానీ రుచి చూపించనిదే ఒప్పుకోడు. అన్నయ్య అంటే అంత ప్రేమ ఎన్టీఆర్ కి. ఇక ప్రపంచంలో రకరకాల నాన్ వెజ్ వంటకాలు అన్నా? అంతే అమితంగా ఇష్టపడతాడు. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో? ఎన్టీఆర్ హలీమ్



సీక్రెట్ కూడా లీక్ చేసాడు. రంజాన్ మాసం అంటే హైదరాబాద్ అంతా హలీమ్ తోనే ఘుమఘుమలాడుతుంది. హలీమ్ కేవలం ఈ ఒక్క సీజన్ లో నే దొరుకుతుంది. కాబట్టి హలీమ్ రుచి చూడటానికి అంతా ఇష్టపడతారు. కానీ తారక్ మాత్రం హలీమ్ ఎప్పుడు తినాలనుకుంటే అప్పుడు తానే స్వయంగా సిద్దం చేసుకుంటాడుట. చికెన్ బిర్యానీ ఎంత ఇష్టమో ? అంతకంటే ఎక్కువగా హలీమ్ ఇష్టం అంటున్నాడు. హలీమ్ తయారు చేయడం అంటే మనసు పెట్టి పని చేస్తానంటున్నాడు. తాను ఏది వండినా కేవలం ఇంట్లో వాళ్ల కోసం మాత్రమే కాకుండా స్నేహితుల్ని, సన్నిహితుల్ని పిలిచి మరీ తిని వెళ్లే వరకూ ఒప్పుకోడుట. అదీ తారక్ గొప్పతనం. ఇక తారక్ సినిమాల విషయానికి వస్తే తారక్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో %-%డ్రాగన్%-% తెరకె క్కుతోన్న సంగతి తెలిసిందే. ఇది నీల్ మార్క్ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. సీ బ్యాక్ డ్రాప్ లో సాగే డ్రగ్స్ మాఫియా స్టోరీ. ప్రస్తుతం సెట్స్ లో ఉందీ చిత్రం. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ లో తారక్ జాయిన్ అవుతాడు. అలాగే బాలీవుడ్ లో వార్ 2లోనూ తారక్ నటిస్తోన్న సంగతి తెలిసిందే.




# సీక్వెల్ కి ఇంత 'లో' బజ్ ఏంటి..?



ఓ పక్క స్టార్స్ తో సినిమాలు చేస్తూనే మరోపక్క లో బడ్జెట్ తో సినిమాలు చేయడం ప్రతి నిర్మాణ సంస్థ చేస్తున్న పనే. అందులో సితార బ్యానర్ ఈ లో బడ్జెట్ సినిమాలతో కూడా స్టార్ సినిమాల రేంజ్ ఇంపాక్ట్ కలిగేలా చేస్తున్నారు. అలా సితార బ్యానర్ నుంచి వచ్చి సూపర్ హిట్ అయిన సినిమా మ్యాడ్. రెండేళ్ల క్రితం రిలీజైన ఈ సినిమా ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి ప్రేక్షకులను అలరించింది. సినిమా యూత్ ఆడియన్స్ కి ఒక మంచి ఫన్ ఫిల్డ్ ఎంటర్టైనర్ గా ఎట్రాక్ట్ చేసింది. సితార బ్యానర్ సత్తా ఏంటో మ్యాడ్ ప్రూవ్ చేసింది. కొత్త వాళ్లతో కూడా సినిమా తీసి సూపర్ హిట్ కొట్టారు. మ్యాడ్ సినిమాలో ఎన్ టీ ఆర్ బావమరిది నార్నె నితిన్ తో పాటు సంగీత్ శోభన్, రాం నితిన్ నటించారు. ఈ ముగ్గురు చేసిన హంగామా థియేటర్ లో నవ్వులు పూయించడమే కాదు సితార బ్యానర్ కు కాసుల వర్షం కురిపించింది. మ్యాడ్ సినిమాలో సాంగ్స్ కూడా సూపర్ హిట్. భీమ్స్ మ్యూజిక్ ట్రాక్స్ తెగ వైరల్ అయ్యాయి. ఇక సినిమాలో కొన్ని ఫన్నీ సీన్స్ కోసం కూడా రిపీటెడ్ ఆడియన్స్ వచ్చారు. మ్యాడ్ సినిమా ఈ రేంజ్ సక్సెస్ అవ్వడంతో మ్యాడ్ స్క్వేర్ అంటూ ఆ సినిమా సీక్వెల్ ప్లాన్ చేశారు మేకర్స్. కళ్యాణ్ శంకర్ డైరెక్షన్ లో వచ్చిన మ్యాడ్ సినిమా సక్సెస్ అందుకోవడంతో పాటు సీక్వెల్ అనగానే మరింత బాధ్యత మీద పెట్టినట్టు అయ్యింది. ఒక సూపర్ హిట్ సినిమా సీక్వెల్ అంటే ముందు సినిమాకు మించి అంచనాలు ఏర్పడతాయి. మ్యాడ్ స్క్వేర్ విషయంలో కూడా అంతే మ్యాడ్ రేంజ్ కాదు అంతకుమించి ఎంటర్టైన్మెంట్ ఉండాల్సిందే అని ఆడియన్స్ ఎక్స్ పెక్ట్ చేస్తారు. ఐతే మ్యాడ్ స్క్వేర్ లో కూడా ఎంటర్టైన్మెంట్ విషయంలో ఢోకా లేదన్నట్టుగానే చెబుతున్నారు. సినిమా ప్రమోషనల్ కంటెంట్ అయితే ఆడియన్స్ కి నచ్చింది. ఐతే మ్యాడ్ స్క్వేర్ సినిమా ఈ నెల 29న రిలీజ్ అవుతుంది. ఆ సినిమా తో పాటు మరో మూడు సినిమా అంటే ఒకటి తెలుగు స్టార్ సినిమా మరో రెండు డబ్బింగ్ సినిమాలు వస్తున్నాయి. ఈసారి మ్యాడ్ స్క్వేర్ కి బాక్సాఫీస్ దగ్గర టఫ్ ఫైట్ ఉంటుంది. మ్యాడ్ స్క్వేర్ తో పాటు బరిలో దిగుతున్న నితిన్ రాబిన్ హుడ్ ప్రమోషన్స్ ఒక రేంజ్ లో చేస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్ చూస్తే నితిన్ కెరీర్ లో బెస్ట్ ఓపెనింగ్స్ వచ్చేలా ఉన్నాయి. అంతేకాదు రాబిన్ హుడ్ సినిమాలో డైరెక్టర్ వెంకీ కుడుముల కామెడీ, యాక్టర్స్ టైమింగ్ ముఖ్యంగా శ్రీలీల, కెతిక గ్లామర్ తో పాటు డేవిడ్ వార్నర్ క్యామియో హైలెట్స్ కానున్నాయి. అందుకే ఆ సినిమా యూనిట్ ప్రమోషన్స్ లో కూడా టాప్ లో ఉన్నారు. ఇక ఆ సినిమాతో పాటు వస్తున్న మ్యాడ్ స్క్వేర్ కి మాత్రం అసలు బజ్ రావట్లేదు. మ్యాడ్ హీరోలు అదే నార్నె నితిన్, సంగీత్ శోభన్, రాం నితిన్ లు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నా పెద్దగా బజ్ రావట్లేదు. మ్యాడ్ స్క్వేర్ లో హీరోయిన్స్ లేరన్నట్టు నిర్మాత చెప్పారు. ప్రతి సిచ్యువేషన్ లో ఒక కొత్త అమ్మాయి ఉంటుందని అన్నారు. బహుశా ప్రమోషన్స్ లో హీరోయిన్స్ లేకపోవడం వల్ల జనాలు పట్టించుకోవట్లేదా అన్న టాక్ కూడా ఉంది. మరోపక్క డబ్బింగ్ సినిమాలైన మోహన్ లాల్ ఎల్ 2 ఎంపురాన్, విక్రం వీర ధీర శూర సినిమాలు కూడా ఈ వీకెండ్ రేసులో బలంగా ఫైట్ చేసేందుకు వస్తున్నాయి. ఎల్ 2 సినిమా ట్రైలర్ తో ఇంపాక్ట్ కలిగింది. ఎటొచ్చి మ్యాడ్ స్క్వేర్ విషయంలోనే మేకర్స్ ఎంత ప్రయత్నించినా కూడా ఆడియన్స్ నుంచి పెద్దగా రెస్పాన్స్ రావట్లేదు. మ్యాడ్ హిట్ కదా అని మ్యాడ్ స్క్వేర్ విషయంలో కాస్త బడ్జెట్ కూడా పెంచారని టాక్. సినిమా రిలీజ్ ప్రమోషన్స్ తో వస్తున్న బజ్ చూస్తేనేమో చాలా డల్ గా ఉంది. మరి ఈ సినిమా పరిస్థితి ఏంటన్నది రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. ఈ వీకెండ్ రిలీజ్ అవుతున్న సినిమాల్లో రాబిన్ హుడ్ కోసం నితిన్ ప్రమోషన్స్ చేస్తూ టాప్ ప్లేస్ లో సినిమాను ఉంచగా మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ వరుస ఇంటర్వ్యూస్ తో ఎల్ 2 ఎంపురాన్ సినిమా మీద ఆసక్తి కలిగేలా చేశారు. అందుకే ఆడియన్స్ బజ్ విషయంలో టాప్ 2 గా ఎల్ 2 ఎంపురాన్ ఉంది. ఆ తర్వాత థర్డ్ ప్లేస్ లో మ్యాడ్ స్క్వేర్ ఉంది. మరి రిలీజ్ మరో 3 రోజులు ఉంది కాబట్టి మ్యాడ్ స్క్వేర్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచి జనాల్లో సినిమా వెళ్లేలా చేస్తారా లేదా అన్నది చూడాలి. ఇదిలా ఉంటే ఈ సమ్మర్ మొదటి ఇంట్రెస్టింగ్ సినిమాల ఫైట్ ఈ వీకెండ్ జరుగుతుంది. ఏ సినిమాకు ఆ సినిమా చాలా ప్రత్యేకతతో వస్తున్నాయి. కచ్చితంగా ఈ వీకెండ్ సినీ ప్రియులకు మంచి ఎంటర్టైన్మెంట్ అందిస్తాయని చెప్పొచ్చు. కామెడీ, యాక్షన్, మాస్ ఇలా ఈ వారాంతరం సినిమాలన్నీ కూడా ఆసక్తికరమైన కథాంశాలతో వస్తున్నాయి. ఈ సినిమాల్లో ఏది బాక్సాఫీస్ దగ్గర విజేతగా నిలుస్తుంది అన్నది చూడాలి. ఐతే ఈమధ్య ఒకేసారి 3,4 సినిమాలు రిలీజైనా సరే నచ్చితే అన్నిటినీ హిట్ చేస్తున్నారు ఆడియన్స్.


# అంజలి సూపర్ స్టైలిష్ గ్లామర్ లుక్



తెలుగు అమ్మాయి అయిన అంజలి తమిళ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా దూసుకు పోతుంది. తెలుగులోనూ ఈమె పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కలేదు. తెలుగు సినిమాలతో పోల్చితే తమిళ్ సినిమాలతో అంజలికి ఎక్కువ గుర్తింపు లభించింది. ప్రస్తుతం తమిళ్‌లో పలు పెద్ద సినిమాల్లో నటిస్తున్న అంజలి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అంజలి ఏ ఫోటోలు షేర్ చేసినా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటిది స్టైలిష్ లుక్‌తో పాటు గ్లామర్ పిక్స్ షేర్ చేస్తే వైరల్ కాకుండా ఎలా ఉంటాయి. సింపుల్ ఔట్ ఫిట్‌లోనూ స్టైలిష్ లుక్‌తో మెరిపించే విధంగా అంజలి సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే బ్యూటీఫుల్ మేకోవర్‌తో పాటు, డీసెంట్ హెయిర్ స్టైల్‌తో, డిఫరెంట్ డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన అంజలి షేర్ చేసిన ఈ ఫోటోల్లో డిఫరెంట్‌గా ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చింది. నడుము అందం చూపించడంతో చూపు తిప్పుకోనివ్వడం లేదు. కొందరు హీరోయిన్స్ స్కిన్ షో చేస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కొందరు స్కిన్ షో చేస్తేనే వారి ఫోటోలను చూడగలం. కానీ అంజలి స్కిన్ షో చేయకుండానే తన అందంను చూపించి చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఒకప్పుడు కాస్త బొద్దుగా అనిపించే అంజలి ఇప్పుడు సన్నగా నాజూకుగా తయారు అయింది. సినిమాల్లో కంటే ఇలా ఫోటో షూట్స్‌లో మరింత అందంగా కనిపిస్తుంది. అంజలి 1986 జూన్ 16న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజోలులోని ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది. అంజలికి ఒక సోదరితో పాటు ఇద్దరు సోదరులు ఉన్నారు. స్కూలింగ్‌ను రాజోలులో పూర్తి చేసిన అంజలి చెన్నైకి వెళ్లి మ్యాథ్స్‌లో డిగ్రీని పూర్తి చేసింది. కుటుంబ సభ్యుల మద్దతుతో అంజలి సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమాల్లో మొదట నటించిన పెద్దగా గుర్తింపు రాకపోవడంతో తమిళ సినిమా ఇండస్ట్రీలో ప్రయత్నాలు చేసింది. మోడలింగ్‌లోనూ రాణించిన అంజలి 2006 సంవత్సరంలో ఫోటో అనే సినిమాతో అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 2007లో తమిజ్ అనే సినిమాలో నటించడం ద్వారా తమిళ నాట గుర్తింపు దక్కించుకుంది. రెండు సార్లు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డును సొంతం చేసుకున్న అంజలి తెలుగులో షాపింగ్ మాల్, జర్నీ వంటి డబ్బింగ్ సినిమాలతో గుర్తింపు దక్కించుకుంది. తెలుగులో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు లో నటించడంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించింది.ఈ ఏడాది శంకర్ దర్శకత్వంలో వచ్చిన రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమాలోనూ అంజలి సెకండ్ హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. తెలుగులో ఈమె నటించిన గీతాంజలి అనే హర్రర్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగులో మరిన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలను అంజలి చేసే అవకాశాలు ఉన్నాయి.

# కాళ్లకు చెప్పుల్లేకుండా.. ఆమె డెడికేషన్ అలాంటిది మరి

కొన్ని సినిమాల కోసం, కొన్ని పాత్రల కోసం నటీనటులు, టెక్నీషియన్లు ఎంతో కష్టపడుతూ ఉంటారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం వస్తుందో రాదో పక్కనపెడితే ఆ కష్టానికి అందరి నుంచి ప్రశంసలు మాత్రం దక్కుతాయి. ఇప్పుడు మిల్కీ బ్యూటీ తమన్నా అలాంటి ప్రశంసలే అందుకుంటుంది. టాలీవుడ్ లో తమన్నా చేస్తున్న తాజా చిత్రం ఓదెల2. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓదెల రైల్వే స్టేషన్ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతుంది. ఈ సినిమాకు సంపత్ నంది కథ అందిస్తూ నిర్మించారు. ఓదెల రైల్వే స్టేషన్ కు కొనసాగింపుగా వస్తోన్న సినిమా కావడంతో ఓదెల2 పై అందరికీ మంచి అంచనాలున్నాయి. హెబ్బా పటేల్, వశిష్ట కీలక



పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో తమన్నా నాగసాధువు గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ పాత్ర కోసం తమన్నా ఎంతో కష్టపడిందని ఆల్రెడీ రిలీజైన కంటెంట్ చూస్తుంటే అర్థమవుతుంది. ఓదెల2 కోసం తమన్నా ఎంతో బరువైన కాస్ట్యూమ్స్ వేసుకుందని, సినిమా షూటింగ్ జరిగినన్ని రోజులు చెప్పులు కూడా లేకుండా నటించిందని సంపత్ నంది రీసెంట్ గా ఓ కార్యక్రమంలో తెలిపారు. భైరవి పాత్రలో తమన్నా చాలా బాగా చేసిందని, ఇంకా చెప్పాలంటే ఆమె ఆ పాత్రలో జీవించిందని, సినిమాలో ఒక సీన్ ను ఎక్కువ ఎండలో తీయాల్సి వచ్చిందని, ఆ టైమ్ లో ఆమె కాళ్ల కింద ఆకులు వేస్తే, తమన్నా వద్దని వాటిని తీయించేసిందట. దీంతో ఆ ఎండలో కాళ్లు కాలి ఆ రాత్రికి తమన్నా అరికాళ్లకు బొబ్బలు వచ్చాయని, తమన్నాకు సినిమాపై ఉన్న డెడికేషన్ అలాంటిదని ఆయన అన్నారు. ఓదెల2 సినిమా విషయంలో తమన్నా చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. భైరవి పాత్ర చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పిన తమన్నా, తన కెరీర్లోనే ఎక్కువ ఐ క్లోజప్ షాట్స్ ను ఇందులోనే తీశారని అంటోంది. ఒక పల్లెటూరి కథను ఎంతో థ్రిల్లింగ్ గా చూపించే ప్రయత్నం ఓదెల2 ద్వారా చేశామని, ఈ సినిమా అందరికీ నచ్చుతుందని తమన్నా చెప్తోంది.

# బుక్ మై షో గేమ్‌పై బిగ్ డౌట్?

ఈ మధ్యకాలంలో తెలుగు చిత్ర పరిశ్రమలో బుక్మైషో యాప్ చుట్టూ కొన్ని అనుమానాలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. ప్రేక్షకుల ఇన్‌స్టంట్ స్పందనతో హిట్ ఫ్లాప్ డిసైడ్ అయ్యే రోజుల్లో, ఒక్క టికెట్ బుకింగ్ యాప్‌పైనే అనుమానాలు వస్తుండటం ఫోకస్ లోకి వస్తోంది. మరీ ముఖ్యంగా ఓ ప్రముఖ నిర్మాత వరుసగా వాట్సాప్ గ్రూపుల్లో తన అసంతృప్తిని బయటపెడుతున్నా, గిల్డ్‌లో పెద్ద నిర్మాతలు మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారు అన్నది ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్. ప్రస్తుతం వస్తున్న ఆరోపణలు ప్రకారం బుక్ మై షోలో బాట్స్ ద్వారా లైక్స్, ఇంటరెస్టింగ్ కౌంట్లు పెంచుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. టికెట్ బుక్ చేయని వారు కూడా ఓటింగ్ చేయగలుగుతున్న విధానం వల్ల నిజమైన ఆడియన్స్ స్పందన ఎక్కడ అనేది గుర్తించలేకపోతున్నామని నిర్మాతలు వాపోతున్నారు. కొందరు సినిమాలకు ఓవర్ హైప్, రివ్యూలు ముందుగానే ప్రాజెక్ట్ చేయడం వల్ల కంటెంట్ బలమైన సినిమాలు అవమానాన్ని ఎదుర్కొంటున్నాయని వాదిస్తున్నారు. ఇదంతా ఇండస్ట్రీ కోసం జరుగుతున్నా, బుక్ మై షోను అడగాల్సిన పెద్ద పెద్ద నిర్మాతలు మాత్రం నిశ్శబ్దం పాటిస్తున్నారన్నది గమనార్హం. ఎందుకంటే వీరిలో చాలామంది థియేటర్ల నిర్వహిస్తున్నవారే కావడం, బుక్ మై షో నుండి కోటి నుంచి 20 కోట్ల వరకూ రుణాలు తీసుకున్న సంబంధాలున్నాయని టాక్ వినిపిస్తోంది. ఇంకో కోణంగా చూస్తే, ఈ బుక్ మై షో సంస్థ స్వయంగా మల్టీప్లెక్స్‌లలో పెట్టుబడులు పెడుతోందన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవలే ఓ సీనియర్ హీరో నిర్మిస్తున్న మల్టీప్లెక్స్ ప్రాజెక్టులో బుక్ మై షో రూ.20 కోట్లు పెట్టుబడి పెట్టినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బుక్ మై షో వ్యాపార విధానాలపై బహిరంగంగా విమర్శలు చేయాలంటే కొందరికి తలవంపు అయినట్లే. ఇక ఇందులో కొందరు ప్రముఖ గిల్డ్ సభ్యులు కూడా ఉన్నారు. అందులో ప్రముఖులు కూడా ఈ వ్యవహారంపై ఇప్పటివరకు స్పందించకపోవడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536